


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 324 | శుక్రవారం | 25-10-2024 | కరీంనగర్ Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** పేజీలు: 12+8 | వెల రూ. 5.00



ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరగాలా?

ప్రభుత్వానికి గుదిబండగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

విద్యారంగం గట్టెక్కేదెట్లా?

లోపలి పేజీల్లో




## బ్రిక్స్‌కు సొంత ఆర్థిక వేదిక

కజాన్‌లో ముగిసిన ‘బ్రిక్స్’ శిఖరాగ్రం

చివరి రోజు 36 దేశాలతో బ్రిక్స్ ప్లస్ సమావేశం

హాజరైన యుఎన్ సెక్రెటరీ జనరల్

రష్యాను ఒంటరి చేసే అమెరికా యత్నాలు విఫలం : పుతిన్

‘బ్రిక్స్’ సదస్సు అతి పెద్ద విదేశాంగ కార్యక్రమం

### రష్యా అధ్యక్షుడు పుతిన్ ప్రతిపాదన

**కజాన్ :** బ్రిక్స్ దేశాలకు స్వంత ఆర్థిక వేదికను ఏర్పాటు చేసుకోవాలనే ఆలోచనపై చర్చించాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రతిపాదించారు. దీని ద్వారా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సామర్థ్యం పెరుగుతుందన్నారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి రాబోయే దశ ప్రపంచ మెజారిటీ (జనాభా) దేశాలలో మొదలవుతుందని అన్నారు. కాబట్టి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల సామర్థ్యం పెరిగేందుకు స్వంత ఆర్థిక వ్యవస్థ అవసరమని అన్నారు. బ్రిక్స్ దేశాల మధ్య పెట్టుబడులు ప్రవాహం పెంచడం ఈ వేదిక లక్ష్యమని, భారీ మౌలిక సదుపాయాల కల్పన, టెక్నాలజీ ప్రాజెక్టులపై పెట్టుబడులపై దృష్టి సారించవచ్చన్నారు. ఉక్రేన్‌లో చర్యలపై రష్యాను ఏకాకిని చేసేందుకు అమెరికా చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయని పుతిన్ వ్యాఖ్యానించారు. కజాన్‌లో జరిగిన బ్రిక్స్ సదస్సును ఇప్పటి వరకు జరగని అతిపెద్ద విదేశాంగ తరువాయి 2లో

## పెండింగ్ డిఎలపై నేడు నిర్ణయం



### ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి భట్టి అధ్యక్షతన క్యాబినేట్ సబ్‌కమిటీ

ప్రజాపక్షం/హైదరాబాద్

ఉద్యోగుల డిఎల విషయంలో శుక్రవారం సాయంత్రం లోపు ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రకటిస్తామని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన, సభ్యులుగా మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావులతో మంత్రివర్గ ఉప సంఘం ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల అంశంపైన తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల సంఘాల జెఎసి ప్రతినిధులతో (రెండు జెఎసి సంఘాల నాయకులతో వేర్వేరుగా సమావేశం) సిఎం రేవంత్ రెడ్డి హైదరాబాద్,బంజారాహిల్స్‌లోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం సమావేశమయ్యారు.ఈ సందర్భంగా ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ దీపావళి తర్వాత శాఖల వారీగా మంత్రివర్గ ఉప సంఘం సమావేశమవుతుందని వివరించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నదని, సమస్యల పరిష్కారానికి ఈ సమావేశం తొలి మెట్టు అని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. 317 జిఒ అంశంలో మంత్రివర్గ ఉప సంఘం తమ నివేదికను ప్రభుత్వానికి సమర్పించిన నేపథ్యంలో ఈనెల 26న జరగనున్న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తరువాయి 2లో

### మోదీ–జిన్‌పింగ్ ముఖాముఖీకి

## గొప్ప ప్రాముఖ్యత

భారత్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం

చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రకటన



**బీజింగ్ :** ‘బ్రిక్స్’ సదస్సు వేదికగా కజాన్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య జరిగిన ద్వైపాక్షిక సంభాషణకు ఎంతో గొప్ప ప్రాముఖ్యత ఉందని గురువారంనాడు చైనా ఒక ప్రకటన చేసింది. రెండు దేశాలమధ్య ద్వైపాక్షిక సంబంధాలను మెరుగుపరచుకోవడానికి ఒక ముఖ్యమైన ఉమ్మడి అవగాహనకు రెండు దేశాలూ వచ్చాయని, బుధవారం జరిగిన ఈ ముఖాముఖీ సంభాషణకు ఎంతో గొప్ప తరువాయి 2లో

### భారత్–చైనా సరిహద్దు వివాద పరిష్కారానికి

## నిర్మాణాత్మక ఆరంభం : సిపిఐ



**న్యూఢిల్లీ :** భారత్–చైనా దేశాలమధ్య దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు వివాద పరిష్కారానికి ‘బ్రిక్స్’ వేదిక ఆసరాగా రెండు దేశాల నాయకులమధ్య కుదిరిన అంగీకారం ఒక నిర్మాణాత్మకమైన ఆరంభమని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) పేర్కొంది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. సరిహద్దు సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రెండు దేశాలూ అనివార్యమైన రాజకీయ సంకల్పంతో తమ కృషిని ముందుకు తీసుకువెళ్ళాలని ఈ సందర్భంగా రెండు ప్రభుత్వాలకూ సిపిఐ కార్యదర్శివర్గం విజ్ఞప్తి చేసింది. రాజకీయ సంకల్పంతో చేసే ఈ విధమైన కృషి రెండు దేశాల మధ్య పూర్తి మైత్రీబంధాన్ని బలోపేతం చేయడమేకాకుండా, దక్షిణ ఆసియాలో శాంతి–సహకారాలకు కూడా పెద్ద భరోసాను ఇస్తుందని పేర్కొంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, తరువాయి 2లో

### మేడిగడ్డ ప్రాజెక్టుకు

## కెసిఆర్ అప్రూవల్



మాజీ సిఎం ఆదేశాల మేరకే పనులు చేశాం

పిసి ఘోష్ కమిషన్ ముందు మాజీ ఇఎన్‌సి వెల్లడి

డాక్యుమెంట్ ఆధారాలతో మాత్రమే చెప్పాలని కమిషన్ హెచ్చరిక

ప్రజాపక్షం / హైదరాబాద్

కాళేశ్వరం కమిషన్ బహిరంగ విచారణ కొనసాగుతోంది. గురువారం కాళేశ్వరం కమిషన్ విచారణకు రామగుండం మాజీ ఇఎన్‌సి నల్లా వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా నల్లా వెంకటేశ్వర్లుపై కాళేశ్వరం కమిషన్ సుమారుగా 90 ప్రశ్నలు సంధించింది. మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పేర్లను నల్లా వెంకటేశ్వర్లు పలు సార్లు ప్రస్తావిస్తూ నాటి ముఖ్యమంత్రి ఆదేశాల మేరకే తాము ఇరిగేషన్ పనులు చేశామని, మేడిగడ్డ ప్రాజెక్టుకు కెసిఆరే అప్రూవల్ ఇచ్చారని జ్యుడీషియల్ కమిషన్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో నల్లా వెంకటేశ్వర్లపై కాళేశ్వరం కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. జ్యుడీషియల్ తరువాయి 2లో



### వయనాడ్‌లో ఎల్‌డిఎఫ్ అభ్యర్థి

## సత్యన్ మోకెరీ నామినేషన్

అంతకుముందు ఎల్‌డిఎఫ్ కార్యకర్తల ‘భారీ రోడ్‌షో’



**వయనాడ్ :** కేరళలోని వయనాడ్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఉప ఎన్నిక పోరు ఊపందుకుంది. అధికార కూటమి ఎల్‌డిఎఫ్ తరఫున పోటీ చేస్తున్న సిపిఐ అభ్యర్థి సత్యన్ మోకెరీ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం నాడు యుడిఎఫ్ అభ్యర్థి ప్రియాంకాగాంధీ వాద్రా నామినేషన్ వేశారు. సిపిఐ నేత మోకెరీ నామినేషన్ వేయడానికి ముందు కలెక్టర్ వరకు భారీ రోడ్ షో నిర్వహించారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి బినోయ్ విశ్వం, గత ఎన్నికల్లో పోటీ చేసిన అన్నీ రాజా, సిపిఐ ఎంపి పి.సందోశ్‌కుమార్ సహా పలువురు నాయకులు, కార్యకర్తలతో కలిసి మోకరీ నామినేషన్ సమర్పించారు. ఈ ఏడాది తరువాయి 2లో

## ఒక్కొక్కరికీ రూ.93,750

- నేడు సింగరేణి కార్మికుల ఖాతాల్లో నేరుగా దీపావళి బోనస్ జమ
- పిఎల్ఆర్ఎస్ కింద రూ.358 కోట్లు విడుదల
- గత ఏడాది కన్నా రూ. 50 కోట్లు అధికం
- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క వెల్లడి



ప్రజాపక్షం / హైదరాబాద్

సింగరేణి కార్మికులకు నేడే దీపావళి బోనస్ చెల్లింపు జరుగబోతోంది. దీపావళి బోనస్‌గా పిలుస్తున్న పిఎల్ఆర్ఎస్ (ప్రొడక్షన్ లింక్డ్ రివార్డ్ స్కీమ్) బోనస్‌ను శుక్రవారం సింగరేణి కార్మికులకు చెల్లిస్తున్నట్లు రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క మల్లు గురువారం సచివాలయంలో ప్రకటించారు. దీని కోసం సింగరేణి సంస్థ 358 కోట్ల రూపాయలను విడుదల చేయాలని సింగరేణి సిఎండి ఎన్. బలరామ్‌ను ఆయన ఆదేశించారు. సచివాలయంలో సింగరేణిపై సమీక్ష సందర్భంగా ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. గత ఏడాది చెల్లించిన దీపావళి బోనస్ కన్నా ఇది రూ.50 కోట్లు అధికం కావడం విశేషం. శుక్రవారం మధ్యాహ్నం కల్లా దీపావళి బోనస్‌ను కార్మికుల ఖాతాల్లో జమ చేయాల్సిందిగా డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు స్పష్టం చేశారు. దీపావళి బోనస్ కింద ఒక్కొక్క కార్మికుడు రూ.93,750లు తరువాయి 2లో

## ఇంకా ఫిరాయింపులెందుకు?

కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వానికి కావలసిన మెజారిటీ ఉంది

కాంగ్రెస్ ముసుగులో దౌర్జన్యం చేస్తామంటే ఎలా సహిస్తాం : ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



ప్రజాపక్షం / హైదరాబాద్/జగిత్యాల

రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ దౌర్జన్యాలను తాము ఎదుర్కొన్నామని, మళ్ళీ కాంగ్రెస్ ముసుగులో దౌర్జన్యం చేస్తామంటే తాము ఎలా సహించాలని కాంగ్రెస్ సీనియర్ నాయకులు, ఎంఎల్‌సి టి.జీవన్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా కెసిఆర్ ప్రభుత్వంపై పోరాటం చేసామని, శాసనమండలిలో ఒంటరిగా బిఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టామన్నారు. కొందరు ఎంఎల్‌ఎలు అభివృద్ధి అనే నినాదంతో పార్టీ ఫిరాయించారని, కాంగ్రెస్ సుస్థిర ప్రభుత్వానికి కావాల్సిన మెజారిటీ ఉందని, ఇంకా ఎంఎల్‌ఎల ఫిరాయింపులు ఎందుకని ఆయన ప్రశ్నించారు. అసెంబ్లీ తరువాయి 2లో



### అవినీతి ఉన్నతాధికారులపై

## త్వరలో రెడ్‌బుక్

బిఆర్ఎస్ నుంచి వచ్చిన నేతలతో ఇబ్బంది వాస్తవమే

పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్

ప్రజాపక్షం / హైదరాబాద్

దీపావళి వరకు పొలిటికల్ బాంబులు ఉంటాయని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారని, ఆ బాంబుల కోసం తాము కూడా ఎదురుచూస్తున్నామని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం జరిగిందని, అందుకే కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా బిఆర్ఎస్ ఎంఎల్‌ఎలు కాంగ్రెస్‌లో చేరారని ఆయన చెప్పారు. బిఆర్ఎస్ నుండి వచ్చిన నేతల నుండి కొంత ఇబ్బంది జరగడం వాస్తవమేనని ఆయన అన్నారు. రాష్ట్రంలో అవినీతి తరువాయి 12లో



## రాష్ట్ర హోదాకు యత్నం

ప్రధానితో ఒమర్ అబ్దుల్లా భేటీ

**న్యూఢిల్లీ :** జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి ఢిల్లీలో పర్యటిస్తోన్న నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా గురువారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. జమ్ము కశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించాలని కేంద్రాన్ని కోరుతూ ఇటీవల ఒమర్ మంత్రివర్గం తీర్మానం చేసిన సంగతి తెలిసిందే. దానికి లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆమోదం కూడా తెలిపారు. తాజాగా భేటీలో ఆ తీర్మానాన్ని ప్రధానికి అందించనున్నట్లు తరువాయి 12లో

## కోట్లు కొల్లగొట్టారు...




మూతపడ్డ ఆర్‌జిఎ యాప్

పెట్టుబడిపెట్టిన వారంతా పేదలే

లబోదిబోమంటున్న సభ్యులు

ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

తమ సంస్థల్లో పెట్టుబడి పెడితే అధిక లాభాలు వస్తాయంటూ వివిధ యాప్‌ల పేరుతో స్కీమ్‌లను ఎరగా వేస్తూ ప్రజల అమాయకత్వాన్ని ఆసరగా చేసుకున్న అనేక మంది అక్రమార్కులు దోచుకుంటున్నారు. నమ్మకం కలిగేలా మొదట ఆశలు కల్పించి మధ్యలోనే మూతవేస్తున్నారు. ఇదే తరహాలో అమెరికాలోని న్యూయార్క్‌కు చెందిన ఆర్‌జిఎ మార్కెటింగ్ లిమిటెడ్ పేరుతో కొంత మంది అక్రమార్కులు యాప్‌ను రూపొందించి ఆన్‌లైన్ స్కీంను ప్రారంభించారు. ఇందులో పెట్టుబడులు పెడితే తక్కువ కాలంలో అధిక లాభాలు వస్తాయంటూ ఆశ తరువాయి 2లో

## అమరావతికి రైల్వే లైన్

- హైదరాబాద్–కోల్‌కతా– చెన్నైలతో అమరావతిని కలుపుతూ కొత్త రైల్వే ప్రాజెక్టు
- కృష్ణానదిపై 3.2 కి.మీలతో వంతెన
- ఎర్రుపాలెం–నంబూరు మధ్య నూతన మార్గం
- రూ.6,798 కోట్లు అంచనా వ్యయం
- కేంద్రమంత్రివర్గం ఆమోదం




**న్యూఢిల్లీ :** ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని అమరావతికి కొత్త రైల్వే లైన్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. సుమారు 57 కిలోమీటర్ల మేర రైల్వే లైన్‌కు మంజూరు చేసింది. తెలుగురాష్ట్రాలతోపాటు బీహార్‌కు కూడా వర్తించేవిధంగా రెండు రైలు ప్రాజెక్టులకు కేంద్రమంత్రివర్గం గురువారంనాటి సమావేశంలో ఆమోదం తెలియజేసింది. ఈ ప్రాజెక్టుల కింద రైలు మార్గాల డబ్లింగ్‌తోపాటు ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదిత రాజధాని అమరావతికి ప్రయోజనం కలుగుతుంది. తెలంగాణలో ఖమ్మంజిల్లాకు లబ్ధి కలుగుతుంది. అమరావతి మీదుగా ఎర్రుపాలెం–నంబూరు మధ్య 57 కి.మీ మేరకు కొత్త రైలుమార్గం నిర్మిస్తారు. దీనివల్ల అమరావతికి నేరుగా ప్రయాణికుల రాకపోకలుతోపాటు పారిశ్రామికంగా ప్రయోజనం కలుగుతుంది. ఈ రెండు రైలు ప్రాజెక్టులకు రూ.6,798 కోట్లు ఖర్చు అవుతాయని అంచనావేసింది. కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమిలో జెడియు, తెలుగుదేశం పార్టీల పాలనలో ఉన్న బీహార్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఈ రెండు ప్రాజెక్టులవల్ల ఎక్కువ ప్రయోజనం కలుగుతుంది. ఈ మూడు రాష్ట్రాలలో మొత్తం ఎనిమిది జిల్లాల ప్రజలకు ఈ రెండు రైలు మార్గాలవల్ల ప్రయోజన కలుగుతుంది. ఎన్‌టిఆర్‌జిల్లా తరువాయి 2లో



# ట్రూడో...దిగిపో...

## కెనడా ప్రధాని రాజీనామాకు సొంత పార్టీ ఎంపిల డిమాండ్

**కెనడా :** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు స్వపక్షంలోనే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. అక్టోబర్ 28 నాటికి ఆయన రాజీనామా చేయాలని 24 మంది లిబరల్ పార్టీ ఎంపిలు డిమాండ్ చేశారు. ఇప్పటికే మైనారిటీలో ఉన్న ట్రూడో ప్రభుత్వానికి ఇది కొత్త తలనొప్పి తెచ్చిపెట్టింది. ఆయన రాజీనామా చేయాలన్న లేఖపై మొత్తం 153మంది ఎంపిల్లో 24 మం ది సంతకాలు చేశారని కెనడా బ్రాడ్కాస్టింగ్ కార్పొరేషన్ వెల్లడించింది.

లిబరల్ పార్టీ బుధవారం అంతర్గత సమావేశం నిర్వహించింది. ఈ ఏడాది జూన్, సెప్టెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో తీవ్రంగా దెబ్బతినడానికి ప్రధాని ట్రూడో వైఖరే కారణమని ఎంపిలు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ట్రూడో సన్నిహితుడిగా పేరున్న ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ మీడియాతో మాట్లాడుతూ ఎన్నిక ల్లో ఏం జరిగిందనే విషయాన్ని ఎంపి లు నిజాయితీగా ప్రధానికి వెల్లడించారని, ఆయనకు వినడం ఇష్టం ఉన్నా లేకపోయినా వారు మాత్రం చెప్పేశారని అన్నారు. వచ్చే ఏడాది కెనడాలో ఎన్నికల నేపథ్యంలో సర్వేల్లో ట్రూడో నేతృత్వంలోని లిబరల్ ప్రభుత్వం వెనకంజలో ఉంది.

**వలసల నియంత్రణ :** వలసల నియంత్రణకు కెనడా ప్రభుత్వం తమ దేశంలోకి అనుమతించే వలసదారుల సంఖ్య ను భారీగా తగ్గించేందుకు సిద్ధమైంది. ఈమేరకు అక్కడి వార్తాపత్రికల్లో కథనాలు వెలువడ్డాయి. ఈ కథనాల ప్రకారం, 2024లో 4.85 లక్షల మందిని పర్మినెంట్ రెసిడెంట్స్‌గా కెనడా గుర్తించింది. 2025లో ఈ సంఖ్య 3.80లక్షలకు మాత్రమే పరిమితం చేసింది. 2027 నాటికి 3.65లక్షల మందికి మాత్రమే ప్రవేశం కల్పించాలని ఆలో చన చేస్తున్న ట్లు తెలుస్తోంది. దీనిపై కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో 'ఎక్స్'లో స్పందించారు. 'కెనడాలో తాత్కాలిక విదేశీ ఉద్యోగుల సంఖ్యను తగ్గిస్తున్నాం. కంపెనీలకు సంబంధించి కొన్ని కఠిన నిబం ధనలు తీసుకురానున్నాం. నియామకాల విషయంలో కంపెనీలు స్థానికులకు ఎందుకు ప్రాధాన్యం ఇవ్వలేదో వెల్లడించాల్సి ఉంటుంది' అని ఆయన పేర్కొన్నా రు.

**ట్రూడోపై విరుచుకుపడిన ప్రతిపక్షం :** కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడోకు నాశనం చేయడం తప్ప బాగు చేసే అలవాటు లేదని ప్రతి పక్ష నేత పియర్రి పొయిలీవ్రే విమ ర్శించారు. ఆయన వలసలు, గృహ విధానాలను ఏదైనా సరే నాశనం చేసి వదిలేస్తారని పార్లమెంటులో మాట్లాడుతూ అన్నారు. ట్రూడో స్వపక్షంలో కుమ్ములాటలతో తీరిక లేకుండా ఉన్నారని ఎద్దేవా చేశారు. కార్బన్ ట్యాక్స్‌కు ఎందుకు పిలుపు నివ్వడం లేదని ప్రశ్నించారు.




# స్వతంత్ర పాలస్తీనా ఒక్కటే మార్గం

## పాలస్తీనా, ఇజ్రాయెల్ కమ్యూనిస్టు పార్టీల సంయుక్త ప్రకటన

**టెల్ అవీవ్ :** సార్వభౌమ పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయడం ఒక్కటే ఈ ప్రాంతంలో శాంతి, సుస్థిరతను తీసుకువస్తుందని పాల స్తీనా, ఇజ్రాయెల్ కమ్యూనిస్టులు అంగీకరిం చారు. తక్షణమే గాజా, లెబనాన్‌లపై యుద్ధా న్ని ఆపాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇజ్రాయెల్(సిపిఐ), పాలస్తీనా పీపుల్స్ పార్టీ(పిపిపి)ల అగ్రనేతలు గత వారం సమావేశమైన అనంతరం సంయుక్త ప్రకటన చేశారు. సిపిఐ,పిపిపిలు జూమ్ ద్వారా సమావేశమ య్యారు. ఈ సమావేశానికి ప్రపంచవ్యాప్తంగా సంఘీ భావ కార్యకర్తలు అతిథులుగా హాజరయ్యారు. ఈ ప్రాంతంలో ప్రమాదకర స్థాయిలో ఉద్రిక్తతలు పెర గడం, ప్రత్యేకించి లెబనాన్‌పై ఇజ్రాయిల్ ప్రధాన మంత్రి బెంజామిన్ నెతన్యాహూ దాడులు చేయిం చడం, పాలస్తీనా, ఇజ్రాయిల్‌లో రాజకీయ పరిస్థితు లపై ఆన్‌లైన్ సమావేశంలో చర్చించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి అదెల్ ఆమెర్, పిపిపి ప్రధాన కార్యదర్శి బాస్సం ఎ సాల్హి నేతృత్వంలో ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జూలైలో రామల్లా నగరంలో జరి గిన సిపిఐ, పిపిపి, డెమొక్రాటిక్ ఫ్రంట్ ఫర్ పీస్ అండ్ ఈక్వాలిటీ(హదాష్-ఇజ్రాయిల్ పార్లమెం టులో అభ్యుదయ పార్టీల కూట మి) ప్రతినిధులతో జరిగిన త్రైపా క్షిక నాయకత్వ ఉన్నత స్థాయి సమావేశానికి కొనసాగింపుగా ఈ సమావేశం జరిగింది. పాలస్తీనా అంశాన్ని, హక్కులను నిర్మూలించేందుకు అమెరికా అధికార యంత్రాంగంతో కలిసి ఫాసిస్టు ఇజ్రాయిల్ దురాక్రమణ ప్రభుత్వం విధా నాలతో పాలస్తీనా ప్రమాదాన్ని ఎదుర్కొంటుందని సమావేశం అభిప్రాయపడింది. అంతర్జాతీయ చట్టబద్ధమైన తీర్మానాలకు అనుగుణంగా స్వతంత్ర పాలస్తీనాను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. ఇజ్రాయిల్ దూకుడుగా చేస్తున్న యుద్ధాన్ని, మానవహననాన్ని నిలిపివేసేందుకు ఉమ్మడి పోరాటాలను ఉధృతం చేయాలని సమా వేశం నిర్ణయించింది.

# మోకెరీ నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి)

ఏప్రిల్‌లో జరిగిన సాధారణ ఎన్నికల్లో వయనాడ్ నుంచి వామపక్ష అభ్య ర్థిగా అన్నీ రాజా పోటీ చేయగా, యుడిఎఫ్ అభ్యర్థిగా రాహుల్‌గాంధీ పోటీ చేసిన విజయం సాధించారు. కాగా, మోకరీకి మద్దకుగా నిర్వహిం చిన రోడ్‌షోలో వందలాది మంది ఎల్‌డిఎఫ్ కార్యకర్తలు, మద్దతుదారులు ఎర్రజెండాలు చేబూని పాల్గొన్నారు. మోకెరీ గతంలో కోజికోడ్ జిల్లాలోని నాదపురం నియోజకవర్గం నుంచి శాసనసభ్యుడిగా కూడా ఎన్నిక య్యారు. వ్యవసాయరంగంలో నెలకొన్న పలు సమస్యలను లేవనెత్తిన వ్యక్తిగా మోకరీ అందరికీ సుపరిచితుడే.

2014 లో జరిగిన సాధారణ ఎన్నికల్లోనూ మోకరీ వయనాడ్ పార్ల మెంట్ నుంచి ఎన్నికల బరిలోకి దిగారు. రోడ్‌షో అనంతరం మోకరీ ఎల్ డిఎఫ్ కన్వీనర్ టిపి రామకృష్ణన్ సమక్షంలో నామినేషన్ వేశారు. ఇదిలా ఉండగా బిజెపి అభ్యర్థి నవ్య హరిదాస్ కూడా ఆ పార్టీ రాష్ట్ర మాజీ అధ్య క్షుడు, మాజీ మిజోరామ్ గవర్నర్ కుమ్మనం రాజశేఖరన్ సమక్షంలో నామపత్రాలు దాఖలు చేశారు. హరిదాస్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, ఆమెకు సింగపూర్, నెదర్లాండ్స్‌లో పనిచేసిన అనుభవం ఉన్నది. కోజికోడ్ కార్పొరేషన్‌లో దశాబ్దంపాటు కౌన్సిలర్‌గా పనిచేశారు. రాహుల్‌గాంధీ రాజీనామాతో వయనాడ్‌లో ఉప ఎన్నికలు అనివార్యమైన విషయం తెలిసిందే.

# నిర్మాణాత్మక ఆరంభం : సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ మధ్య ఈనెల 22న కజ న్‌లో జరిగిన ద్వైపాక్షిక సంభాషణలలో ప్రధానంగా సరిహద్దు సమస్య పరి ష్కారానికి ప్రత్యేక ప్రతినిధులమధ్య స్తంభించిన చర్చలను పునరుద్ధరించేం దుకు ప్రధానంగా అంగీకారం కుదిరింది. 2020లో రెండు దేశాల సరిహ ద్దుల్లో ఉద్రిక్తతలు చెలరేగాయి. దాంతో రెండు దేశాలూ సైన్యాలను మోహ రించాయి. ఇరు దేశాల సైన్యాలు పూర్తిగా సరిహద్దులకు దూరంగా వెనక్కు జరగడంకోసం, సమస్య పరిష్కారం కోసం చర్చలు కొనసాగించేందుకు తాజాగా మోదీ–జిన్‌పింగ్ మధ్య అంగీకారం కుదిరింది. రెండు దేశాల మధ్యా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సరిహద్దు సమస్య పరిష్కరించ డానికి ఈ సమావేశం ఒక నిర్మాణాత్మకమైన ఆరంభంగా భారత కమ్యూ నిస్టుపార్టీ విశ్వసిస్తున్నదని జాతీయ కార్యదర్శివర్గం ఆ ప్రకటనలో పేర్కొంది. రెండు దేశాల సైన్యాలూ 2020 ఏప్రిల్‌లో ఉన్న స్థావరాలను వదిలిపెట్టి తమ తమ పూర్వ స్థానాలకు వెనక్కు వెళ్ళిపోయేందుకు ఈ అంగీకారం దోహదపడుతుందని సిపిఐ ఎంతో ఆశాభావంతో ఉందని ప్రక టన పేర్కొంది.

ప్రస్తుత సమకాలీన ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిణామాల నేప థ్యంలో భారత్–చైనా మధ్య ద్వైపాక్షిక సంబంధాల స్థిరత్వంఎంతో లోతైన, సానుకూలమైన ప్రభావాన్ని చూపిస్తాయని పార్టీ అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ విధమైన స్థిరత్వం బహుళ ధృవ ప్రపంచ ఆవిర్భావాన్వే షణలో ఒక ప్రాధాన్యతగతల ముందంజగా ఉపకరిస్తుందని పేర్కొంది.

# బ్రిక్స్‌కు సొంత ఆర్థిక వేదిక

(మొదటి పేజీ తరువాయి)

విధాన కార్యక్రమంగా క్రెమ్లిన్ చూస్తోందని ఉద్ఘాటించారు. రష్యాలోని కజాన్‌లో మూడు రోజుల పాటు జరిగిన బ్రిక్స్ సదస్సు గురువారం ముగి సింది. బ్రిక్స్ ముగింపు రోజున బ్రిక్స్ ప్లస్ సదస్సులో పుతిన్ ప్రసంగిస్తూ పశ్చిమదేశాలకు ప్రతిగా నియంత్రించేందుకు అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల బ్రిక్స్ కూటమి పాత్రను శ్లాఘించారు.

**బ్రిక్స్‌లో మరిన్ని దేశాలు :** మూడు రోజుల బ్రిక్స్ సదస్సులో పశ్చిమా ఆధిపత్య చెల్లింపు వ్యవస్థలకు ప్రత్యామ్నాయాలను అభివృద్ధి చేయడం సహా మరింత పెరిగిన ఆర్థిక సహకారం, ప్రాంతీయ ఘర్షణలను పరిష్కరించడం, బ్రిక్స్ గ్రూపు దేశాలను పెంచుకోవడం వంటి అంశాలపై చర్చ జరిగింది.

భౌగోళిక బ్యాంకు మెసేజింగ్ నెట్‌వర్క్ స్విఫ్ట్‌కు ప్రత్యామ్నాయంగా నూతన చెల్లింపు విధానాన్ని సృష్టించాలని రష్యా బలంగా ప్రతిపాదించింది. ఈ కూటమిలో తొలుత 2006లో బ్రిక్ (సభ్య దేశాల తొలి అక్షరాలతో ఈ పదం ) ఏర్పాటైనప్పుడు బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలు సభ్యదేశాలుగా ఉండగా, 2011లో సౌతాఫ్రికా చేరడంతో బ్రిక్స్‌గా మారింది. 2024 జనవరి 1న ఇరాన్, ఈజిప్ట్, ఇథియోపియా, యుఎఇ, సౌదీ అరేబియాలను బ్రిక్స్‌లో చేర్చుకున్నారు. తుర్కియే, అజర్‌బైజన్, మలేషియా దేశాలు సభ్యత్వం కోసం లాంఛనంగా దరఖాస్తు చేసు కున్నాయి. అనేక ఇతర దేశాలు కూడా ఇందులో చేరేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ముగింపు సదస్సులో పుతిన్ ప్రసంగిస్తూ బ్రిక్స్‌పై ఆసక్తి చూపిస్తున్న దేశాలను కలుపుకునే విషయాన్ని పరిశీలిస్తామని, నూతన ప్రజాస్వామిక భౌగోళిక వ్యవస్థపై ఆ దేశాలు ఒకే రకమైన ఆకాంక్షలను పంచుకుంటున్నాయని తెలిపారు.

**ఏకపక్ష బెదిరింపులపై ఆందోళన**

అక్రమ ఆంక్షలు సహా చట్టవ్యతిరేక ఏకపక్ష బెదిరింపు చర్యల విధ్వంస ప్రభావం పట్ల బ్రిక్స్‌దేశాలు ఆందోళన వ్యక్తం చేశాయి. బ్రిక్స్ దేశాల మధ్య ఆర్థిక సహకారాన్ని పెంపొందించేందుకు కట్టుబడి ఉన్నట్లు సంయుక్త ప్రకటన చేశాయి.

సరిహద్దుల మధ్య వేగవంతమైన, తక్కువ వ్యయం, ఎక్కువ ప్రభావం, పారదర్శక, సురక్షిత, సమ్మిళత చెల్లింపు ఏర్పాటును వ్యాపార ఆటంకాలను తక్కువ చేసుకొని, వివక్షతా రహితంగా అందుబాటులో ఉండే సూత్రం ఆధారంగా నిర్మించుకోవడంతో కలిగే ప్రయోజనాలను గమనంలోకి తీసుకున్నాయి. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తన ప్రసంగం సందర్భంగా భౌగోళిక భద్రత కాపాడడంలో బ్రిక్స్ పాత్రను నొక్కి చెప్పారు.

**బ్రిక్స్‌కు ఐరాస సెక్రెటరీ జనరల్ :** బ్రిక్స్ సభ్యులుగా ఉన్న పది దేశాలు కాకుండా ఇతర దేశాలతో బ్రిక్స్ ప్లస్ లేదా బ్రిక్స్ ఔట్ రీచ్ సమావేశాన్ని ఈ సందర్భంగా ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు కామన్‌వెల్త్ ఆఫ్ ఇండిపెండెంట్ స్టేట్స్ (సిఐఎస్), ఆసియా, పశ్చిమాసియా, లాటిన్ అమెరికా దేశాల నుంచి 36 దేశాలు హాజరయ్యారు. అలాగే ఐక్యరాజ్య సమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ కూడా పాల్గొన్నారు. దీనిపై ఉక్రేన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా, ఈ పర్యటన సందర్భంగా రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో గుటెర్రెస్ భేటీ కానున్నారు.

# ఒక్కొక్కరికి రూ.93,750

(మొదటి పేజీ తరువాయి)

అందుకోనున్నారు. దీపావళి బోనస్ సంస్థలో పనిచేస్తున్న దాదాపు 40,000 మంది కార్మికులకు వర్తిస్తుంది. జెబిసిసిఐ విధానాల్లో భాగంగా కంపెనీలు సాధించిన ఉత్పత్తి పరిమాణం ఆధారంగా కార్మికుల శ్రమకు ప్రోత్సాహకంగా ఈ బోనస్‌ను చెల్లించే పద్ధతి గత కొన్నేళ్లుగా అమలులో ఉంటోంది. ఈ ఏడాది కూడా కోల్ ఇండియా స్థాయిలో తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా దీపా వళి పండుగకు ముందే చెల్లింపులు జరిగేలా రాష్ట్ర ఉపముఖ్య మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఆదేశాలిచ్చారు.

**దీపావళి బోనస్ తో కలిపి రూ.1250 కోట్ల చెల్లింపులు :** కాగా ఇటీవలే సింగరేణి ఉద్యోగులందరికీ 33 శాతం లాభాల వాటా కింద 796 కోట్ల రూపాయలను కంపెనీ పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ఒక్కొక్క కార్మికుడికి సగటున 1 లక్షా 90 వేల రూపా యలు అందాయి. అలాగే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి రూ.5 వేల చొప్పున చెల్లించారు. అలాగే పండుగ అడ్వాన్స్ కింద ఒక్కొక్క కార్మి కునికి 25వేల రూపాయలు చొప్పున మరో 90 కోట్లు కంపెనీ చెల్లిం చింది. ఇప్పుడు దీపావళి బోనస్ కింద ఒక్కొక్కరికి సగటున రూ. 93,450లు లభిస్తాయి. మొత్తంగా ఈ నెల రోజుల వ్యవధిలో దీపావళి బోనస్, లాభాల వాటా, పండుగ అడ్వాన్స్ కింద రూ. 1250కోట్ల ను కంపెనీ చెల్లించింది. సగటున సింగరేణి ఉద్యోగులు ఈ నెల రోజుల కాలంలో ఒక్కొక్కరు సుమారు మూడు లక్షల రూపాయల వరకు అందుకున్నారు. రాష్ట్ర ఉపముఖ్యమంత్రి ఆదే శాలపై సింగరేణి సంస్థ సిఎండి ఎన్. బలరామ్ బోనస్ చెల్లింపుపై తగు ఏర్పాట్లు చేయాలని పర్సనల్ ఫైనాన్స్ విభాగం అధికారులను ఆదేశించారు. ఈ బోనస్ డబ్బులను దుబారా చేయవద్దని, ప్రభుత్వ పొదుపు సంస్థల్లో దాచుకోవాలని లేదా కుటుంబ అవసరాలకు అనుగుణంగా వెచ్చించాలని బలరాం విజ్ఞప్తి చేశారు.

# గొప్ప ప్రాముఖ్యత

(మొదటి పేజీ తరువాయి)

ప్రాముఖ్యత ఉందని చైనా విదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతి నిధి లిన్ జియాన్ గురువారంనాడు మీడియా సమావేశంలో చెప్పారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు ఆయన పైవిధంగా స్పందించారు. ''చైనా–భారత సంబంధాలను అభివృద్ధి చేసుకోవ డానికి, మెరుగుపరచుకోవడానికి, ఒక స్థిరమైన అభివృద్ధిమార్గంలో తిరిగి ద్వైపాక్షిక బంధాన్ని ముందుకు నడిపించడానికి వీటుగా వారిద్దరు ఒక ముఖ్యమైన ఉమ్మడి అవగాహనకు వచ్చారు. ఈ విష యంలో భారత్‌తో కలిసి పనిచేయడానికి చైనా సిద్ధంగా ఉంది, ఒక వ్యూహాత్మక పద్ధతిలో దీర్ఘకాలిక దృక్పథంతో ద్వైపాక్షిక బంధాన్ని నిర్వహించేందుకు తాము సిద్ధంగా ఉన్నాం'' అని పాత్రికేయుల ప్రశ్నలకు లిన్ జియాన్ సమాధానంగా చెప్పారు. తమ దేశం కూడా రెండు దేశాలమధ్య సమాచార ఆదాన ప్రదానాలు కొనసా గించేందుకు, సహకారం ఇచ్చిపుచ్చుకునేందుకు, పరస్పరం వ్యూహాత్మక విశ్వాసాన్ని పెంపొందించేందుకు, విభేదాలను సక్ర మంగా పరిష్కరించేందుకు వీలైనంత తొందరగా స్థిరమైన అభివృద్ధి మార్గంలో పయనించేందుకు చైనా ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆయన అన్నారు. 'బ్రిక్స్' 16వ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా రష్యా రిపబ్లిక్ తాతరన్ ప్రధాన నగరం కజన్‌లో మోదీ–జిన్‌పింగ్ బుధవారంనాడు దైపాక్షిక సంభాషణలు జరపడం ప్రపంచ రాజకీ యాలలో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ చర్చల తదనంతరం వచ్చే మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా తదుపరి చర్యలు కొనసాగుతాయని, 2020లో రెండు దేశాల సైన్యంమధ్య ప్రాణాం తకమైన ఘర్షణ అనంతరం దెబ్బతిన్న సంబంధాలను సాధారణీక రించేందుకు వీలుగా వివిధస్థాయిల్లో చర్చల యంత్రాంగాలను పునరుద్ధరిస్తామని అన్నారు. సంబంధాలను అభివృద్ధి చేసేందుకు, మెరుగుపరచేందుకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ ద్వైపాక్షిక సంభాషణల్లో చేసిన సూచనలను జిన్‌పింగ్ సూత్రప్రా యంగా అంగీకరించారని వచ్చిన మీడియా వార్తలపై కూడా చైనా పాత్రికేయులు లిన్ జియాన్‌ను ప్రశ్నించారు. అందుకు సమాధా నంగా ఈ సమావేశం ఎంతో నిర్మాణాత్మకంగా జరిగిందని, దీనికి ఎంతో గొప్ప ప్రాధాన్యం ఉందనీ రెండు దేశాల ప్రభుత్వాలు భావి స్తున్నాయని ఆయన చెప్పారు. రెండు దేశాలమధ్యా యావత్ సంబంధాలను దెబ్బతీస్తున్న కొన్ని అనంగీకారాలను నివారించేం దుకు, ప్రాంతీయ, ప్రపంచ శాంతికి, పురోగతికి, బహుళధృవ ప్రపంచ పురోగతికి దోహదం చేసేవిధంగా ఈ బంధాన్ని దీర్ఘకాలిక వ్యూహంతో ముందుకు తీసుకువెళ్ళే దృష్టితో నాయకులిద్దరూ కజన్ సమావేశంలో ఒక అంగీకారానికి వచ్చారని చెప్పారు. సరి హద్దు సమస్యపై కృషి చేసే రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులమధ్యా సమావేశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కూడా నాయకులు ఇద్దరూ అంగీకరించారని చెప్పారు. భారత్ తరపున ప్రత్యేక ప్రతిని ధుల యంత్రాగానికి భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నాయకత్వం వహిస్తుండగా, చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీ ఆ దేశం తరపున ఈ చర్చల్లో ప్రధాన ప్రత్యే ప్రతినిధిగా కీలక పాత్ర నిర్వహిస్తున్నారు. సరిహద్దు సమస్యప పరిష్కారానికి 2003 నుండి ఇప్పటివరకూ రెండు దేశాలమధ్యా 22 సమావేశాలు జరి గాయి. చివరి సమావేశం 2019లో అజిత్ దోవల్ – వాంగ్ యీ మధ్య జరిగింది. ఆ తర్వాత 2020లో తూర్పు లఢఖ్‌లోకి చైనా సైన్యం జొరబడింది. సరిహద్దుల్లో వాస్తవాధీన రేఖ వద్దకు చైనా ప్ర భుత్వం పెద్ద సంఖ్యలో పీపుల్స్ లిబరేషన్ ఆర్మీని తరలించింది. దీంతో పెద్ద ఘర్షణ చెలరేగింది. ఆ తర్వాత గాల్వన్ లోయలో రెండు దేశాల సైన్యం మధ్య యుద్ధం జరిగింది. ఈ ఘటన జరిగిన నాలుగు సంవత్సరాలకు మోదీ – జిన్‌పింగ్ మధ్య ద్వైపాక్షిక సంభాషణకు ప్రాధాన్యత ఏర్పడింది.

# నేడు నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకుంటామని తెలిపారు. ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల పట్ల తాము కక్షసాధింపుచర్యలు తీసుకోబోమని, సమస్యలను పరిష్కరిస్తామని ఉద్యోగులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సిఎం రేవంత్ రెడ్డి ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు హామీనిచ్చారు.

**సమస్యల పరిష్కారానికి ఒకటి, రెండ్రోజుల్లో నిర్ణయం ఉద్యోగుల జెఎసి :** రాష్ట్ర ఆర్థిక పరి స్థితి దృష్ట్యా అన్ని విషయాలను ఒకదాని తర్వాత ఒకటి పరిష్కరించుకుంటూ వస్తున్నామని, ఉద్యోగ సమస్యల విషయంలో కూడా ఒకటి,రెండ్రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని సిఎం రేవంత్ రెడ్డి హామీనిచ్చినట్టు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగుల జెఎసి తెలిపింది. బదిలీలు, ఉద్యోగుల సర్వీసు అంశాలను పరిష్కరిస్తామని, వాటితో పాటు మిగతా అన్ని సమస్యలపైనా చర్చిస్తా మని, ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను పరిష్కరిస్తామని చెప్పినట్టు వివరించారు. హైదరా బాద్,బంజారాహిల్స్ ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఉద్యోగుల జేఏసీ ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సమావేశమయ్యారు. అనంతరం వారు జెఎసి ఛైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ తదితరులు మీడియాతో మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరిస్తుందని తమకు పూర్తి నమ్మకం ఉన్నదన్నారు. బదిలీలు, సర్వీసు అంశాలను పరిష్కరిస్తామని సిఎం హామీనిచ్చారని తెలిపారు. ఆర్థికేతర సమ స్యలను వెంటనే పరిష్కరిస్తామని, ఆర్థిక సంబంధమైన సమస్యలను ఆర్థిక శాఖ మంత్రితో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని చెప్పారన్నారు. ఆర్థిక పరమైన అంశాలపై ఒక కమిటీని వేయ బోతున్నట్లు సీఎం వెల్లడించారని, త్వరలో మరోసారి జెఎసితో భేటీ అవుతానని చెప్పినట్టు వివ రించారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని, ఆందో ళన అక్కర్లేదని సిఎం భరోసానిచ్చారని జెఎసి ప్రతనిధులు తెలిపారు. ఇతర శాఖల్లోకి వెళ్లిన విఆ ర్ఒలను తిరిగి రెవెన్యూ శాఖలోకి తీసుకుంటామని కూడా సిఎం చెప్పినట్టు వారు తెలిపారు.

# ఇంకా ఫిరాయింపులెందుకు?

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంగణంలోని సిఎల్‌పి కార్యాలయంలో గురువారం మీడియాతో జీవన్‌రెడ్డి మాట్లాడారు. కాంగ్రెస్ కోసం పనిచేసిన వారిని కాదని బిఆర్ఎస్ ఎంఎల్ఎలను తెచ్చుకున్నారని, ఇలాంటి చర్యలు పార్టీలో తన లాంటి వారికి ఇబ్బందిగా ఉందని జీవన్‌రెడ్డి అన్నారు. దురదృష్టవశాత్తు తాను అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ రాష్ట్రంలో ప్రభుత్వం వచ్చిందని సంతోషించాన న్నారు. కాంగ్రెస్ పార్టీలో ఇతర పార్టీల ఎంఎల్ఎల చేరికలు ఎందుకు అనేది అర్థంకాని పరిస్థితి అన్నారు. పది మంది ఎంఎల్ఎలు లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగదా అని ఆయన ప్రశ్నించారు. జగిత్యాల జిల్లాలో కాంగ్రెస్ నాయకుడు గంగారెడ్డి హత్య కేసులో నిందితుడు సంతోష్ బిఆర్ఎస్ వ్యక్తి అని, ఎంఎల్ఎ చేరికతో సంతోష్ ఇప్పుడు కాంగ్రెస్ ముసుగు వేసుకు న్నాడని జీవన్‌రెడ్డి ఆరోపించారు. గంగారెడ్డి మార్కెట్ కమిటీ ఛైర్మన్ పోటీలో ఉన్నారని, ఆధి పత్య పోరుతో గంగారెడ్డిని చంపారని ఆయన అన్నారు. గుమ్మడి కాయ దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు హత్యతో తనకు సంబంధం లేదని సంజయ్ అంటున్నారన్నారు. సంజయ్ ఇంట్లోనే కాంగ్రెస్ పుడితే బిఆర్ఎస్‌లోకి ఎందుకు పోయారని ప్రశ్నించారు. ''సిఎం రేవంత్‌రెడ్డి మా నాయకుడు. ఆయనను తప్పకుండా కలుస్తాను. కాంగ్రెస్ కార్యకర్తల ఆవేద నను వారి వ్యక్తిగతం అని టిపిసిసి చీఫ్ భావిస్తే నేనేమి చేయగలను. పార్టీ పట్ల గౌరవం లేకుం డానే నేను ఇక్కడి దాకా వచ్చానా? ఇప్పటికీ నాకు పార్టీపై గౌరవం ఉంది'' అని జీవన్‌రెడ్డి ఆవే దన వ్యక్తం చేశారు. పార్టీ ఫిరాయింపుల ముఠా నాయకుడు పోచారం శ్రీనివాసరెడ్డి అని జీవ న్‌రెడ్డి ఆరోపించారు. అసలు పోచారం సలహాదారుడు ఏమిటి, భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష హోదా పోవడానికి పోచారం శ్రీనివాస్‌రెడ్డే కారణం కాదా అని జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు ఎఐసిసి అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే, ఎఐసిసి నేతలు సోనియాగాంధీ , రాహుల్‌గాంధీ. ప్రియాంక, దీపాదాస్ మున్సీ, కెసి వేణుగోపాల్, సిఎం రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షులు మహే ష్‌కుమార్ గౌడ్‌లకు గురువారం తెలంగాణ కాంగ్రెస్ ప్రసుత పరిస్థితులపై మానసిక వ్యథ, బాధతాప్త హృదయంతో లేఖ రాసినట్టు తెలిపారు.

# కెసిఆర్ అప్రూవల్

(మొదటి పేజీ తరువాయి)

కమిషన్ ఎదుట హాజరైన విషయాన్ని గుర్తు పెట్టుకొని నిజాలు డాక్యుమెంట్ ఆధారాలతో మాత్రమే చెప్పాలని హెచ్చరించారు. కమిషన్ ముందు నిరాధారమైన వ్యాఖ్యలు చేస్తే కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని గుర్తుంచుకోవాలని సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టు డిపిఆర్ తయారీ నిర్ణయం ఎప్పుడు ఎవరు తీసుకున్నా రని ప్రశ్నించగా 2016 జనవరిలో అప్పటి ముఖ్య మంత్రి కెసిఆర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఈ క్రమలో కమిషన్ చీఫ్ వేసిన పలు ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వకుండా తనకు తెలియదని ఒకసారి, ప్రభుత్వ పెద్దలకు తెలుసని మరో సారి , ఈ ప్రశ్న తనకు ఉత్పన్నం కాదని మూడో సారి వివిధ ప్రశ్నలకు సమాధాలు ఇవ్వడంతో కమిషన్ చీఫ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాధానాలు చెప్పకపోతే ఎన్నిసార్లయినా కమిషన్ పిలుస్తుందని, ప్రతి సారి ఉదయం 11.00 గంటలకు కమిషన్ కార్యాలయంలో అందుబాటులో ఉండాలని, శుక్రవారం కూడా మళ్లీ విచారణకు రావాలని వెంకటేశ్వర్లను కమిషన్ చీఫ్ పినాకి చంద్ర ఘోష్ ఆదేశించారు. టెక్నికల్ అంశాల తర్వాత డిపిఆర్ ఎవరు అప్రూవల్ చేశారని వెంకటేశ్వ ర్లను కమిషన్ ప్రశ్నించగా, ఆయన సమాధానం ఇస్తూ డిపిఆర్ అప్రూవల్ చేసింది ఇరిగేషన్ శాఖ కాదని, మాజీ ముఖ్యమంత్రి కెసిఆరే చేశారని చెప్పారు. ఈ క్రమంలో డిపిఆర్‌లపై కమిషన్ మరిన్ని ప్రశ్నలు సంధిస్తూ డిపిఆర్ లు వేరువేరుగా చేశారా? ఒకే డిపిఆర్‌గా ఉందా ? అని ప్రశ్నించగా మూడు బ్యారేజీలకు వేరువేరుగా ఒకసారి, మొత్తం కలిపి మరొకసారి ఇలా రెండు దఫాలుగా డిపిఆ ర్‌లు ఉన్నాయని వెంకటేశ్వర్లు తెలిపారు. మూడు బ్యారే జీల నిర్మాణం లొకేషన్స్ ఎవరు చేసిందన్న ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ వ్యాప్‌కో సంస్థనే డిజైన్ చేసిం దన్నారు. బ్యారేజీలలో నీళ్లను నిల్వ చేయాలని ఎవరు ఆదేశించారని వేసిన ప్రశ్నకు బదులిస్తూ ప్రభుత్వ పెద్దల ఆదేశాల మేరకే నీళ్లను నిలువ చేసినట్లు వెంకటేశ్వర్లు వెల్లడించారు. కాగా ప్రతిరోజు రెండు టిఎంసిలు ఎత్తిపో సేందుకు రూ. 40 వేల కోట్ల వరకు ఉండే ఖర్చు 3 టిఎం సిలు అయ్యేసరికి రెట్టింపు ఎలా అయిందని, కేవలం అదనంగా 2 లక్షల ఎకరాల సాగు కోసం అన్ని వేల కోట్లు ఖర్చు చేయాలని ప్రభుత్వానికి ఎవరు సూచించా రని ప్రశ్నించగా అది తనకు తెలియదని ఆయన సమా ధానం ఇచ్చారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టులో రెండు లిఫ్టులకు తక్కువ విద్యుత్తు ఖర్చును చూపిన గత సర్కార్ కాళేశ్వరం మూడు లిఫ్టులకు విద్యుత్తు ఖర్చులు మరీ ఎక్కువ ఎందుకు చేశారని ప్రశ్నించగా కాళేశ్వరం ప్రాజెక్టు సాధారణ ప్రాజెక్టు కాదు అని, భూగర్భం వరకు ఇది ప్రత్యేకమైన గ్యారేజీ అని మాజీ ఈఎన్‌సి వెంకటే శ్వర్లు తెలిపారు. కాళేశ్వరం ఆలోచన మాజీ ముఖ్య మంత్రి కెసిఆర్‌దేనని, ఆయన సమీక్షా సమావేశంలో తీసుకునే నిర్ణయం వరకు మాకు ఎలాంటి సమాచారం లేదన్నారు. డిపిఆర్ సిడబ్ల్యూసి అప్రూవల్ పై వేసిన ప్రశ్నకు వెంకటేశ్వర్లు స్పందిస్తూ సైట్ కండిషన్ ఆధా రంగా సిడబ్ల్యూసి అప్రూవల్ పొందిన తర్వాత డిపిఆర్ లో మార్పులు జరిగాయని తెలిపారు.

# కోట్లు కొల్లగొట్టారు...

(మొదటి పేజీ తరువాయి)

చూపించారు. ఇందు కోసం ప్రత్యేక ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకోని సభలు, సమావేశాలు నిర్వహించి మాయమాటలు చెప్పి పేద, మధ్యతరగతి వారి నుండి పెట్టుబడులు పెట్టించారు. నాలుగు నెలల వ్యవధిలోనే ఆ యాప్ మూతపడడంతో అందులో డబ్బులు పెట్టిన సభ్యులు లబోదిబోమంటున్నారు. జిల్లాలోని మునగాల మండలం బరాఖత్‌గూడెం గ్రామానికి చెందిన ఏనుగుల శంకర్ రావు అనే వ్యక్తి ఈ ఏడాది ఏప్రిల్ మాసంలో ఆర్ జిఎ మార్కెటింగ్ లిమిటెడ్‌లో తాను రీజనల్ మేనేజర్ నంటూ సంస్థ పేరుతో సూర్యాపేట, కోదాడ ప్రాంతాల్లో కార్యాలయాలను ప్రారంభించారు.

ఈ సంస్థ అమెరికాలోని న్యూయార్క్‌లో ఉందని ఇందులో ఆన్ లైన్ పెట్టుబడులు పెడితే ఏడాది కాలంలో మీరు పెట్టిన పెట్టుబడికి సంవత్సరంలోనే 12రేట్లు అధి కంగా వస్తుందని చెబుతూ పేద, మధ్యతరగతి ప్రజలకు చెప్పి మోసాలకు తెరలేపాడు. దేశంలో మొదట సూర్యా పేట జిల్లాలోనే ప్రారంభించినట్లు చెప్పుకొచ్చారు. పెట్టు బడి పెడితే అంత లాభం ఏలా వస్తుందని ప్రశ్నించిన వారికి మీరు పెట్టిన పెట్టుబడులు ప్రపంచ దేశాలలో ప్రక టనల రూపంలో పెట్టుబడులు పెడుతామని మీ ఫోన్ యాప్‌లో వచ్చే ప్రకటనలు చూస్తే రోజుకు ఎంత లాభాలు వస్తాయో అర్థమవుతుందని నమ్మబలికారు. వీరి మాటలు నమ్మిన సభ్యు లు పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వస్తే నేరుగా డబ్బులు తీసుకోకుండా ఆన్‌లై న్‌లో పెట్టుబడులు పెట్టించాడు. అత్యధిక సభ్యులను చేర్పించేందుకు ఏజెంటు వ్యవస్థను ఏర్పాటు చేశాడు. సభలు, సమావేశాలు ఏర్పాటు చేసి అమాయక ప్రజలకు వారు మాయమాటలు చెప్పి ఆశలు చూపించారు. గత ఏడునెలల కాలంలో జిల్లా వ్యాప్తంగా 15వేల మంది సభ్యులను చేర్పించి దాదాపు రూ. 10కోట్ల వరకు ప్రజల నుండి వసూళ్లు చేశారు.

ఆర్‌జిఎ సభ్యులకు గత మూడు వారాల నుండి సంస్థ వారు బ్యాంకు ఖాతాలో జమ చేయకపోవడంతో సభ్యు లకు సంస్థపై అనుమానాలు మొదలయ్యాయి. రీజనల్ మేనేజర్ శంకర్ రావుతో పాటు టీం లీడర్లుగా ఉంటూ తమను చేర్పించిన వారి వద్దకు వెళ్లగా ఆర్‌బిఐ నిబంధ నల ప్రకారం తమ సంస్థ బ్యాంకు ఖాతాల్లో సాంకేతిక సమస్యలు తలెత్తాయని అవన్ని వెంటనే పరిష్కారమవు తాయని నచ్చచెప్పారు. ఇలా వారం.. రెండు వారాలు... మూడు వారాలైన డబ్బులు తమ ఖాతాలో జమకాకపోవ డంతో కార్యాలయాలను ముట్టడించారు. కార్యాల యాల్లో ఉన్న కంప్యూటర్లు, ఫర్నిచర్‌ను కొంతమంది సభ్యులు ఎత్తుకెళ్లారు.

దీనికి బాధ్యులైనా శంకర్ రావు, ఏజెంట్లు ఎవ్వరు కూడా సంస్థలో పెట్టుబడులు పెట్టిన సభ్యులకు కనబడ కుండా తప్పించుకు తీరుగుతున్న పరిస్థితి. ఈలోపు ఆర్ జిఎ మార్కెటింగ్ లిమిటెడ్ పేరుతో ఉన్న ఆన్‌లైన్ యాప్ కూడా కనబడకపోవడంతో నివ్వెరబోయిన బాధిత సభ్యులు తాము మోసపోయామంటూ లబోదిబోమం టున్న పరిస్థితి.

ఈ సంస్థ నిర్వహణపై అనుమానాలు వచ్చి పలు పత్రి కల్లో వార్తకథనాలు వచ్చినప్పటికి దీనిపై చర్యలు తీసుకో వాల్సిన పోలీసులు పట్టిపట్టనట్లుగా వ్యవహరించారు. ఇదే విషయమై పలువురు పోలీస్ ఉన్నతాధికారులను వివరణ కోరగా ఆ సంస్థపై తమకు ఏలాంటి ఫిర్యాదులు అందలేదని దాటవేశారు.

# రెండు రైలు ప్రాజెక్టులు

(మొదటి పేజీ తరువాయి)

విజయవాడ, గుంటూరుజిల్లా, తెలంగాణలోని ఖమ్మం మీదుగా ఎర్రుపాలెం–అమరావతి–నంబూరు మధ్య కొత్త రైలుమార్గం నిర్మిస్తారు. ఈ కొత్తమార్గం నిర్మించడం వల్ల 168 గ్రామాలకు కొత్తగా ప్రయోజనం కలుగు తుంది. తొమ్మిది ప్రాంతాలలో కొత్త రైల్వే స్టేషన్లు నిర్మి స్తారు. మొత్తం 12 లక్షలమంది ప్రయాణికులకు కొత్తగా రైలుమార్గ ప్రయోజనం కలుగుతుంది. నార్కటియాగం జ్–రాక్సల్–సీతామర్హి–దర్భాంగా మార్గాన్ని, బీహార్‌లోని సీతామర్హి–ముజఫర్‌పూర్ సెక్షన్లలో మొత్తం 256 కిలో మీటర్ల మార్గాన్ని రెండు లైన్లుగా మార్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన ఆర్థిక వ్యవహారాల మంత్రివర్గ కమిటీ (సిసిఇఎ) ఆమోదం తెలియజేసింది. సీతామర్హి, ముజఫర్‌పూర్ జిల్లాలలో మార్గాల విస్తరణ వల్ల బహుముఖంగా రైళ్ళ రాకపోకలు వృద్ధి చెందు తాయి. సుమారు 388 గ్రామాలలో తొమ్మిదిలక్షల మంది ప్రజలకు సేవలు లభిస్తాయి. ఈ రెండు ప్రాజెక్టు లవల్ల మూడు రాష్ట్రాలలో ప్రస్తుతం ఉన్న రైలు మార్గాల్లో 313 కి.మీ మేరకు రైళ్ళ రాకపోకల కార్యకలాపాలు ఉధృతం అవుతాయి. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరు వులు, బొగ్గు, ఇనుము, ఉక్కు, ఇతర ఖనిజాలను, సిమెం ట్‌ను రవాణా చేయడానికి ఈ రెండు రైలు మార్గాలు చాలా ముఖ్యమైనవని, ఈ విస్తరణవల్ల అదనంగా ప్రతి ఏడాదీ మరో 31 మిలియన్ టన్నుల మేరకు సరుకు రవాణా కార్యకలాపాలు వృద్ధి చెందుతాయని కేంద్ర ప్రభుత్వం తన ప్రకటనలో పేర్కొంది. దీనివల్ల కొత్త ఉద్యోగాలతోపాటు స్వయం ఉపాధి అవకాశాలు పెరు గుతాయని పేర్కొంది. ఈ రెండు ప్రాజెక్టులవల్లా ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రానికి, బీహార్ రాష్ట్రానికీ ఎక్కువగా మేలు జరు గుతుంది. నార్కటియాగంజ్–రాక్సల్–సీతామర్హి–ద ర్భాంగా మార్గాన్ని, బీహార్‌లోని సీతామర్హి–ముజఫర్ పూర్ సెక్షన్లలో మొత్తం 256 కిలోమీటర్ల మార్గాన్ని రెండు లైన్లుగా మార్చడంవల్ల నేపాల్‌కు, ఈశాన్యప్రాం తంలో ఉన్న రాష్ట్రాలకు రాకపోకలు సులభం అవుతా యి.

**'అంతరిక్ష' ప్రైవేటు స్టార్టప్‌లకు రూ.వెయ్యి కోట్లు**

అంతరిక్షరంగ అభివృద్ధికి దోహదపడేందుకు కొత్తగా రంగప్రవేశం చేసే అంకుర సంస్థలకు పెట్టుబడుల ప్రయోజనం చేకూర్చేందుకు రూ.1000 కోట్లతో వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటుకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. అంతరిక్షరంగంలో భారత్ పోటీ పడేందుకు ప్రైవేటు రంగాన్ని బాగా ప్రోత్సహించాలన్న కేంద్ర పథ కంలో భాగంగా ఈ అంకుర సంస్థలకు పెట్టుబడుల ప్రోత్సాహం లభిస్తుంది. కేంద్ర సమాచార ప్రసారాలశా ఖామంత్రి అశ్వనీ వైష్ణవ్ మంత్రివర్గ సమావేశం అనం తరం ఈ నిర్ణయం వివరాలను మీడియాకు తెలియజే శారు. దీనివల్ల కొత్తగా 40 అంకుర సంస్థలకు ప్రయో జనం కలుగుతుంది. వారంతా పెట్టుబడులకు లోటులే కుండా ముందుకు దూసుకుపోవడానికి వీలు కలుగు తుంది. అంతరిక్ష సాంకేతిక పరిజ్ఞానం బాగా విస్తరించ డానికి, బలోపేతం కావడానికి, ప్రైవేటురంగంద్వారా భాగస్వామ్య నాయకత్వం వృద్ధి చెందడానికి ఈ వెంచర్ క్యాపిటల్ ఫండ్ వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుం దని మంత్రి చెప్పారు.

# నీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యత

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపెడతా

కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు హామీ



**ప్రజాపక్షం/వైరా :** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న త్రాగునీటి ఎద్దడి నివారణకు ప్రాధాన్యతనిస్తూ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు కృషి జరుగుతుందని కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. చుంచుపల్లి మండలం, నందతండా గ్రామపంచాయతీ పరిధిలోని హౌసింగ్ బోర్డు కాలనీలో రూ.33లక్షల ఎడిపి నిధులతో నందతండా, బృందావనం గ్రామాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిర్మించనున్న వాటర్ ట్యాంకును గురువారం ఎమ్మెల్యే కూనంనేని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు సమస్యను ఎదుర్కొంటున్న గ్రామాలను, బస్తీలను గుర్తించామని త్వరలో పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. పాల్వంచ, కొత్తగూడెం పట్టణాలతో పాటు గ్రామ పంచాయతీల పరిధిలోని గ్రామాలు ఉన్న మేజర్ మినీ నీటి పథకాలను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తేవాలని, వినియోగంలో లేని పథకాలకు మరమ్మతులు చేపట్టి వినియోగంలోకి తేవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి కార్మిక వాడల్లో యాజమాన్యం నీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. బ్యాంక్ నిర్మాణాన్ని త్వరితగతిన నాణ్యతతో నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ, సిపిఎం జిల్లా కార్యదర్శులు షేక్ సాబీర్‌పాషా, అన్నవరపు కనకయ్య, ఎంపిడివో అశోక్‌కుమార్, తహశీల్దార్ కృష్ణ, అధికారులు తిరుమల్, భూమిక, పంచాయతీ ప్రత్యేక అధికారి, స్థానిక నాయకులు వాసిరెడ్డి మురళి, రాంబాబు, పౌల్, గుండు శ్రీను, మహేష్, మాలోతు మురళి, మంగీలాల్, శ్రీరామ్, రామోజి, తులసీరామ్, మోహన్ రెడ్డి, మోహన్‌రావు, తంబళ్ళ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

---

## పేదలకు ఉచిత వైద్యం అందించడంలో ...

# ఏ లోటూ రాకుండా చర్యలు

మంత్రులు దామోదర్ రాజనర్సింహ్మా, కొండా సురేఖ

దౌల్తాబాద్‌లో రూ.156లక్షలతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి :** దౌల్తాబాద్‌లో రూ.156లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, మెదక్ ఇన్‌చార్జి మంత్రి అటవీ పర్యావరణ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండాసురేఖ, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, టి.జి.ఐ.సి.సి చైర్మన్ నిర్మలా జగ్గారెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డిలతో కలిసి దామోదర్ రాజనర్సింహ్మా గురువారం సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని దౌల్తాబాద్‌లో రూ.156 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా మాట్లాడుతూ రాష్ట్రంలో నిరుపేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. దౌల్తాబాద్ ప్రాంతంలో నర్సాపూర్ సంగారెడ్డి రోడ్డుపై తరచూ ప్రమాదాలు జరగడం వల్ల ప్రజలకు అత్యవసర వైద్యం అందించడంలో ఈ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కీలకపాత్ర పోషిస్తుందని మంత్రి తెలిపారు. నర్సాపూర్, సంగారెడ్డి రోడ్‌లో గతంలో అనేక ప్రమాదాలు జరుగగా అటువంటి సంఘటనలకు సత్వర వైద్యం అందించడానికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి అన్నారు. దౌల్తాబాద్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ వైద్యాధికారులను ఆదేశించారు. అన్నివర్గాల ప్రజలకు సమానంగా వైద్య ఆరోగ్య సేవలు అందించడానికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించామని, పేదవారికి ఉచిత వైద్యం అందించడంలో ఏ లోటు రాకుండా ప్రభుత్వ చర్యలు చేపట్టిందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. "ఆరోగ్యం మనిషి ప్రాథమిక హక్కు" అంటూ ప్రజలకు సమగ్ర ఆరోగ్య సంరక్షణను అందించడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఆరోగ్యం మాత్రమే కాదు. ఆరోగ్యం, విద్య, పర్యావరణం, సామాజిక ఆరోగ్యం వంటి అంశాలకు తెలంగాణ ప్రభుత్వం ప్రాముఖ్యతనిస్తుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించాలన్నారు. మొక్కలు నాటడం ద్వారా పర్యావరణ ఆరోగ్యం కాపాడుతామన్నారు. ఇందులో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దౌల్తాబాద్ కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని 30 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి వీలైనంత త్వరగా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందిస్తామని మంత్రులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైదాధికారి గాయిత్రి ,ఆర్‌డిఓ రాజు, తహసీల్దార్ ఫరీనీ షేక్, డాక్టర్ దివ్య, జ్యోతి ప్రజాప్రతినిధులు మదన్ రెడ్డి, అవుల రాజిరెడ్డి, రెడ్డిపల్లి అంజనేయులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

---

### పంచాయతీ రాజ్ శాఖ కార్యాలయంలో ఎసిబి దాడులు

పట్టుబడ్డ ఈఈ దిలీప్ కుమార్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ ఎటిఒ చంద్రశేఖర్

సీనియర్ అసిస్టెంట్ శోభారాణి



**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని పంచాయతీరాజ్ శాఖ కార్యాలయంలో ఎసిబి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో పిఆర్ ఈఈ దిలీప్ కుమార్, అసిస్టెంట్ టెక్నికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, సీనియర్ అసిస్టెంట్ శోభారాణి ముగ్గురిని ఎసిబి అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వివరాల్లోకు వెళితే జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్హార్ మండలం తాడిచెర్ల గ్రామానికి చెందిన సదానందం అనే కాంట్రాక్టర్ తాను పంచాయతీరాజ్‌కు సంబంధించి చేసిన పనులకు నాలుగు లక్షల రూపాయలు రావాల్సి ఉన్నందుకు గాను.. ముగ్గురు కలిసి 20,000 డిమాండ్ చేశారు. దీంతో సదర్ కాంట్రాక్టర్ ఎసిబి అధికారులను ఆశ్రయించగా ఎసిబి డిఎస్‌పి సాంబయ్య నేతృత్వంలో గురువారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

---

## తెలంగాణలో సీడ్ గార్డెన్ ఏర్పాటుకు

# సహకారం అందించండి



మలేషియా ఎఫ్‌జివి కంపెనీనికోరిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వం స్వంతంగా సీడ్ గార్డెన్ ఏర్పాటు చేయాలన్నఆలోచనలో ఉందని ఇందుకు సహాయ సహకారాలను అందించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మలేషియాలోని ఫెల్డ గ్లోబల్ వెంచర్స్(ఎఫ్‌జివి)కంపెనీ ప్రతినిధులను కోరారు. మలేషియా పర్యటనలో భాగంగా గురువారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఎఫ్‌జివి కంపెనీ సీడ్ గార్డెను, నర్సరీలతో పాటు అధునాతన సాంకేతిక పద్ధతులతో నడపబడుతున్న విత్తన కేంద్రాన్ని సందర్శించి, అక్కడ కంపెనీ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ఎఫ్‌జివి కంపెనీ నుండి తెలంగాణ రాష్ట్రము ఇప్పటికే సీడింగ్‌ను చాలా వరకు తెప్పించడం జరిగిందని, భవిష్యత్తులో రాష్ట్రంలోనే స్వంతముగా సీడ్ గార్డెన్ ఏర్పాటుకు గల అవకాశాలను పరిశీలిస్తున్నామన్నారు.దీనికి ఎఫ్‌జివి కంపెనీ సహాయ సహకారాలు అందజేయాలని ఆయన కోరగా, దానికి కంపెనీ ప్రతినిధులు తప్పకుండా రాష్ట్ర భాగస్వామ్యంతో పని చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తర్వాత ఎఫ్‌జివి కంపెనీ రిఫైనరీ మొక్కలను సందర్శించి అక్కడ తయారు చేసే వివిధ ఉత్పత్తులను మంత్రి పరిశీలించారు. రిఫైనింగ్ సమయములో కంపెనీ తీసుకొనే జాగ్రత్తలు, వివిధ ఉత్పత్తులకు ప్రపంచ వ్యాప్తంగా ఉన్నడిమాండ్‌ను సోదాహరణంగా మంత్రి వర్యులతో పాటు అధ్యయన బృందానికి తెలిపారు. అదేవిధంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు అధికారులబృందం మలేషియాలో పామ్ ఆయిల్ తోటలను సందర్శించారు.

---

### చిట్ ఫండ్ ఆదాయంపై జిఎస్‌టిని 5 శాతానికి తగ్గించాలి

తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ చిట్ ఫండ్స్ నేతలు డిప్యూటీకు వినతి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** చిట్ ఫండ్ సంస్థల రుసుములు, ఆదాయంపై ప్రస్తుతం ఉన్న 18 శాతం జిఎస్‌టిని ఐదు శాతానికి తగ్గించేలా ప్రయత్నం చేయాలని తెలంగాణ ఫెడరేషన్ ఆఫ్ చిట్ ఫండ్స్ నేతలు తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కను విజ్ఞప్తి చేశారు. ప్రజాభవన్‌లో గురువారం ఫెడరేషన్ నాయకులు డిప్యూటీ సిఎంను కలిసి తమ సమస్యలను వివరించారు. చిట్ ఫండ్ సంస్థల రుసుములు, ఆదాయంపై 18 శాతం జిఎస్‌టి వసూలు కారణంగా సంస్థాపరమైన చిట్ ఫండ్ సంస్థలు కనుమరుగై ప్రైవేటు సంస్థలు పెరుగుతున్నాయని వారు విజ్ఞప్తి చేశారు. రంగంలో అసంఘటిత చిట్స్ సంస్థలు పెరగడం వల్ల మోసాలు పెరిగిపోవడంతో పాటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంలేదని వారు తెలిపారు. ఈ అంశంలో చిట్ ఫండ్ ఫెడరేషన్‌తో సహకరించి కేంద్రంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. డిప్యూటీ సిఎంను కలిసిన వారిలో ఫెడరేషన్ చైర్మన్ పి.రాజాజీ, అధ్యక్షులు కె.శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ ఎల్.సుమన్, కోశాధికారి ఆర్.రమేష్ తదితరులు ఉన్నారు.

---

## గౌరవెల్లి భూ నిర్వాసితుల సమస్యలను

# వెంటనే పరిష్కరించాలి

నీటి పారుదల సలహాదారుకు చాడ వినతి



**ప్రజాపక్షం / హుస్నాబాద్ :** గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ గౌరవెల్లి ప్రాజెక్టు ముంపు బాధితులతో కలిసి తెలంగాణ నీటి పారుదల శాఖ ముఖ్య సలహాదారు అదిత్యానాథ్‌దాస్‌కు ఇఎన్‌సి అనిల్ కుమార్‌కు సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి గురువారం హైద్రాబాద్‌లో కలసి వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా చాడ వెంకటరెడ్డి మాట్లాడుతూ సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల గౌరవెల్లి ప్రాజెక్టు భూ నిర్వాసితుల పరిహారం వెంటనే ఇప్పించి ప్రభుత్వపరంగా బాధితులను అన్నివిధాల అదుకోవాలని చాడ వెంకటరెడ్డి అన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వంలో భూనిర్వాసితులకు అన్యాయం జరిగిందని, కాంగ్రెస్ ప్రజాపాలనలో 18 ఏళ్లు నిండిన యువతులకు పరిహారం చెల్లించి, వారికి న్యాయం చేయాలని చట్టపరంగా నిర్వాసితులకు రావలసిన పరిహారం, వసతులను కల్పించేందుకు అధికారులను ఆదేశించాలని అయన కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుల గడిపె మల్లేశ్, మాజీ జడ్పిటిసి అందె స్వామి, నాగెల్లి లక్ష్మ రెడ్డి, ముద్రకొల రాజయ్య, బొయిన బాస్కర్, బద్దం ఎల్లరెడ్డి పాల్గొన్నారు.

---

# ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ



**ప్రజాపక్షం / సూర్యాపేట ప్రతినిధి :** అభివృద్ధి ఫలాలు సమాజంలో ప్రతి ఒక్కరికి అందేలా చూడాలని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధికారులను కోరారు. దీంతో వారి జీవితాలు మెరుగుపడుతాయన్నారు. అధికారులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులు, కళాకారులు, రచయితలు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో మాట్లాడారు. దీనికి ముందు ఆయన జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో జిల్లా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల తీరును అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రాముఖ్యత, సంసృతి సాంప్రదాయాలు, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పవర్ ప్రజెంటేషన్ చేశారు. ఈ సందర్భంగా గరవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతీరు బాగుందని ప్రశంసించారు. 2021లో జిల్లాలో ప్రజల్లో 73శాతం ఉన్న రక్తహీనత 2024 నాటికి 21శాతానికి తీసుకరావడంలో అధికారులు చేసిన కృషి అభినందనీయమన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు రక్తహీనతతో బాధపడుతున్నారని నివారించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని 475 గ్రామ పంచాయతీల్లో బహిరంగ మలమూత్ర విసర్జన రహిత గ్రామాలుగా ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. స్వచ్ఛభారత్ అనేత ఒక కార్యక్రమం కాదని ఇదో ఉద్యమమని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల్లో జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. దారిద్రరేఖకు దిగువన ఉన్న ప్రజలను పైకి తీసుకవచ్చేందుకు అందరు కృషి చేయాలన్నారు. స్వయం సహాయ మహిళ సంఘాల కార్యక్రమాలు బాగున్నాయని, భవిష్యత్ అభివృద్ధి మహిళ సాధికారతపై ఆధారపడి ఉందన్నారు. ఈ విషయం తాను కలెక్టరేట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన స్టాల్స్ ప్రదర్శన ద్వారా గుర్తించానన్నారు. మహిళ సాధికారతే దేశాభివృద్ధి అన్నారు. వైద్య ఆరోగ్య, విద్య రంగాల్లో సూర్యాపేట జిల్లాకు మెరుగైన స్థానం ఉందని కీతాబిచ్చారు. 2024లో పదవ తరగతి ఫలితాల్లో 96.91శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించడం ఎంతో గోప్ప విషయమన్నారు. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తక్కువ వ్యవధిలోనే దేశంలో అతివేగంగా అభివృద్ధి చెందిన రాష్ట్రాల్లో తెలంగాణ ముందువరుసలో ఉందన్నారు. తసరి ఆదాయంలో సైతం ముందేనని చెప్పారు. ఐటి, ఫార్మ, సైన్స్ రంగాల్లో తెలంగాణ ప్రపంచ దేశాల దృష్టిని ఆకర్షిస్తుందన్నారు. వ్యవసాయ రంగం లోను ముందే ఉందని చెప్పారు. 28వేల కోట్ల రూపాయలను బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి కేటాయించడం జరిగిందన్నారు. ప్రతి సంవత్సరం 6లక్షల నూతన ఆయకట్టును సృష్టించి వచ్చే ఐదేళ్ళలో 30లక్షల ఎకరాలకు నూతన ఆయకట్టు ద్వారా సాగునీరందించడమే ప్రభుత్వ లక్షమన్నారు. ఆహార భద్రతలో భాగంగా ప్రతి ఒక్కరికి ఆరు కిలోల బియ్యాన్ని అందజేస్తున్నామని, సరఫరా చేసే దొడ్డు బియ్యానికి బదులుగా 2025 జనవరి నుండి సన్నబియ్యాన్ని అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మవతి, గవర్నర్ పర్సన్ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం, జాయింట్ సెక్రటరి భవానిశంకర్, జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ పాల్గొన్నారు.

**రాష్ట్ర గవర్నర్‌కు ఘన స్వాగతం**

సూర్యాపేట కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులు, రచయితలు, కళాకారులు, ప్రముఖులతో నిర్వహించిన ముఖాముఖీ కార్యక్రమానికి గురువారం హాజరైన రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ శాసన సభ్యురాలు ఉత్తమ్ పద్మవతి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, ఎస్‌పి సన్‌ప్రీత్ సింగ్‌తో పాటు సూర్యాపేట, హుజూర్‌నగర్, తిరుమలగిరి మున్సిపల్ చైర్ పర్సన్‌లు పేరుమాళ్ళ అన్నపూర్ణ, గెల్లి అర్చన, చాగంటి అనసూయలు ఘనంగా స్వాగతం పలికారు. గవర్నర్‌కు పుష్పగుచ్చాలు అందజేశారు. జిల్లా నుండి వివిధ రంగాల ప్రముఖులు రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న యాదవ్, డాక్టర్ నందగోపాల్, డాక్టర్ ఆనంద్ హెగ్డే, రచయిత పెద్దిరెడ్డి గణేష్, క్రీడాకారులు రవీందర్ రెడ్డి, అనిల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, దివ్యభవాని, పేరిణి నృత్యకారులు రాజ్ కుమార్, సుధాకర్ గ్రూప్ ఆఫ్ కంపెనీ ఎండి మీలా మహాదేవ్, రమణమూర్తి, ప్రకృతి వ్యవసాయ వేత్త శేశకుమార్ లాంటి వారు కూడా గవర్నర్‌కు స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.

---

# లక్షా80వేల కోట్ల సంపద ఏదీ?

10 నెలల రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం ఇవ్వాలి

విద్యార్థులకు రూ.4వేల కోట్ల ఫీజులు చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం

మీడియా సమావేశంలో ఆర్ కృష్ణయ్య వెల్లడి



**ప్రజాపక్షం / ఖైరతాబాద్ :** రాష్ట్రంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్స్, గురుకులాలకు అద్దె చెల్లించని కాంగ్రెస్ ప్రభుత్వం గత పది నెలల పాలనలో సమకూరిన రూ.లక్షా80వేల కోట్ల సంపదను ఎక్కడ ఖర్చు పెట్టారని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని నిలదీశారు. తక్షణమే రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వివిధ పన్నులు, గ్రాంట్ల ద్వారా ఆదాయంతోపాటు తెచ్చిన అప్పు రూ.80వేల కోట్లను ఏయే సంక్షేమ పథకాలకు ఖర్చు చేశారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్ కాచిగూడలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో గురువారం బిసి సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ సత్యం ఆధ్వర్యంలో జరిగిన మీడియా సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాష్ట్రంలోని 12 లక్షల మంది విద్యార్థులకు బకాయిపడ్డ రూ.4వేల కోట్ల ఫీజులను చెల్లించని రాష్ట్ర ప్రభుత్వం మూసీ సుందరీకరణకు రూ.లక్షా 50వేల కోట్లు ఖర్చు చేస్తదంటా? ఇదెక్కడి న్యాయం అంటూ పశ్నించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపుల్లో కమీషన్లు దండుకోవడానికి ఉన్న శ్రద్ధ, విద్యార్థుల చదువు, వారి సంక్షేమానికి ఖర్చు చేయడంలో లేదని విమర్శించారు. రాష్ట్ర పాలన పరిస్థితి సంక్షోభంలో పడిందని, కాలేజీలు బంద్ చేసి విద్యార్థులు ఉద్యమబాట పడుతున్నారని, అద్దె చెల్లించని గురుకులాల భవనాలకు తాళాలు వేస్తున్నారని పేర్కొన్నారు. దీన్నిబట్టి విద్యపై ప్రభుత్వానికి ఉన్న నిర్లక్ష్య వైఖరి తేటతెల్లమైందని విమర్శించారు. బిసి గురుకులాలు, హాస్టళ్లకు సొంత భవనం నిర్మించకపోవడంపై బిసిల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏంటో తెలుస్తుందని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిసి శ్రేణులను జాగృతం చేయడానికి రాష్ట్రవ్యాప్తంగా నవంబర్ మొదటివారంలో పాదయాత్ర నిర్వహిస్తామన్నారు. గ్రూప్–1 ప్రిలిమ్స్ రాసిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి అభ్యర్థులు తమకు న్యాయం చేయాలని ఉద్యమించినా ప్రభుత్వం పట్టించుకోకవడం అన్యాయమన్నారు. త్వరలో కార్మిక, ఉద్యోగ, బిసి కులాలను కలుపుకొని త్వరలోనే ప్రజా ఉద్యమం చేపడతామని ఆర్.కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ సందర్భంగా బిసి సంక్షేమ సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ ఉమ్మడి నల్లగొండ జిల్లా చైర్మన్ పి ధనుంజయ్‌ను ఆర్. కృష్ణయ్య నియమించారు. సమావేశంలో నిరుద్యోగ జెఎసి చైర్మన్ నీల వెంకటేశ్, బిసి ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు అనంతయ్య, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

---

### ఐక్యరాజ్య సమితి కార్యకలాపాల వ్యాప్తిలో.. 'లైబ్రరీ కీలక పాత్ర'

ఒయు ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగారం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ఐక్యరాజ్య సమితి కార్యకలాపాలపైన జ్ఞానాన్ని వ్యాప్తి చేయడంలో ఉస్మానియా యూనివర్సిటీ(ఒయు) లైబ్రరీ కీలక పాత్ర పోషిస్తుందని ఒయు ఉప కులపతి ఆచార్య కుమార్ మొలుగారం అన్నారు. లైబ్రరీలను వినియోగించుకుని పరిశోధనలు, ఆవిష్కరణల ద్వారా విద్యార్థులు ఒయుకు ప్రపంచ వ్యాప్త గుర్తింపు తీసుకురావాలని అన్నారు. "79వ ఐక్య రాజ్య సమితి దినోత్సవాన్ని" పురస్కరించుకుని ఒయులోని డాక్టర్ బిఆర్‌అంబేద్కర్ మెమోరియల్ లైబ్రరీలో ' సుస్థిర అభివృద్ధిలో యువత డిజిటల్ మార్గాలు' అనే అంశంపై ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కుమార్ మొలుగారం ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఆధునిక సాంకేతికతతో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల దిశగా విద్యార్థులు, యువత ముందడుగేయాలని పిలుపునిచ్చారు. సవాళ్లను అధిగమించేందుకు, సమగ్ర పరిష్కారాల సాధనకు డిజిటల్ వేదికలు ఎంతగానో ఉపయోగపడతాయని ప్రొఫెసర్ కుమార్ అభిప్రాయపడ్డారు. ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు, డీన్లు, డైరెక్టర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాగా అంతకు ముందు ఒయు లైబ్రరీలో ప్రొఫెసర్ కుమార్ కలియతిరిగి విద్యార్థులతో ముచ్చటించారు.

---

# దివ్యాంగుల సంక్షేమంపై పలు కీలక నిర్ణయాలు

చైర్మన్ ముత్తినేని వీరయ్య

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దివ్యాంగుల పరికరాలకు గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం 10 ఏళ్లలో కేవలం రూ.64 కోట్లు కేటాయిస్తే మొదటి ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.50 కోట్లు కేటాయించడం హర్షనీయమని వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది వికలాంగుల తరుపున ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, వికలాంగుల, వయోవృద్ధుల, మహిళ , శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరిస్తే కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన 10 నెలల కాలంలో దివ్యాంగులు సంక్షేమమే ధ్యేయంగా నిర్వహించిన అత్యున్న స్థాయి మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో పలు కీలక తీర్మానాలను ఆమోదించడం ద్వారా అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందని దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య వెల్లడించారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, డివిజన్ - 16, జిహెచ్ఎంసి, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, హైదరాబాద్.

NIT నం. 29/EF/Divn.16/SBZ/GHMC/2024 తేదీ: 24-10-2024

**క్ర.సం.1, పని పేరు:** అంబర్‌పేట్ Cir-16- SBZ, GHMC కోసం 32&16CH నెట్‌వర్క్ వీడియో రికార్డర్ సరఫరా మరియు సంస్థాపన. **దిగువ పేర్కొన్న అంశాలు కోసం తయారీదారులు, అధికారులు మరియు డీలర్లు, ఏజెన్సీలు మొదలైన వారి నుండి కొటేషన్ల ఆహ్వానం:** పని కోసం SOR కాని అంశాల కొటేషన్ల కోసం అభ్యర్థన. **బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ & సమయం / బిడ్ దాఖలుకు ఆఖరి తేదీ & సమయం:** 25.10.2024న మ.3.00గం.ల నుండి 29.10.2024న మ.3.00గం.ల వరకు, **కార్యాలయం పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వారి కార్యాలయం, Divn- 16, GHMC, పార్కింగ్ కాంప్లెక్స్, 7వ అంతస్తు, అబిడ్స్, Hydలో 29-10-2024న మ.3.00గం.ల తేదీ లోపు సీల్డ్ కొటేషన్లు సమర్పించాలి. సెల్: 6309920591 / 8790374055. పైన పేర్కొన్న అంశాలకు సంబంధించిన మరిన్ని వివరాలు మరియు పూర్తి వివరణను GHMC వెబ్‌సైట్ : https://ghmc.gov.in నుండి పొందవచ్చు.

టు, నోటీసు బోర్డు

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్

DIPR R.O. No. : 5819-PP/CL/ADVT/1/2024-25, Date: 24-10-2024 Div-16-SBZ-GHMC



**డాక్యుమెంట్స్ పోయినవి**

నేను, **తెరల ప్రవీణ్ కుమార్, s/o T. బాబురావు,** నివాసం: ఇం.నెం. 3-10-67, తిరుమలగిరి, సికింద్రాబాద్. నాకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, మూడుచింతలపల్లి మండలం, కొల్తూరు గ్రామంలో సర్వే నెం. 608 ప్లాట్ నెం. 34, 180 చదరపు గజముల స్థలం కలదు. దీనికి సంబంధించిన **ఒరిజినల్ డాక్యుమెంట్లు సేల్ డీడ్ నెం. 2804/2014, తేది: 6/10/2024**న కొల్తూరు బస్టాపు నుంచి కొల్తూరు గ్రామానికి వెళ్ళినప్పుడు పోయినవి. ఈ విషయమై జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాను. ఎవరికైన దొరికినచో వాటితో అక్రమాలకు పాల్పడితే చట్టపరమైన చర్య తీసుకోబడును.

ఇట్లు

**తెరల ప్రవీణ్ కుమార్,**

s/o. T. బాబురావు,

ఇం.నెం. 3-10-67, తిరుమలగిరి,

సికింద్రాబాద్.

సెల్: 8978279996



**ST. JOHN'S COLLEGE OF EDUCATION**

AFFILIATED TO OSMANIA UNIVERSITY

OPP: GAIL, CHENGICHERLA(V), CHERLAPALLY PHASE-III

MEDIPALLY(M), MEDCHAL-MALKAJGIRI(DIST)92,TG. PH : 9866519194, 9949490652

**B.Ed. SPOT ADMISSIONS 2024**

Only those who have not taken admission anywhere so far, and have passed degree and qualified in Ed CET-2024 should attend for spot admission with all original certificates on 28-10-2024, 10AM at our college premises. The following candidates have not reported so far. If he/She fails to report on or before 26-10-2024 will be treated as cancelled and seats including leftover will be filled in spot admissions by the qualified candidates present on 28.10.2024

| S.NO. | RANK | HT.NO. | NAME | METHODOLOGY | CATEGORY | DETAILS OF ALLOTMENT |
|---|---|---|---|---|---|---|
| 1 | 15023 | 2425102165 | MAGGIDI ANKITHA | BIOLOGICAL SCIENCES | SC | OU-SC-OU- FEMALE |
| 2 | 16818 | 2426008113 | KOTHURI APOORVA | BIOLOGICAL SCIENCES | SC | OU-SC-OU- GEN |
| 3 | 23341 | 2425104040 | YADAVALLI JHANSI RANI | BIOLOGICAL SCIENCES | BC-B | OU-BCB-OU-FEMALE |
| 4 | 610 | 2425102791 | CHITHALURI NAGARAJU | MATHEMATICS | BC-B | OU-OPEN-OU-GEN |
| 5 | 19694 | 2415108164 | BONGARALA BINDU | MATHEMATICS | SC | OU-ST-OU-GEN |
| 6 | 26029 | 2415111275 | ENDLA PRASHANTHI | MATHEMATICS | BC-D | OU-BCD-OU-FEMALE |
| 7 | 15484 | 2415105149 | LAKAVATH PRAMEELA | PHYSICAL SCIENCE | ST | OU-ST-OU-FEMALE |
| 8 | 12895 | 2415104066 | LONKA PRASANNA | SOCIAL SCIENCE | BC-A | OU-BC-B-OU-GEN |
| 9 | 21990 | 2425201231 | JUPALLY MANISHA | SOCIAL SCIENCE | OC | OU-ST-OU-FEMALE |
| 10 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 11 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 12 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 13 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 14 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |
| 15 | | | NOT ALLOTTED SEAT (VACANT) | | | |

the vacant seats may be filled by the candidates of the concerned category as per their merit in Ed CET-2024 and guidelines prescribed by the convener. Ed CET-2024.



**IN THE COURT OF THE HON'BLE DISTRICT JUDGE AT NIZAMABAD**

**G.W.O.P.No. 13 of 2024**

Between:

**Smt.Chakilam Laxmi and another,** ... **Petitioners**

And

**To whom so ever it may concern.** ...**Respondent**

To

To whom so ever it may concern.

Take notice that the petitioner No. 1 Smt.Chakilam Laxmi and Master Chakilam Aneesh (Minor) have presented an application to this court U/s 29 (a) of the Guardian and Wards Act praying the Hon'ble court to accord permission to sell the property mentioned in the schedule of the minor namely **Master Chakilam Aneesh** and that the Hon'ble court has been fixed the hearing of this application **on 19-11-2024** or to apply for the desire to oppose the said application applied for permission to sell the property of the minor. Any person or persons must appear on the said above said date ie., **19-11-2024 at 10.30 A.M** in this court in person or by a pleader and submit any objections for the said permission along with any documentary evidence or oral evidence upon which you rely, and that in default of your appearance, the said application may be heard and determined in your absence.

**SCHEDULE OF PROPERTY**

All the existing House bearing -Municipal No.3-10-289/ 1 constructed on open plot No.29 lies in Sy.No.669 of Nizamabad sivar admeasuring 266.66 Sq.Yards or 222.95 Sq.Mts on which plinth area of RCC is 1200.00 Sq.Fts situated at Nizamabad sivar (Suryanagar) within the Municipal Corporation limits of Nizamabad town bounded by:

**North:** 40 feet wide road, **South:** House on Open Plot No. 32, **East:** Open Plot No.30, **West:** House on Open Plot No. 28.

Sd/- **MUNIGELA MOHAN,**

**Advocate,**

Vinayaknagar, Nizamabad.

**Date: 23-10-2024** Phone: 08462-356690.

**Nizamabad** Cell: 9848594859

# ఫోకస్

# పశుపోషణ లాభదాయకం..



వ్యవసాయం

వ్యవసాయ అనుబంధ రంగమైన పశుపోషణ ఇప్పుడు ఎంతో లాభదాయకమైె వృత్తిగా మా రింది. దేశంలో మాంసం విని యోగం పెరుగుతున్న నేపథ్యంలో, ఈ రంగం రైతు, వ్యవసాయ అనుబంధ కుటుంబాలకు లాభాలను ఆర్జించి పెడుతున్నది. న్యూఢిల్లీలోని ఇండియన్ కౌన్సి ల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) నివేదికను అనుసరించి పట్టణీకరణతోపాటు మాంసానికి డిమాండ్ కూడా పెరుగుతున్నది. ఒక అధ్యయనం ప్రకారం దేశంలో సగటున మాంస విని యోగం సంవత్సరానికి 12 కిలోలుకాగా, ప్రస్తుతం లభ్యక కేవలం 0.5 కిలోలు (500 గ్రాములు లేదా అర కిలో) మాత్రమే. డిమాండ్, సరఫరాలో ఉన్న ఈ భారీ వ్యత్యాసం పశుపోషణకు ఉన్న ప్రాధాన్యతను స్పష్టం చేస్తున్నది. మాంసానికి స్థిరమైన మార్కెట్ ఉందని వివిధ సర్వేలు పేర్కొంటున్నాయి. ఈ అవకాశాన్ని గ్రామీణ ప్రజలు, ప్రత్యేకించి వ్యవసాయ కార్మికులు, యువత సద్వినియోగం చేసుకోవాలి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో గొర్రెల పెంపకం ఉత్తమంగా ఉంది. తెలంగాణలో 17.6 మిలియన్లు, ఆంధ్రప్రదేశ్‌లో 19మిలియన్ల చొప్పున గొర్రెలున్నాయి. మాం సం కోసం డిమాండ్ మరియు అధిక రాబడి కారణంగా గొర్రెలు, మేకల పోషణ ప్రాముఖ్యతను సంతరించుకు ంది.



భవిష్యత్తులో డిమాండ్ పెరగడాన్ని దృష్టిలో ఉంచుకుని, విద్యావంతులైన గ్రామీణ యువత దీనిని వ్యాపకంగా ఎంచుకుంటున్నారు. ప్రస్తుతం గొర్రెలు పెంచే విస్తృత పద్ధతిలో గొర్రెల కాపరులు, రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గడ్డి భూములు, మేత ప్రాంతంలో తగ్గుదల, గొర్రెలు లేదా మేకలు తరచుగా అనారోగ్యంతో బాధపడడం, అంతర పరాన్న జీవుల బెడద, మరణాలశాతం చాలాఎక్కువ (దాదాపు 50 శాతం)గా ఉం డడం,పోషకాహార లోపాలవల్ల వల్ల బలహీనంగా ఉంటూ, బరువు పెరగకపోవడం, ఎండ, వాన, చలివంటి ప్రకృతి వైపరీత్యాలకు గురి అవడంవల్ల జీవాలపై అధిక ఒత్తిడి వంటి సమస్యలు నిత్యం ఎదురవుతున్నాయి.విస్తృతమైన వ్యవస్థలో, ఉత్పాదకత 50 ,60% తక్కువగా ఉం టుంది. పైఅంశాలను దృష్టిలో ఉంచుకుని సాంద్రపద్ధతిలో గొర్రెల పెంపకం మరింత లాభదాయ కం.సాంద్రపద్ధతిలో సమతుల్య ఆహారం అందించడం, నియంత్రిత సంతానోత్పత్తి , వివిధ అంటు వ్యాధులకు నివారణ చర్యలను అనుసరించడానికి అందిస్తుంది. ప్రభుత్వాలు ఈ సమస్యలను పరిష్కరిస్తే, గొర్రెల పెంపకం లాభసాటి వ్యాపారంగా మారుతుంది. ఈ దిశగా అడుగులు పడతాయని ఆశిద్దాం. ఈ రంగంలో ఇప్పటికే ఉన్న లేదా కొత్తగా ప్రారంభించాలనుకున్న వారు తప్పక ఆచరించాల్సిన కొన్ని విధానాలు... ముందుగా జీవాలపై నిశిత పర్యవేక్షణ ఉంచాలి. ఈ పద్ధతిలో పేడను ఒకే చోట సేకరించి మంచి ఎరువుగా వాడవచ్చు. తక్కువ స్థలంలో ఎక్కువ జీవాలను పెంచవచ్చు.జీవాలపై ఒత్తిడి చాలా తక్కువగా ఉంటుంది. జీవాలు పరిశుభ్రమైన, వ్యాధిలేని జోన్‌లో పెరుగుతాయి. ఎక్కువ నాణ్యత గల మాంసాన్ని ఉత్పత్తి చేయవచ్చు. జంతువులను అధిక ఉష్ణోగ్రతల నుంచి రక్షించడానికి వీలవుతుంది. జీవాలను దగ్గరగా పర్యవేక్షించడం వల్ల సరియిన సమయంలో చికిత్స చేయడానికి సాధ్యమవుతుంది. సాంప్రదాయ పద్ధతిలో జీవాలకు కావలసిన మేతను షెడ్డు లోపల ఉంచి అందిస్తారు. జీ వాలకు షెడ్డులోపల ఒ క్కొక్క దానికి 10 చ.అ. స్థలాన్ని కేటాయించా లి.ఈవిధానంలో రా త్రి పూట మాత్రమే జీ వాను షెడ్డులో ఉం టాయి. పగటిపూట షె డ్డు బయటతిరగడానికి ఒక్కొక్క జీవానికి 30 చ.అ. స్థలాన్ని కేటాయించాలి.ఐతే గొర్రెలను భూమి మీద కాకుండా 67 అడుగుల ఎత్తులో చెక్కలమీద గాని, ప్లాస్టిక్ ట్రే ల మీద కానీ ఉంచడం వల్లచాలా వ్యాధులనుండి రక్షించడమే కాకుండా గొర్రెలకు స్వచ్ఛమైనగాలి లభిస్తుంది. అంతేకాకుండా సంవత్సరం పొడవునా తడి లేకుండా చేయవచ్చు. ఈ విధానంలో క్రింది భాగంలో కోళ్లను కూడా పెంచుకొనే అవకాశం ఉంది.



## ఆధునిక వ్యవసాయ పరికరాలు !

**రెండంచెల విధానంలో గొర్రెలు/మేకల పెంపకం:** రైతుల యొక్క పో షక, ఆర్థిక భద్రత, ఉత్పత్తి వ్యవస్థ యొక్క స్థిరత్వం కోసం అవసరాల ఆధారిత, ఆయా ప్రాం తాలకు అనుగుణంగా సమగ్ర వ్యవసాయ వ్యవస్థల నమూనాలు అభివృద్ధి చేయబడ్డా యి. సమీకృత పశువుల పెం పకం వ్యవస్థ లేదా డబుల్ లేయర్ పశువుల పెంపకంలో భూమి , కూలీల ను సమర్థవంతంగా ఉపయోగించడం ద్వా రా నిర్దిష్ట ప్రాం తంలో రెండు లేదా అంత కంటే ఎక్కువ పశువుల భాగాలు ఉంచబడతాయి. గొర్రె పిల్లల సంరక్షణ పుట్టిన మొదటి 3 రోజులు తల్లితోపాటు వెచ్చని వాతావరణంలో ఉంచాలి. పిల్ల శరీర బ రువులో 20 శాతం జున్నుపాలు ప్రతీ రోజు అందించాలి. మొదటి రెండువారాలు పిల్లలను పూర్తిగా తల్లి పాలమీదనే ఉంచాలి. పుట్టిన పిల్ల శరీర బరువు 3 కిలోలు ఉన్నట్లయితే రోజుకి 600 మిల్లి లీటర్ల పాలు అవసరం అవుతాయి. ఒకవేళ తల్లివద్ద సరిపడనంత పాలు లేనట్లయితే ఆవు లేదా గేదె పాలను అదనంగా తాగిపించాలి. 2. మూడవ వారం ను ండి 7వారాల వయస్సు వరకు తల్లిపాలతో పాటుగా క్రీ పు దాణా అందించాలి. క్రీపు దాణా అంటే అత్యధిక పో షక విలువలు కలిగి (18బూ20 శాతం మాంసకృత్తు లు, 70శాతంజీర్ణమగు పోషకాలు) సులువుగా జీర్ణమ య్యే సమతుల్య ఆహారం. క్రీపు దాణాను క్రింద తెలిపిన మాదిరిగా గొర్రెల పెంపకందారులే తయారుచేసుకోవ చ్చు. క్రీపు దాణాను పిల్లల శరీర బరువులో ఒకటిన్నర శాతానికి మించకుండా ప్రతీరోజు అందించాలి. 7 వా రాల వయస్సు దాటే సరికి పిల్లలు కనీసంగా 12 కిలోల బరువు తూగుతాయి. 8వ వారం నుండి 20వ వారం వరకు ఈ వయస్సులో పెరిగే పిల్లల మేతను టి.ఎం.ఆర్ (టోటల్‌మిక్స్‌డ్‌రేషన్) రూపంలో అందించాలి.టి.ఎం. ఆర్‌ను కూడా గొర్రెల పెంపకందారులు స్వ యంగా తయారుచేసుకోవచ్చును. లేదా మార్కెట్లో కూ డా దొరుకుతుంది. టి.ఎం.ఆర్‌తో పాటుగా ఎల్లవేళల పరిశుభ్రమైన త్రాగునీరు అందుబాటులో ఉంచడం చాలా ముఖ్యం.

**క్రీపు దాణా నమూనా ఫార్ములా :** నలగగొట్టిన మొక్కజొన్నలు 40 కిలోలు, తవుడు 20 కిలోలు, నూనె తీసిన చెక్క 30 కిలోలు, పప్పులపరం 7 కిలోలు, ఉప్పు 1 కిలో, లవణ మిశ్రమం 2 కిలోలు.

**టిఎంఆర్ (టోటల్ మికస్డ్ రేషన్) నమూనా ఫార్ములా:** నూనె లేదా పప్పుదినుసుల పంటమిగుల్లు , ఉదా: వేరుశెనగచెత్త లేదా మినపచెత్త బూ 50 కిలోలు, నలగగొట్టిన మొక్కజొన్నలు 20 కిలోలు, తవుడు 10 కిలోలు, నూనె తీసిన చెక్క 10 కిలోలు, పప్పులపరం 7 కిలోలు, ఉప్పు 1 కిలో, లవణ మిశ్రమం 2 కిలోలు

**గమనిక:** పశువైద్యాధికారి సలహామేరకు స్థానికంగా చవకగా దొరికే పప్పు లేదా నూనెదినుసుల పంటమిగుళ్ల తో, మేతదినుసులతో టిఎంఆర్ తయారుచేసుకోవాలి.



## అల్లంతో లాభం

అల్లం మన ఆరోగ్యానికేకాదు... రైతుల ఆదాయానికి కూడా బాగా ఉపయోగపడుతుంది. చాలా వంటకాల్లో అల్లం ఒక భాగం. ఆరోగ్యం కోసం, ప్రత్యేకించి జలుబు బాధిస్తున్నప్పుడు ఉపశమనానికి టీలో, కషాయంలోనూ అల్లం వాడతారు. వంటలతోపాటు పెసరట్టు, ఉప్మా వంటి అల్పాహారాల్లోనూ అల్లం ఉండాల్సిందే. అల్లంతో చట్నీ కూడా చేస్తారు. ఇన్ని రకాలుగా మనిషి జీవితంలో భాగమైన అల్లానికి ఏడాది పొడవునా డిమాండ్ ఉంటుంది. అందుకే దీని సాగు రైతులకు లాభాల పంట పండిస్తుంది. జింజిబరెసి కుటుంబానికి చెందిన అ ల్లం ఒక పుష్పించే మొక్క. దీని శాస్త్రీయ నామం 'జింజబర్ అఫిషినాలె'. 14వ శతాబ్దంలో పూర్వపు ఇంగ్లీషు పదమైన జింజిఫర్ నుంచే ఈ జింజర్ అనే పదం వచ్చింది. క్రీస్తు శకం ఒకటో శతాబ్దంలోనే ఈ అల్లం మన దేశం నుంచి ఐరోపా దేశాలకు ఎగుమతి అయ్యేదనడానికి చారిత్రక ఆధారాలు ఉన్నాయి. అంటే, అప్పటి నుంచి కూడా మన దేశంలో అల్లం పంట రైతులకు అండగా ఉంది. మన దేశంలో అనాదిగా జన్యు వైవిధ్యమైన అనేక రకాలను సాగుచేస్తున్నారు. అల్లం చెట్లు మీటరు ఎత్తు వరకూ పెరుగుతాయి. మొగ్గలు తెలుపు, గులాబీ రంగుల్లో ఉన్నప్పటికీ, పూలు మాత్రం పసుపు పచ్చని రంగుకు మారుతాయి. దేశంలో ఏటా సుమారు 1,920 మిలియన్ మెట్రిక్ టన్నుల అల్లం ఉత్పత్తి అవుతుంది. మధ్యప్రదేశ్ సగటున 692 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉత్పత్తితో అగ్రస్థానాన్ని ఆక్రమించింది. కర్నాటక (307 మిలియన్ మెట్రిక్ టన్నులు), అస్సాం (171 మిలియన్ మెట్రిక్ టన్నులు) వరుసగా రెండు, మూడు స్థానాల్లో ఉన్నాయి.



## పోటీ కోసం జీకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

- రెండవ ప్రపంచ యుద్ధం ఏ సంవత్సరంలో ముగిసింది?
  1945.
- మన సౌర వ్యవస్థలో అతిపెద్ద గ్రహం ఏది?
  బృహస్పతి.
- అతి పెద్ద సముద్రం ఏది?
  పసిఫిక్ మహాసముద్రం.
- జపాన్ కరెన్సీ ఏమిటి?
  జపనీస్ యెన్.
- 'ఆధునిక భౌతిక శాస్త్ర పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?
  ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.
- ఆస్ట్రేలియా రాజధాని ఏది?
  కాన్ బెర్రా.
- టైటానిక్ ఏ సంవత్సరంలో మునిగిపోయింది?
  1912.
- మోనాలిసాను ఎవరు చిత్రించారు?
  లియోనార్డో డా విన్సీ.
- ప్రపంచంలో అతి పొడవైన నది ఏది?
  అమెజాన్ నది.
- యునైటెడ్ స్టేట్స్ మొదటి అధ్యక్షుడు ఎవరు?
  జార్జ్ వాషింగ్టన్.
- ఏ మూలకం 'O' అనే రసాయన చిహ్నాన్ని కలిగి ఉంది?
  ఆక్సిజన్.
- కెనడా జాతీయ క్రీడ ఏది?
  ఐస్ హాకీ.
- 'ల్యాండ్ ఆఫ్ ది రైజింగ్ సన్' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
  జపాన్.
- అతి చిన్న ప్రధాన సంఖ్య ఏది?
  2.
- 'టు కిల్ ఎ మోకింగ్ బర్డ్' ఎవరు రాశారు?
  హార్పర్ లీ.
- 'రెడ్ ప్లానెట్' అని ఏ గ్రహాన్ని పిలుస్తారు?
  మార్స్.
- ప్రపంచంలో అతిపెద్ద క్షీరదం ఏది?
  బ్లూ వేల్.
- సాపేక్ష సిద్ధాంతాన్ని ఎవరు అభివృద్ధి చేశారు?
  ఆల్బర్ట్ ఐన్‌స్టీన్.
- చైనా రాజధాని ఏది?
  బీజింగ్.
- 'హ్యారీ పోటర్' సిరీస్ రచయిత ఎవరు?
  JK రౌలింగ్.
- ప్రపంచంలో అతిపెద్ద ఎడారి ఏది?
  అంటార్కిటికా.
- 'స్టార్రీ నైట్' చిత్రాన్ని ఎవరు చిత్రించారు?
  విన్సెంట్ వాన్ గోహ్.
- బెర్లిన్ గోడ ఏ సంవత్సరంలో పడిపోయింది?
  1989.
- కిరణజన్య సంయోగక్రియ సమయంలో మొక్కలు ఏ వాయువును గ్రహిస్తాయి?
  కార్బన్ డయాక్సైడ్
- దక్షిణాఫ్రికా కరెన్సీ ఏమిటి?
  దక్షిణాఫ్రికా రాండ్
- నోబెల్ బహుమతి పొందిన మొదటి మహిళ ఎవరు?
  మేరీ క్యూరీ.

## సిపిఐ నాయకుడి మృతికి పోటు ప్రసాద్, బాగం నివాళి



ప్రజాపక్షం/చింతకాని: కొదుమూరు గ్రామానికి చెందిన సిపిఐ సీనియర్ కార్యకర్త చిట్టిమోదు అర్జున్ గురువారం అనారోగ్యంతో మృతిచెందాడు. అర్జున్ మరణవార్త తెలు సుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ కొదుమూరు చేరుకుని అర్జున్ మృతదేహంపై సిపిఐ పార్టీ జెండా కప్పి పూల మాల వేసి నివాళులర్పించారు. పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు జ మ్ముల జితేందర్‌రెడ్డి, కొండపర్తి గోవిందరావు,మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్ రావు, జిల్లా సమితి సభ్యులు కూచిపుడి రవి,మాజీ సర్పంచ్ నక్కన బోయిన కృష్ణ ,మాజీ ఎంపిటిసి నారాపోగు హేమ నాగార్జున పాల్గొన్నారు.

## సిపిఐ సానుభూతిపరురాలు రాజమ్మ మృతి



ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్: సిపిఐ సానుభూతిపరురాలు గుండపనేని రాజమ్మ(95)గురువారం మృతిచెందారు. సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ఆమె భౌతికాయాన్ని సంద ర్శించి అరుణ పతాకాన్ని కప్పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం రాజమ్మ చేసిన కృషిని వారు కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. జిల్లా కార్యవర్గ సభ్యులు పోటు కళావతి, మేకల శ్రీనివాసరావు, పలువురు నాయకులు రాజమ్మ భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

## రామనాథంకు సిపిఐ నేతల నివాళి



ప్రజాపక్షం/కూసుమంచి : మండల పరిధిలోని నేలపట్ల గ్రామానికి చెందిన సిపిఐ మండల మాజీ సహాయ కార్యదర్శి, ప్రస్తుత నేలపట్ల గ్రామ శాఖ కార్య దర్శి కామ్రేడ్ తుడుం రామనాథం అనారోగ్య కారణాలతో గురువారం తెల్ల వారుజామున మృతి చెందారు. పార్టీ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న జాతీయ సమితి సభ్యులు భాగం హేమంత రావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ మృతదేహాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి, పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి భూక్యా నరసింహ, జిల్లా సమితి సభ్యులు గుండెపంగు మల్లేష్, నాయకులు నంబూరి నారాయణ, మర్రి వీరభద్రం, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

### మున్సిపల్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసురత్నం డిమాండ్



ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి : గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లోని శానిటరీ, ఔట్ సోర్సింగ్ కార్మికులకు 26 వేలు చెల్లించాలని మున్సిపల్ కార్మికుల రాష్ట్ర అధ్యక్షులు కె.ఏసు రత్నం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గురు వారం ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబాల సభ్యులకు వెంటనే ఉద్యోగం కల్పి ంచాలని, ప్రమాదంలో మరణించిన కార్మికులకు 5లక్షలు ఎక్స్ గ్రేసియా చెల్లించాలని, తదితర కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వరంగల్ గ్రేటర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఎఐటియుసి, టిఎంఆర్పిఎస్, జెఎసి ఆధ్వర్యంలో రిలే దీక్ష నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ వర్కర్స్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కే.ఏసు రత్నం హాజరై ధర్నా ఉద్దేశించి మాట్లాడుతూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు అధికారుల దృష్టికి అనేకసార్లు తీసుకొచ్చినప్పటికీ అధికా రులు స్పందించలేదని, వెంటనే తగు చర్యలు తీసుకోవాలని లెని యెడల, ఆందోళన, పోరాటాల వంటి కార్యక్రమాలు చేస్తామన్నారు. చేశారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ అధికా రులు చీఫ్ మెడికల్ ఆఫీసర్ బి.రాజారెడ్డి, మున్సిపాలిటీ హెల్త్ ఆఫీసర్ రాజేష్ యూనియన్ నాయకులను చర్చలకు ఆహ్వానించి కార్మికనాయకులతో చర్చలు నిర్వహించారు. కార్పొ రేషన్ పరిధిలో ఉన్న సమస్యలన్నీ వారం రోజుల్లోగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని, ధర్నాను ముగించుకోవాలని కార్మికులను కార్మిక సంఘాలను కోరారు. అధికారులు హామీ మేరకు ధర్నా ముగించారు. టిఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు బొట్ల బిక్షపతి మాదిగ, జెఏసి వ్యవస్థాపక అధ్యక్షులు వేల్పుల ధర్మరాజు, ఎఐటియుసి జిల్లా అధ్యక్షులు వేల్పుల సారంగపాణి, ఎమ్మార్పీఎస్, జాతీయ నాయకులు మందకుమార్ మాదిగ,ఎంమ్మెస్ఎస్ రాష్ట్ర అధ్యక్షులు వేల్పుల సూర్యం సంఘీభావం తెలిపారు. మున్సిపల్ సంఘం నాయకులు ఎం రఘు, బొక్క ఏలియా, ఎస్.కె షమీం, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులకు ఇండ్లు మంజూరు చేయాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే రాజారెడ్డి



ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి: గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా ఐదుగురితో నియమించబడ్డ ఇండ్ల మంజూరు కమిటీ గ్రామాలలో రాజకీయాలకతీతంగా నిజమైన లబ్ధిదదారులను ఎంపిక చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో సిపిఐ జనగామ మండల సమితి సమావేశం ములకల లక్ష్మయ్య అధ్యక్షతన జరుగగా రాజారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ రాష్ట్రం లో నిజమైన లబ్ధిదారుల ఎంపిక కోసం గ్రామాలలో స్పెషల్ ఆఫీసర్ చైర్మన్‌గా, ఇద్దరు మహిళలు, ఒక ఎస్‌సి, ఎస్‌టి, బిసి ఒకరు ఇతరులతో కలిసి ఐదుగురు సభ్యుల చేత కమిటీ ఏర్పాటుచేయడం జీవో ద్వారా తెలిపారన్నా రు. సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేసి లిస్టు ప్రభుత్వానికి ఇవ్వాలని కార్యకర్తలను కోరారు. అలాగే రుణమాఫీని రూ.2లక్షలపై దాటిన వారందరికి కూడా వెంటనే బ్యాంకులో వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్, మండల కార్యదర్శి చెల్లోజు మల్లేశం, లింగాల రాములు, మెడుదుల మల్లేశం, గూళ్ల శ్రీహరి, సిద్ధి రాములు, శ్రీనివాస్, గుగులోతు రాఘవులు పాల్గొన్నారు.

## మనియాండ్లగుట్ట మైనింగ్ కాంట్రాక్టును రద్దు చేయాలి : గోద శ్రీరాములు



ప్రజాపక్షం/వలిగొండ : వలిగొండ మండలంలోని రెడ్ల రేపాక గ్రామ రెవిన్యూ శివారులో 580 సర్వే నెంబర్ మనియాండ్లగుట్ట విస్తీర్ణం 36 ఎకరాలు ప్రభుత్వ భూమి మైనింగ్‌ను కాంట్రా క్టర్లు గుట్టను ప్రభుత్వం దగ్గర లీజింగ్ తీసుకున్న భార్గవ మైనింగ్ కాం ట్రాక్ట్‌ను ప్రజలు వ్యతి రేకిస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు తెలిపారు. గురువారం వలిగొండ మండల భారత కమ్యూనిస్టు పార్టీ పట్టణ శాఖ సమావేశం కామ్రేడ్ చొప్పరి వెం కటేశం అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు పాల్గొని మాట్లాడుతూ ప్రజల ప్రయో జనాల కోసం ఉపయోగించాల్సిన మనియాండ్లగుట్ట పైన అనే కమైన వన్యప్రాణులు, వ్యవసాయ కూలీలకు ఉపయోగపడే గుట్టని వెంటనే కాం ట్రాక్టును రద్దు పరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణ శాఖ కార్యదర్శిగా సుద్దాల సాయికుమార్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎల్లంకి మహేష్, మచ్చ లక్ష్మి నారా యణ, సలాద్రి రవీందర్, బొడిగే సుదర్శన్, నరసింహ పాల్గొన్నారు.

## అసైన్డ్ భూముల ధరణి పట్టాలను రద్దు చేయాలి

### డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్



ప్రజాపక్షం/ఎల్కతుర్తి : ఇందిరాగాంధీ ప్రభుత్వ ఆయంలో దళితులకు ఇచ్చిన అసైన్డ్ భూములను టిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో ధరణి పేరుతో అక్రమంగా పట్టాలు చేసిన భూమి పట్టాలను రద్దు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఎల్కతుర్తి మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో భూములేని దళితులకు ప్రభుత్వ భూములైన పంచరాయి, పంచరాయి, శిఖాలను, దళితులకు పట్టాలిచ్చారు. గత కొ న్ని సంవత్సరాలుగా దళితులు సాగు చేసుకుంటూ జీవిస్తున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఆయంలో ధరణి పేరుతో రెవె న్యూ యంత్రాంగం కుమ్మక్కై ప్రభుత్వ భూ ము లను అక్రమంగా పట్టాలు చేశా రని, దళితులకు ఇచ్చిన భూములను అక్రమంగా పట్టాలు చేసిన రెవెన్యూ అధికారులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిపిఐ ఎల్కతుర్తి మండల కార్యదర్శి ఊట్కూరి రాములు మాట్లాడుతూ హనుమకొండ జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్న రెవిన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి వ్యాపారం చేస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లుగా ప్రభుత్వ యంత్రాంగం వివరిస్తు ందని ఆయన విమర్శించారు. ప్రభుత్వ భూ ములను పేదలకు పంచేంతవరకు పోరాటాలను ఉధృతం చేస్తామని ఆయన తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములను సమగ్ర సర్వే చేసి దళితులకు స్వసిత భూమి హక్కు పట్టా పాస్ బుక్కులను ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు నిమ్మల మనోహర్, జిల్లా సహాయ కార్యదర్శి శనిగరపు రాజకుమార్, నాయకులు తాండ ముండయ్య, మర్రి విజయ్, రేణిగుంట్ల సాంబ య్య, నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

### ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ డిమాండ్



ప్రజాపక్షం/ములకలపల్లి:రాష్ట్రంలో హమా లీ కార్మికులకు సంక్షేమ చట్టాన్ని అమలు చేసి కార్మికులకు మేలు చేయాలని ఎఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి నరాటి ప్రసాద్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం మండల పరిధిలోని నర్సాపురం కోటమ్మ గుడి వద్ద జరిగిన హమాలీ కార్మిక సంఘం మండల 6వ మహాసభ నకిరికంటి పుల్లారావు అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న నరాటి మాట్లాడుతూ హమాలీ కార్మికులు రెక్కలు ము క్కలు చేసుకొని కష్టం మీ ద కుటుంబాలను పోసిస్తున్నారని, ప్రభుత్వం నుం డి రూపాయి కూడా ఆర్థికంగా సహాయం అందటం లేదని అ న్నారు. హమాలీ కార్మికులు అనారోగ్యం బాధ పడుతున్నారని, తక్షణమే భవన నిర్మాణ కార్మిక చట్టం అమలు కు కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఎఐటియుసి జిల్లా కార్యదర్శి యండి యూసుఫ్, వేల్పుల మల్లికార్జున్, మండల కార్యదర్శి ఎస్‌కె జబ్బార్, నాయకులు నరాటి రమేష్, అనుముల సాయి, మిర్యాల వెంక న్న, నిమ్మల వెంకటేశ్వర్లు, గద్దల రమేష్, ముళ్ళపూడి కేశవలు, వీరయ్య, రాంబాబు పాల్గొన్నారు.



## ఎఐటియుసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఇన్‌చార్జిగా నూకల చంద్రమౌళి

ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి : భూపాలపల్లి ఎఐటియుసి సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల ఇన్‌చార్జిగా నూకల చంద్రమౌళిని ఎన్నుకున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎఐటియుసి కొమురయ్య భవన్‌లో నూత నంగా ఎన్నికైన చంద్రమౌళికి ఎఐటియుసి నాయకులు బ్రాంచ్ వైస్ ప్రెసిడెంట్ మాతంగి రామచందర్, అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ రెడ్డి, సిపిఐ నాయకులు భీమనాధుని సత్యనారాయణ శుభాకాంక్షలు తెలిపి చంద్రమౌళిని అభినందించారు.

## ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి : ఓమయ్య



ప్రజాపక్షం/నిజామాబాద్ అర్బన్ : దేశ కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి పోరాడి చట్టాలు సాధించి పెట్టిన ఏకైక సం ఘం ఎఐటియుసిని జిల్లా కార్యదర్శి ఓమయ్య అన్నారు. గురువారం స్థానిక ఎఐటియుసి జిల్లా కార్యాలయంలో జిల్లా సమితి ఆధ్వర్యంలో 105వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలపై సమావేశాన్ని నిర్వ హించి ఆయన మా ట్లాడారు.30,31లలో జయంతి ఉత్సవాలు నిర్వహిం చాలని ఎఐటియుసి అను బంధ సంఘాల నాయకులు ఏర్పాట్లు చేసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు చక్రపాణి, హన్మాండ్లు, దేవేందర్, అనిల్ పాల్గొన్నారు.

# మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో 'వంశ వారసులకే' పెద్దపీట!

## ఎన్నికల ప్రసంగాల్లోనే నేతల విమర్శలు..నిస్సిగ్గుగా టికెట్ల కేటాయింపులో అందరిదీ ఒకేబాట




**ముంబయి :** త్వరలో జరుగనున్న మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలలో వంశ వారసత్వ రాజకీయాలు కీలక పాత్రను పోషిస్తున్నాయి. కుటుంబ రాజకీయాలు ప్రోత్సహిస్తున్నారని ఎన్నికల సమయంలో ప్రత్యర్థులపై తీవ్రస్థాయి విమర్శలతో విరుచుకుపడే రాజకీయ పార్టీలు వారి బంధువులు రాజకీయాలలో నిలదొక్కుకోవడానికి పార్టీ టికెట్లు ఇచ్చి ఎన్నికల బరిలోకి దింపడానికి మాత్రం వారు ఏమాత్రం సిగ్గుపడటంలేదు.నవంబరులో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలలో అభ్యర్థుల జాబితాలు దీనిని రుజువు చేయబోతున్నాయి. మహారాష్ట్ర అసెంబ్లీలో మొత్తం 288స్థానాలకు ఎన్నికలు జరుగబోతున్నాయి. 288 అసెంబ్లీ స్థానాలకు ప్రధాన రాజకీయ పార్టీలు ఎన్నికల బరిలోకి దించనున్న తమ అభ్యర్థుల తొలి జాబితాను కనీసం నవంబరు 20వ తారీఖునాటికైనా ప్రకటించాల్సి ఉంటుంది. అధికార పక్షం తరపున ఉన్నటువంటి భారతీయ జనతా పార్టీ (బిజెపి), ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండేకు చెందిన శివసేన పార్టీ, అజిత్‌పవార్ సారథ్యంలోని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి)లు తమ అభ్యర్థుల తొలి జాబితాను ఇప్పటికే ప్రకటించాయి. అదే సమయంలో ప్రతిపక్షం నుంచి మహా వికాస్ అఘాడి (ఎంవిఎ), ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) కూడా తొలిజాబితాను ప్రకటించింది. అయితే ఈ పార్టీల జాబితాలలో పేర్కొన్న అభ్యర్థులు చెప్పుకోదగిన సంఖ్యలో మంత్రులు, శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులకు సన్నిహితులు సహా వారి కుమారులు, కూతుళ్లు, భార్యలు, సోదరులు లేక సోదరీమణులు ఉండటం ఆశ్చర్యకరమైన విషయంగా చెప్పుకోవచ్చు. మాజీ ముఖ్యమంత్రి కూతురైన శ్రీజయ చవాన్, లోక్‌సభ ఎన్నికలలో పోటీ చేసేందుకు కాంగ్రెస్ పార్టీని వీడి బిజెపిలో చేరిన అశోక్ చవాన్‌లను నవంబరు 20వ తేదీన జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దించుతోంది. రాజకీయంగా అత్యంతబలమైన కుటుంబం నుంచి వచ్చిన వీరికి కాషాయపార్టీ బిజెపి అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చి అసెంబ్లీ టికెట్లు కేటాయించింది. శ్రీజయ చవాన్ తమ కుటుంబం ఎంతో కాలంగా సాంప్రదాయంగా పోటీచేస్తున్న నాందేడ్ జిల్లాలోని భోకర్ అసెంబ్లీ నియోజకవర్గాన్ని కేటాయించింది. ముంబయి బిజెపి చీఫ్ అశీష్ షెలార్ సోదరుడు వినోద్ షెలార్‌ను మలాడ్ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెపి అభ్యర్థిగా బరిలోకి దించుతోంది. కాగా అదే సమయంలో ఆశిష్ బాంద్రా పశ్చిమ నియోజకవర్గం స్థానం నుంచే తిరిగి పోటీ చేసేందుకు పార్టీ అంగీకరించింది. అహిల్యానగర్ జిల్లాలోని శ్రీగొండ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెపి తన సిట్టింగ్ ఎమ్మెల్యే బాబన్‌రావు పచుపుటే స్థానంలో ఆయన భార్య ప్రతిభా పచ్‌పుటేను రంగంలోకి దించుతోంది. ఆయన ఆరోగ్య సమస్యలను కారణంగా చూపిస్తూ కుటుంబం నుంచి ఆయన భార్యకు టికెట్ కేటాయిస్తున్నట్లు కాషాయపార్టీ ప్రకటించింది. అలాగే థానే జిల్లాలోని కళ్యాణ్ తూర్పు అసెంబ్లీ నియోజక వర్గం నుంచి బిజెపి ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్న గణపత్ గైక్వాడ్‌ను ఈసారి పక్కకు పెట్టి ఆయన సతీమణి సులభను అదే నియోజకవర్గం నుంచి బరిలోకి దించుతోంది. కొద్దినెలల క్రితంగణపత్ గైక్వాడ్ పోలీస్ స్టేషన్‌లోనే శివసేన ఎమ్మెల్యేపై కాల్పులు జరిపిన కేసులో జైలులో ఉన్నాడు. ఈ కారణంతో ఆయన భార్యకు ఆయన ప్రాతినిథ్యం వహించిన స్థానంలో బిజెపి టికెట్ కేటాయించింది. మాజీ కేంద్రమంత్రి, లోక్‌సభ సభ్యుడు నారాయణ రాణే కుమారుడు నితేష్ కుడాల్ అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి ఇప్పటికే ఎమ్మెల్యేగా ఉండగా ప్రస్తుతం శివసేనలో చేరినటువంటి నితేష్ అన్నయ్య, మాజీ లోక్‌సభ సభ్యుడు నీలేష్‌ను కన్‌కవలి అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశాన్ని కల్పించారు. సింధుదుర్గ్ జిల్లా వారి కుటుంబానికి ఎంతోకాలంగా కంచుకోటగా పేరొందింది. పుణే జిల్లా చించ్‌వాడ్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బిజెపి సిట్టింగ్ ఎమ్మెల్యే లక్ష్మణ్ జగ్‌తప్ స్థానంలో ఆయన భార్య అశ్వినీ జగ్‌తప్‌ను కాషాయపార్టీ అభ్యర్థిగా పోటీ చేయిస్తోంది. ముంబయిలోని వోర్లి అసెంబ్లీ స్థానం నుంచి ఆదిత్య థాకరేకు తిరిగి అదే స్థానాన్ని కేటాయించారుశివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్‌థాకరే. ఆయన కజిన్ బ్రదర్ వరుణ్ సర్దేశాయ్‌ను బాంద్రా తూర్పు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి తొలిసారిగా పోటీకి నిలపబోతున్నారు. మహారాష్ట్ర నవ్‌నిర్మాణ్ సేన (ఎంఎన్‌ఎస్) చీఫ్ రాజ్‌థాకరే ఎన్నికలలో ఎప్పుడూ పోటీ చేయని తన కుమారుడు అమిత్‌ను ముంబయిలోని మహిమ్ అసెంబ్లీ స్థానం నుంచి బరిలోకి దింపారు. కాగా వంశ రాజకీయాల గురించి రాజకీయ పరిశీలకులు అభయ్ దేశ్‌పాండేను ప్రశ్నించగా తమ అసెంబ్లీ నియోజకవర్గాలలో బాగా నిలదొక్కుకున్న నాయకులు ఆ నియోజకవర్గాన్ని తమ నియంత్రణలో ఉంచుకునేందుకు, ఓటర్లతో వారికున్న సంబంధాలను, నెట్‌వర్క్‌ను నిలబెట్టుకునేందుకే తమ సాంప్రదాయ అసెంబ్లీ నియోజకవర్గాలలో వారికి బలమైన పట్టు ఉన్నందున, వారి కుటుంబ సభ్యులను లేదా రాజకీయ వారసులను బరిలోకి దించుతున్నారని చెప్పారు.




## బిఎస్‌పి అభ్యర్థుల ప్రకటన

**లక్నో :** ఉత్తరప్రదేశ్‌లో 9 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 9 సీట్లలో బిఎస్‌పి గురువారం అభ్యర్థులను ప్రకటించింది. కాటహరి (అంబేద్కర్ నగర్) నుంచి అమిత్ వర్మ, ఫుల్పూర్ (ప్రయోగ్‌రాజ్) నుంచి జితేంద్రకుమార్ సింగ్, మీరాపూర్ (ముజఫర్‌నగర్) నుంచి షహనాజ్, సైసామౌ (కాన్పూర్) నుంచి విరేంద్ర కుమార్ శుక్లా, కర్హాల్ (మెయిన్‌పురి) నుంచి డాక్టర్ అవినాష్ కుమార్ శక్య, కుందర్కి (మొరదాబాద్) నుంచి రఫతుల్లా, గజియాబాద్ నుంచి పరమానంద జార్జ్, మజహవన్ (మీర్యాపూర్) నుంచి దీపక్ తివారీ పోటీ చేస్తారని బిఎస్‌పి ఒక ప్రకటనలో పేర్కొంది. మరో స్థానమైన ఖైర్ (అలీగఢ్)లో అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది.



## 'గడియారం' వాడుకోవచ్చు

### అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టులో ఊరట

**న్యూఢిల్లీ :** త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) చీఫ్, డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టులో ఊరట దక్కింది. ఎన్నికల్లో గడియారం గుర్తును అజిత్ పవార్ వర్గం ఉపయోగించుకోవచ్చని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. శరద్ పవార్ వర్గానికి నష్టం వాటిల్లకుండా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించబోమన్న హామీ పత్రాన్ని సమర్పించాలని అజిత్ వర్గానికి ఆదేశించింది. ఎన్నికల వేళ.. అజిత్ పవార్ వర్గం 'గడియారం' గుర్తును వినియోగించకుండా నిరోధించాలని ఎన్‌సిపి (ఎస్‌పి) అధినేత శరద్ పవార్ ఇటీవల సుప్రీంకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఎన్నో ఏళ్ల పాటు ఎన్‌సిపి అధ్యక్షుడిగా వ్యవహరించిన శరద్ పవార్.. ఆ పార్టీ, గుర్తు (గడియారం)తో తనకున్న అనుబంధాన్ని పిటిషన్‌లో వెల్లడించారు. దీనివల్ల ఓటర్లలో గందరగోళాన్ని సృష్టించకుండా.. అజిత్ పవార్ వర్గం కొత్త గుర్తు కోసం దరఖాస్తు చేసుకోవాలని పిటిషన్‌లో కోరారు. దీనిపై న్యాయస్థానం తాజాగా విచారణ చేపట్టింది. ఎన్నికల్లో గడియారం గుర్తును అజిత్ పవార్ ఉపయోగించుకోవచ్చంటూ సుప్రీం ఆదేశించింది. అయితే.. ప్రచార సమయంలో శరద్ పవార్ వర్గానికి నష్టం వాటిల్లకుండా గమనిక ద్వారా ప్రజలకు స్పష్టంగా తెలపాలని పేర్కొంది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించబోమని నవంబర్ 6లోగా హామీ పత్రాన్ని సమర్పించాలని అజిత్ వర్గానికి ఆదేశించింది. ఒకవేళ ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు చేపడతామని హెచ్చరించింది. కాగా.. ఎన్‌సిపిని చీల్చి షిండే వర్గంలో చేరిన అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్‌సిపిగా కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. అంతేకాకుండా, ఆ పార్టీ జెండా, ఎన్నికల గుర్తు (గడియారం)ను కూడా వారికే కేటాయించింది. శరద్ చంద్ర పవార్ వర్గానికి.. 'బూరుగ ఊదుతున్న వ్యక్తి' గుర్తును ఈసీ ఖరారు చేసింది. గడియారం కోసం న్యాయపోరాటం చేసిన శరద్ పవార్‌కు సుప్రీంకోర్టులో నిరాశే మిగిలింది.

## యుపి ఉప ఎన్నికల్లో పోటీ చేయం

### ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతాం : కాంగ్రెస్

**న్యూఢిల్లీ :** ఉత్తరప్రదేశ్‌లో ఉప ఎన్నికలు జరిగే 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులను పోటీకి దింపడం లేదని కాంగ్రెస్ ప్రకటించింది. ఇండియా కూటమి అభ్యర్థులకు మద్దతు తెలుపుతామని స్పష్టం చేసింది. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో పార్టీ ప్రయోజనాల కంటే రాజ్యాంగాన్ని పరిరక్షించే ప్రయత్నాలకు ప్రాధాన్యత ఇవ్వాలన్న డిమాండ్ల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. గురువారం ఢిల్లీలోని ఎఐసిసి కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఉత్తరప్రదేశ్ కాంగ్రెస్ చీఫ్ అజయ్ రాయ్‌తో కలిసి యుపి ఇన్‌చార్జి ఎఐసిసి ప్రధాన కార్యదర్శి అవినాష్ పాండే మాట్లాడారు. తమ పార్టీ కార్యకర్తలు కలిసి ఎలాంటి భేషజాలం లేకుండా స మాజ్‌వాది పార్టీ అభ్యర్థుల విజయం కోసం, ఇతర ఇండియా కూటమి అభ్యర్థుల కోసం పనిచేస్తారని చెప్పారు. దేశంలోనూ, యూపిలో రాజకీయ, సామాజిక ఉద్రిక్తతలు పెరుగుతు న్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకుని ఇండియా కూటమి ఏర్ప డిందన్నారు. దీని ప్రాతిపదికిన పార్టీ ప్రయోజనాలను ముందుకు తీసుకెళ్లడం గురించి ప్రశ్న కాదని, రాజ్యాంగాన్ని పరిరక్షించడం, పరస్పర సామరస్యాన్ని పటిష్టం చేయడమే తమ ముందున్న లక్ష్యమన్నారు. వీటిని దృ ష్టిలో పెట్టుకుని,కాంగ్రెస్ నేతల సలహా మేరకు ఉప ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను పోటీలో నిలపవద్దని నిర్ణయం తీసుకున్నామన్నారు. 10 అసెం బ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగనున్న దృ ష్ట్యా ఉత్తర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో ఇటీవల సంవి ధానం బ చావో సంకల్ప్ సమ్మేళన్ నిర్వహించామన్నారు. రాయ్, కాం గ్రెస్ లెజిస్లేచర్ పార్టీ నేత ఆరాధన మిశ్రా, ఎఐసిసి ప్రధాన కార్యదర్శి సంస్థ కెసి వేణుగోపాల్, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, ఎస్‌పి నాయకత్వంతో సంప్రదింపులు జరిపిన తర్వాతే ఈ నిర్ణయానికి వచ్చినట్లు పాండే తెలిపారు. ఇండియా కూటమి అభ్యర్థులంద రూ 'సైకిల్' ఎన్నికల గుర్తుపై ఉపఎన్నికల్లో పోటీ చేస్తారని ఎస్ పి చీఫ్ అఖిలేష్ యాదవ్ చెప్పిన మరుసటి రోజు కాంగ్రెస్ ప్రక టన చేయడం గమనార్హం. అయితే, అభ్యర్థి , గుర్తు రెండూ ఎస్‌పి లేదా మరేదైనా ఇండియా కూటమి మిత్రపక్షానికి చెందినవని, కాంగ్రెస్‌కు చెందినది కాదని పాండే స్పష్టం చేశారు.

## జార్ఖండ్‌లో హోరెత్తిన నామినేషన్లు

**రాంచి :** జార్ఖండ్‌లో రెండు విడతల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దఫలో నామినేషన్ల ప్రక్రియ కొనసాగుతోంది. అ యితే శుక్రవారంతో గడువు ముగియనుండడంతో గురువారం నా మినేషన్లు హోరెత్తాయి. జెఎంఎం చీఫ్, ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్, ప్రతిపక్షనేత, బిజెపి అభ్యర్థి, ఇతర అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. ముఖ్యమంత్రి బర్‌హైట్ నియోజకవర్గం నుంచి, ఆయన భార్య, ఎమ్మెల్యే కల్పనా సోరెన్ గండీ అసెంబ్లీ సీట్ నుంచి నామినేషన్ వేశారు. జార్ఖండ్ వ్యతిరేక శక్తులు, కుట్రదారుల ముందు తానెప్పుడూ తలవంచలేదని, అలాగే జార్ఖండ్‌ను తలవంచనివ్వనని నామినేషన్ వేసిన తరువాత సోరెన్ ఎక్స్‌లో పేర్కొన్నా రు. షెడ్యూల్డ్ కులాల అభ్యర్థులకు రిజర్వ్ చేయబడిన చందన్‌కియారి అసెంబ్లీ నియోజకవర్గం నుండి బిజెపి శాసనసభ్యుడు, ప్రతిపక్ష నాయకుడు అమర్ కుమార్ బౌరి నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. తాను మూడోసారి సునాయాసంగా గెలుస్తానని పేర్కొంటూ, జార్ఖండ్ ప్రజలు 'అవినీతి' జెఎంఎం నేతృత్వంలోని కూటమి ప్రభుత్వాన్ని మార్చాలని, బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని కోరుకుంటున్నారని బౌరి అన్నారు. నలుగురు కాంగ్రెస్ మంత్రులు రామేశ్వర్ ఓరాన్, ఇర్ఫాన్ అన్సారీ, దీపికా పాండే సింగ్, బన్నా గుప్తాలతో సహా ఇతర రాజకీయ నేతలు కూడా తమ తమ అసెంబ్లీ స్థానాల నుండి నామినేషన్లు దాఖలు చేశారు. జెఎంఎం నేతలతో పాటు బిజెపి, కాంగ్రెస్‌లకు చెందిన 50 మంది అభ్యర్థులు వివిధ అసెంబ్లీ స్థానాల నుంచి నామినేషన్లు దాఖలు చేశారు. బిజెపికి చెందిన ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన సిపి సింగ్ రాంచీ అసెంబ్లీ స్థానానికి నామినేషన్ పత్రాలు సమర్పించగా, అదే స్థానానికి జెఎంఎం రాజ్యసభ ఎంపి మహువా మజీ తన పత్రాలను దాఖలు చేశారు. మద్దతుదారులు తనను 50,000 ఓట్లతో గెలవాలని లక్ష్యంగా పెట్టుకున్నారని చెప్పారు. తాను గెలిస్తే రాంచీని మెట్రో నగరంగా మారుస్తానని మాజీ అన్నారు. ' బిజెపి వివక్ష రాజకీయాలు చేస్తోంది. రాంచీ ప్రజలందరికీ అభివృద్ధి చెందేలా చూస్తామని నేను హామీ ఇస్తున్నాను' అని ఆమె అన్నారు. మాజీ సిఎం చంపాయ్ సోరెన్ కుమారుడు బాబూలాల్ సోరెన్ ఘట్సీల స్థానం నుంచి నామినేషన్ దాఖలు చేయగా, కేంద్ర మాజీ మంత్రి అర్జున్ ముండా భార్య మీరా ముండా పొత్కా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పత్రాలు దాఖలు చేశారు.

## జర్నలిస్టుపై బలప్రయోగ చర్యలు తీసుకోవద్దు

### యుపి ప్రభుత్వానికి సుప్రీంకోర్టు మార్గదర్శకాలు

**న్యూఢిల్లీ :** ఉత్తర ప్రదేశ్‌లో ఒక జర్నలిస్టుకు వ్యతిరేకగా నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు దాఖలు చేయడంపై సుప్రీంకోర్టు స్పందించింది. జర్నలిస్టుపై నిర్బంధ, బలప్రయోగ చర్యలకు పాల్పడవద్దని జస్టిస్ బి.ఆర్.గవాయ్ సారథ్యంలోని ధర్మాసనం గురువారం మార్గదర్శకాలు జారీ చేసింది. ఈ ధర్మాసనంలో జస్టిస్ కె.మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ కూడా సభ్యులుగా ఉన్నారు. జర్నలిస్టు మమతా త్రిపాఠి దాఖలు చేసిన పిటిషన్ ఆధారంగా సుప్రీంకోర్టు ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. ఈ విషయంపై వెంటనే వివరణ ఇవ్వాలని ఆదేశించింది. తనపై రాజకీయ దురుద్దేశంతోనే నాలుగు ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేశారని త్రిపాఠి సుప్రీంకోర్టుకు ఫిర్యాదు చేశారు. దీనిపై ధర్మాసనం విచారణ సందర్భంగా త్రిపాఠీ రాసిన వ్యాసాలకు సంబంధించి ఆమెపై ఎలాంటి నిర్బంధ, బలవంతపు చర్యలు తీసుకోకూడదని ఆదేశించింది. ఈ కేసును తిరిగి నాలుగు వారాల తర్వాత విచారణ చేపడతామని కూడా ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వాన్ని విమర్శిస్తూ వ్యాసాలు రాయడంవల్ల జర్నలిస్టులు విమర్శలకు గురవుతున్నారనీ, ఇలాంటి కేసులో వారిపై నేరాభియోగాలు మోపుతూ కేసులు పెట్టకూడదని ధర్మాసనం మార్గదర్శకాలు ఇచ్చింది. త్రిపాఠీ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దేవ్ ధర్మాసనం ఎదుట హాజరయ్యారు.గతంలో ఇదేవిధంగా పిటిషన్ దాఖలు చేసిన జర్నలిస్టు అభిషేక్ ఉపా ధ్యాయ కేసులో ఆయనపై దాఖలైన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేశారని న్యాయవాది ధర్మాసనానికి గుర్తుచేశారు.

## కూల్చివేతలవల్ల నష్టపోయిన బాధితులే నేరుగా కోర్టుకు రావాలి

### కోర్టు ధిక్కార పిటిషన్‌ను తిరస్కరించిన 'సుప్రీం'



**న్యూఢిల్లీ :** న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులను ఉత్తరాఖండ్, ఉత్తర ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాలు ధిక్కరించాయంటూ దాఖలైన ఒక పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ప్రభుత్వాలు జరిపిన కూల్చివేతల చర్యలవల్ల నష్టపోయినవారు ఎవరైనా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ పి.కె.మిశ్రా, జస్టిస్ కె.వి.విశ్వనాథన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం గురువారంనాడు స్పష్టం చేసింది. అక్టోబరు ఒకటో తేదీ వరకూ సుప్రీంకోర్టుకు చెప్పకుండా, ఉత్తర్వులను ఉల్లంఘించి ఎవ్వరూ రహదారి మధ్యలో ఉండే మతపరమైన నిర్మాణాలు లేదా ఇతర అనధికార నిర్మాణాల కూల్చివేతలకు పాల్పకూడదని ఈ ఏడాది సెప్టెంబరు 17వ తేదీన అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు జారీ చేసింది. ఐతే కూల్చివేతలవల్ల నష్టపోయిన బాధితులెవరైనా నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చును గానీ సంబంధిత చర్యలపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఎవరైనా దాఖలు చేసే పిటిషన్లను మాత్రం విచారణ చేసేందుకు మొగ్గుచూపేది లేదని ధర్మాసనం స్పష్టంగా తేల్చిచెప్పింది. ప్రజా సమస్యలపై ప్రతిస్పందించే స్ఫూర్తిగల వారు ప్రతిచోటా ఉంటారనే మాటలు మాత్రం ఇలాంటి సీరియస్ విషయాలలో చెప్పవద్దని కూడా ప్రకటించింది. ఒకవేళ ప్రత్యేకించి ఎవరి ఆస్తులనైనా కూల్చివేసినా లేదా ప్రభుత్వం నిర్మూలించినాగానీ వారి తరపున మరొకరు ఆధారాలతో న్యాయస్థానాన్ని ఆశ్రయించినాగానీ ఆ పిటిషన్లపై విచారణ జరుగుతుందని కూడా తెలియజేసింది. వివాదాలకు తెరలేపే ఎలాంటి పిటిషన్లను తాము విచారణకు తీసుకునేదిలేదని ధర్మాసనం పేర్కొంది. ప్రభుత్వాలు కూల్చివేతల చర్యలు చేపడితే, దానివల్ల ఎవరైనా నష్టపోతే ఆ బాధితులే నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని, వారి పిటిషన్లను, వారి విజ్ఞప్తులను పరిశీలించి విచారణ జరుపుతామని చెప్పింది. ఐతే తొలుత పిటిషనర్ తరపు న్యాయవాది ధర్మాసనం ఎదుట వాదిస్తూ, హరిద్వార్, జైపూర్, కాన్పూర్‌లలో అధికారులు సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి కూల్చివేతలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇది స్పష్టంగా సుప్రీంకోర్టు ఉత్తర్వులను ధిక్కరించడమేనని ఆయన వాదించారు. ఈ విషయంలో గతంలోనే సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఎఫ్‌ఐఆర్ దాఖలు చేసిన తర్వాతే అధికారులు కూల్చివేతలకు పాల్పడ్డారని సదరు న్యాయవాది పేర్కొన్నారు. ఉత్తర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తరపున వాదనలకు హాజరైన అదనపు సొలిసిటర్ జనరల్ కె.ఎం.నటరాజన్ దీనిపై మాట్లాడుతూ, ఈ పిటిషనర్ థర్డ్ పార్టీ ఐనందువల్ల ఆయనకు పూర్తిగా వాస్తవాలు తెలిసే అవకాశం లేదని, అధికారులు కేవలం రోడ్డులో కాలిబాట (ఫుట్‌పాత్)పై ఉన్న ఆక్రమణలను మాత్రమే అధికారులు తొలగించారని వివరణ ఇచ్చారు. పత్రికా వార్తల ఆధారంగానే పిటిషనర్ కోర్టును ఆశ్రయించారని నటరాజన్ పేర్కొన్నారు. దాంతో ధర్మాసనం ఈ కేసును విచారణకు తీసుకునేందుకు తిరస్కరించింది. పిటిషనర్ ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఈ కూల్చివేతలు, తొలగింపులవల్ల నష్టపోయిన వ్యక్తి కాదని ధర్మాసనం భావించింది. ఐతే దీనివల్ల ప్రత్యక్షంగా నష్టపోయిన బాధితులు జైలులో ఉంటే, వారి తరపున వారి కుటుంబ సభ్యులు కూడా నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చునని వివరణ ఇచ్చింది.

## 'దానా' ప్రళయానికి...ఒడిశాతీరం'గజగజ' !

### శుక్రవారం ఉదయానికి భితర్కనిక-ధమ్రా ఓడరేవు మధ్య 'తీవ్రతుపాన్'గా ఆవిర్భావం
### అత్యవసర సమీక్ష సమావేశాన్ని నిర్వహించిన ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ



**భువనేశ్వర్ :** ఒడిశా తీరాన్ని 'దానా' తుపా న్ గజగజ వణికిస్తోంది. గురువారం సా యంత్రానికి ఒడిశా తీరానికి 200కి.మీ. దూరంలోకి చేరుకుని, 'దానా' అక్కడ తీవ్ర తుపాన్‌గా రూపాంతరం చెంది,తీరందాటనుందని రాష్ట్రంలోని పలు ప్రాంతాలలో భారీ వర్షాలు , ఈదురుగాల బీభత్సం నెలకొంటుందని, సముద్రపరిస్థితి అల్లకల్లోలంగా మారనుందని భారత వాతావరణ శాఖ (ఐఎండి)తెలిపింది . ఇదిలాఉంటే ఒడిశా రాష్ట్ర ప్రభుత్వం తీర ప్రాంత జిల్లాలలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలను మరింత ముమ్మరం చేసింది. ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ ఒక అత్యవసర సమీక్ష సమావేశాన్ని ఏర్పాటుచేసి, ఈ ప్రకృతి విపత్తు కారణంగా ప్రజలకు ఎలాంటి ప్రాణహాని తలెత్తకుండా గట్టి చర్యలు చేపట్టాలని, 'జీరో కాజువాలిటీ' ఉండేలా జాగ్రత్త వహించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రాత:కాల సమయానికి ఈ తీవ్ర స్థాయి తుపాన్ భితర్కనిక జాతీయ పార్క్, ఒడిశాలోని ధమ్రా ఓడరేవు మధ్య గంటకు 120 కి.మీ.ల అత్యంత వేగంతోకూడిన గాలులతో తొలిసారిగా ఒడిశా తీరాన్ని తాకి,అనంతరం తీరం దాటనుందని ఐఎండి తెలియజేసింది. బంగాళాఖాతంలోని వాతావరణ వ్యవస్థ గడిచిన 6గంటలలో 12కి.మీ.ల వేగంతో ఉత్తర వాయువ్య దిశగా కదులుతూ పారాదీప్ (ఒడిశా)కు ఆగ్నేయాన 210కి.మీ.ల వద్ద కేంద్రీకృతమైంది. ఒడిశాలోని ధమ్రా దక్షిణ ఆగ్నేయానికి 240కి.మీ.ల దూరంలో, పశ్చిమబెంగాల్ సాగర్ ద్వీపం దక్షిణంలో 310కి.మీ.ల వద్ద కేంద్రీకృతమైందని ఐఎండి తాజాగా విడుదల చేసిన బులెటిన్ వెల్లడించింది.'ఈ దానా తుపాన్ ఉత్తర వాయువ్యదిశగా ముందుకు కదిలి ఉత్తర ఒడిశాపశ్చిమ బెంగాల్ తీరాల మధ్య పూరీసాగర్ ద్వీపానికి సమీపాన ఉన్న భితర్కనికధమ్రా వద్ద గురువారం రాత్రి (అక్టోబరు 24) నుంచి శుక్రవారం ఉదయం (అక్టోబరు 25) వరకు గంటకు 100 నుంచి 110 కి.మీ.ల బలమైన గాలుల వేగంతో తీవ్రస్థాయి తుపాన్‌గా మారనుంది. అదికాస్తా గంటకు 120కి. మీ.ల వేగంతో కూడిన ఉధృత తుపాన్‌గా మారే అవకాశం కూడా ఉంది' అని భారత వాతావరణ శాఖ విడుదల చేసి న బులెటిన్ వివరించింది. అత్యంత బలమైన గాలులతో కూడిన మహోధృత 'దానా' తుపాన్ బీభత్సానికి బాలాసోర్, భద్రక్, భితర్కనిక, పూరీలోని కొన్ని ప్రాంతాలలో వృక్షాలు కూకటివేళ్లతో నేలకొరిగే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాంఝీ మాట్లాడుతూ ఇప్పటికే 3లక్షలకు పైగా తుపాన్ ప్రభావిత ప్రాంతాలకు సంబంధించిన ప్రజలను తుపాన్ శిబిరాలకు తరలించామని, ఈ ఆపరేషన్ ఇంకా కొనసాగుతూనే ఉన్నదని చెప్పారు. ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు చెందిన 19టీమ్‌లను అధికారయంత్రాంగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే కార్యక్రమాలలో నిమగ్నమయ్యారని, ఒడిశా రాపిడ్ యాక్షన్ ఫోర్స్‌కు చెందిన 51బృందా లు, అగ్నిమాపక సేవల సిబ్బంది ప్రజలను తరలించే కా ర్యక్రమాలలో, రహదారులపై రాకపోకలకు అవరోధంగా నిలిచిన నేలకొరిగిన వృక్షాలను తొలగించే కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారని అధికారులు చెప్పా రు.కాగా చర్య తీసుకోవాల్సిన ప్రాంతాలలో (చర్యలు చేపట్టేందుకు) ఐఎండి 'రెడ్ వార్నింగ్' జారీ చేసింది. మయూర్ భంజ్, కటక్, జైపూర్, బాలాసోర్, భద్రక్, కేంద్రపారా, జగత్సింగ్‌పూర్ ఈ ఏడు జిల్లాలకు ఐఎండి గురువారం రోజుకు 'రెడ్ వార్నింగ్' జారీచేసింది.

## సెబీచీఫ్ బచ్ వైఖరితో పిఏసిలో వాగ్వాదం

### చివరి నిమిషంలో మీటింగ్‌కు బచ్ గైర్హాజర్



**న్యూఢిల్లీ :** వివాదస్ప సెబీ (సెక్యూరిటీ ఎక్స్చేంజ్ బోర్డు ఆఫ్ ఇండియా) ఛైర్‌పర్సన్ మాధబి పురి బచ్ మరోసారి పిఏసి సమావేశానికి వెళ్ళకుండా గైరుహాజరయ్యారు. దీంతో పిఏసిలో ఉన్న రెండు రాజకీయ కూటములకు చెందిన సభ్యులమధ్య వాగ్వాదం జరిగింది. ఐతే ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని కమిటీ సమావేశాన్ని వాయిదా వేశారంటూ ఎన్‌డిఎ సభ్యులు ముఖ్యంగా బిజెపి సభ్యులు స్పీకర్‌కు ఫిర్యాదుచేసి తమ నిరసన తెలియజేశారు. సీనియర్ ఎంపీ పిఏసి ఛైర్మన్‌గా ఉన్నారనీ, ఆయన తమ అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోలేదని బిజెపి ఎంపీలు విమర్శించారు. ఒక మహిళ చివరి నిమిషంలో అత్యవసర కారణాలవల్ల రాలేకపోతున్నానని చెప్పినందువల్ల ఆమె మాటలను పరిగణనలోకి తీసుకున్నాననీ పిఏసి ప్రధానాధిపతి, కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు కె.సి.వేణుగోపాలాచారి వివరణ ఇచ్చారు. సమావేశం ప్రారంభమైన కొద్ది నిమిషాలకే అధికార కూటమి, ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపిలమధ్య తీవ్ర వాగ్వాదం జరిగిందనీ, దాంతో తనతోపాటు ఇతర ప్రతిపక్ష సభ్యులు కూడా సమావేశ మందిరం నుండి బయటకు వచ్చేశామని వేణుగోపాలాచారి చెప్పారు. పార్లమెంటుకు చెందిన ప్రజాపద్దుల కమిటీ (పిఏసి) సమావేశానికి హాజరుకావాల్సిందిగా మాధబి పురి బచ్‌కు ముందుగానే పిఏసి సమన్లు జారీ చేసింది. కానీ ఢిల్లీకి తాను రాలేనని ఆమె గురువారం ఉదయం 9.30 గంటల సమయంలో చివరి నిమిషంలో సమాచారం పంపించారు. పార్లమెంటరీ కమిటీ సమావేశానికి కేవలం రెండు గంటలే ముందుగా బచ్ సమాచారం తెలియజేయడం పార్లమెంటరీ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ప్రతిపక్ష సభ్యులు విమర్శించారు. దాంతో కమిటీ మీటింగ్‌ను వాయిదా వేయాల్సి వచ్చిందని వేణుగోపాలాచారిపేర్కొన్నారు. తొలుత తనకు మినహాయింపు ఇవ్వాలని ఆమె కోరితే తాము తిరస్కరించామని, తర్వాత ఆమె తాను వస్తున్నట్లు చెప్పి ఇలా చేశారని అన్నారు. ఐతే వేణుగోపాలాచారి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుని కమిటీ సమావేశాన్ని వాయిదా వేశారంటూ ఎన్‌డిఎ సభ్యులు ముఖ్యంగా బిజెపి సభ్యులు స్పీకర్‌కు ఫిర్యాదు చేసి తమ నిరసన తెలియజేశారు. గురువారం ఉదయం 9.30 గంటలకు మాధబి పురి బచ్ నుండి తమకు ఒక సందేశం వచ్చిందని, తాను ఈరోజు పిఏసి ఎదుట హాజరు కాలేనని తెలియజేశారని, అందువల్ల సమావేశాన్ని మరో రోజుకు వాయిదా వేయాల్సి వచ్చిందని వేణుగోపాలాచారి చెప్పారు.

## ఒప్పందాలను కచ్చితంగా గౌరవించాల్సిందే

### ప్రపంచీకరణ ప్రయోజనాలు అసమానం
### 'బ్రిక్స్'లో భారత విదేశాంగ మంత్రి జైశంకర్




**కజాన్ :** ఘర్షణలు, ఉద్రిక్తతలను విజయవంతంగా పరిష్కరించడమే 'ప్రస్తుతం నిర్దిష్ట అవసరమ'ని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అన్నారు. వివాదాలు, విభేధాలు చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ఒకసారి ఒప్పందానికి వచ్చిన తరువాత, వాటిని కచ్చితంగా గౌరవించాలంటూ ఇటీవల సరిహ ద్దు గస్తీపై చైనాతో కుదిరిన ఒప్పందంపై పరోక్షంగా ఈ వ్యాఖ్యలు చేశారు. 'మరింత నిష్పాక్షిక భౌగోళిక విధా నం' సృష్టించేందుకు ఐదు సూత్రాల మంత్రాలను జైశంకర్ వివరించారు. వలస కాలపు భౌగోళిక మౌలికసదుపాయాలకు సంబంధించిన వక్రీకరణలను సరిహద్దు సమగ్రతను గౌరవిస్తూ సరి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచానికి అత్యవసరంగా మరింత అనుసంధానత అవసరమని పేర్కొన్నారు. రష్యాలోని కజాన్‌లో రష్యా అధ్యక్షుడు పుతిన్ అధ్యక్షతన జరుగుతున్న బ్రిక్స్ సదస్సు ముగింపు రోజున బ్రిక్స్‌ప్లస్ సదస్సు ప్రధాని నరే ంద్ర మోదీ తరుపున గురువారం ప్రసంగించారు. మనం కష్టమైన పరిస్థితులలో కలుసుకున్నామని, దీర్ఘకాలపు సవాళ్ళపై ప్రపంచం తాజాగా ఆలోచించేందుకు సిద్ధం కావాలని జై శంకర్ అన్నారు. మనమంతా అందుకు సి ద్ధంగా ఉన్నామని మన సమ్మేళనమే సందేశం ఇస్తుందన్నారు. 'ఇది యుద్ధాల కాలం కాదు' అని గతంలో ప్ర ధాని మోదీ చేసిన వ్యాఖ్యలను ఆయన ఉటంకించారు. ఎలాంటి మినహాయింపు లేకుండా అంతర్జాతీయ చట్టాలను పాటించాలని, ఉగ్రవాదాన్ని ఏ మాత్రం ఉపేక్షించవద్దని చెప్పారు. పశ్చిమాసియాలో పరిస్థితి ఆందోళన కలిగించేది గా ఉన్నట్లు అర్థమవుతుందని, ఈ ప్రాంతం లో ఘర్షణ మరింత విస్తరిస్తుందనే ఆందోళన నెలకొందని పేర్కొన్నారు. ప్రపంచీకరణ ప్రయోజనాలు 'అత్యం త అసమానం'గా ఉన్నాయని బ్రిక్స్ వేదిక గుర్తించాలని జై శకంర్ అన్నారు. కొవిడ్ మహమ్మారి, బహుళ వివాదాల కారణంగా దక్షిణ భూగోళంపై భారాలు మరింత పెరిగాయని, ప్రత్యేకించి ఆరోగ్యం, ఆహారం, ఇంధన భ ద్రత అంశాలు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశా రు. ఈ వైరుధ్యంపై మనమెందుకు రాజీ పడాలి? మనం మరింత సమాన భౌగోళిక విధానాన్నిఎలా సృష్టించాలి? అని జై శంకర్ ప్రశ్నించారు. వీటి పరిష్కారానికి ఐదు ని ర్దిష్ట సూచనలు చేశారు. సమిష్టిగా ప్రపంచానికి అనుసంధానతను ఏర్పాటు చేయాలని అన్నా రు. స్వతంత్ర స్వభావం కలిగిన బహుళపక్ష వేదికలను విస్తృతం, బ లోపేతం చేయాలని, ఇప్పటికే ఉన్న వ్యవస్థలు, యం త్రాంగాలను ప్రత్యేకించి ఐక్యరాజ్య సమితి భద్ర తా మండలిలో శాశ్వత, శాశ్వతేతర కేటగిరిలు, బహుళపక్ష బ్యాంకు అభివృద్ధి బ్యాంకులలో సంస్కరణలు తీసుకురావాలని భారత్‌తరచూ చెబుతోందని ఆయన పునరుద్ఘాటించారు. ఇలాంటి వ్యవస్థలో పని విధానం ఐక్యరాజ్య సమితి మాదిరిగానే కాలం చెల్లిందన్నారు. భారత డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, ఇతర అంశాలను ప్రత్యేకించి దక్షిణ భూగోళంతో పంచుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

తెలుగు జాతీయ దినపత్రిక
ప్రజాపక్షం
PRAJAPAKSHAM
శుక్రవారం, అక్టోబరు 25

# అడ్వాంటేజ్ జెఎంఎం కూటమి

జార్ఖండ్ రాష్ట్ర అసెంబ్లీకి రెండు దశల్లో – నవంబర్ 13, 20 – పోలింగ్ నిర్వహణకు ఎన్నికల కమిషన్ చురుకుగా సన్నాహాలు చేస్తుండగా, సీట్ల సర్దుబాటుపై రాజకీయ పార్టీల గుసగుసలు, చురచురలు దాదాపుగా కొలిక్కివచ్చాయి. జార్ఖండ్ ముక్తిమోర్చా (జెఎంఎం), కాంగ్రెస్(ఐ), ఆర్‌జెడి, సిపిఐ(ఎంఎల్)లతో కూడిన ఇండియా కూటమి అధికారం నిలుపుకోవటానికి వ్యూహరచన చేస్తుండగా, 2019లో కోల్పోయిన అధికారాన్ని తిరిగి పొందటానికి బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ కసరత్తు చేస్తున్నది. ప్రస్తుత దృశ్యాన్నిబట్టి ఇండియా కూటమిదే పైచేయిగా ఉండనవచ్చు. అయితే ఎన్నికల క్షేత్రం సీట్ల సర్దుబాటు, అభ్యర్థుల ఎంపిక దశలోనే ఉంది. ప్రచారం మొదలైతేగాని ఓటర్ల మనోగతం క్రమంగా రూపుదిద్దుకోదు. ఈ గిరిజన ప్రధాన రాష్ట్రం ఇండియా కూటమిని మళ్లీ వరిస్తే జెఎంఎంనేత, ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తిరిగి అధికార అందలం అధిష్టిస్తారు. బిజెపి మాత్రం ముఖ్యమంత్రి పేరు ప్రకటించకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేరుతోనే ఓట్లు అర్థించాలని నిర్ణయించుకుంది. ఇటీవలనే హర్యానాలో ఓటమి అంచనాలు తలక్రిందులైన బిజెపి అధికారం నిలబెట్టుకున్న దృష్ట్యా మోదీకున్న జనాకర్షణే తమకు శ్రీరామరక్ష అని ఆ పార్టీ నాయకత్వం భావిస్తున్నది.

ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్‌పై ఇడి కేసు (ప్రస్తుతం ఆయన బెయిలుపై ఉన్నారు), సీనియర్ నాయకుడు, హేమంత్ జైల్లో ఉన్నప్పుడు స్వల్పకాలం ముఖ్యమంత్రి చంపాయ్ సోరెన్ బిజెపిలో చేరటం వంటి ప్రతికూలతలు ఉన్నప్పటికీ గిరిజనులకు ప్రాతినిధ్యం వహించే అతిపెద్ద పార్టీగా జెఎంఎం కొనసాగుతున్నది. బిహార్‌లోని దక్షిణ జిల్లాలతో 2000 నవంబర్ 15న జార్ఖండ్ రాష్ట్రం ఏర్పాటైంది. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమనేత, గిరిజన నాయకుడు శిబు సోరెన్‌ది ప్రభావవంతమైన కుటుంబం. ఆయన రెండవ కుమారుడు ప్రస్తుత ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్. ఈ రాష్ట్రంలో ఇండియా కూటమికి నాయకత్వం వహిస్తున్న పార్టీ జెఎంఎం. ఈ కూటమి సీట్ల సర్దుబాటు పూర్తి చేసుకుంది. కాగా బిజెపి గందరగోళంలో ఉంది. అది తొలి జాబితాలో ప్రకటించిన 66మంది అభ్యర్థుల్లో 35 మంది ఇతర పార్టీలనుంచి ఫిరాయించిన వారు కావటంతో ఆ పార్టీ కార్యకర్తల్లో తిరుగుబాటు మొదలైంది. తమకు పార్టీలో విలువలేదని భావించినవారు పెద్దసంఖ్యలో జెఎంఎం లేదా కాంగ్రెస్‌లోకి ఫిరాయిస్తున్నారు. మరికొందరు ఇండిపెండెంట్లుగా నామినేషన్ వేయటానికి తయారవుతున్నారు. ఈ పరిస్థితిని సరిదిద్దే నిమిత్తం బిజెపి జాతీయ ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శి బిఎల్ సంతోష్ మంగళవారం హుటాహుటిన రాంచీ చేరుకుని బుజ్జగింపుల కార్యక్రమం మొదలుపెట్టారు. జెఎంఎంలోకి బిజెపి నాయకుల ఫిరాయింపు గుర్చి బిజెపి ఎన్నికల సహ సమన్వయ కర్త, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మను విలేకరులు ప్రశ్నించగా, జెఎంఎంకు అభ్యర్థులు దొరక్కపోతే మరికొంతమందిని ఇస్తామంటూ అహంభావపూరితంగా సమాధానమిచ్చారు. ఎన్నికల్లో గెలుపుకోసం ఒక వ్యూహంగానే బిజెపి జంప్ జిలానీలకు ఎక్కువ సీట్లు ఇచ్చిందని అర్థమవుతున్నది. అయితే రాష్ట్ర పార్టీలో ఇంత పెద్ద ఎత్తున తిరుగుబాటును అది ఊహించలేదని సంతోష్ ఆకస్మిక ఆగమనం తెలియజేస్తున్నది. చిన్నచిన్న స్థానిక పార్టీలను, సంస్థలను చేరదీయటం, సోషల్ ఇంజనీరింగ్ వల్లనే హర్యానాలో గెలుపు సాధ్యమైందన్న అంచనాకు వచ్చిన బిజెపి అధినాయకత్వం అదే ఎత్తుగడతో ఫిరాయింపులను ప్రోత్సహించింది. వారిద్వారా వచ్చే అదనపు ఓట్లు, ప్రధానమంత్రి జనాకర్షణ తమ గెలుపును సాధ్యం చేస్తుందని బిజెపి అంచనాకు వచ్చినట్లుంది. జెఎంఎంను కుటుంబ పార్టీగా, అవినీతి పార్టీగా ప్రచారం చేస్తున్నది. ఈ ప్రచారం, ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తల చొరవ హర్యానాలోలాగా ఇక్కడ కూడా పట్టణ ప్రాంతాల్లో ఆ పార్టీకి కొంత మేలు చేయవచ్చు. కాని విస్తారమైన గ్రామీణ ప్రాంతం, పారిశ్రామిక ప్రాంతాలు ఇండియా కూటమికి అడ్వాంటేజ్ అవుతాయని భావించబడుతున్నది.

# ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరగాలా..?



ఎస్‌కె జకీర్
సీనియర్ జర్నలిస్ట్
9052631212

"రాష్ట్రంలో ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే కారుదే జోరు. పది నెలల కాలంలోనే కాంగ్రెస్ పాలనపై ప్రజలు విసుగు చెందారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ప్రజాభిప్రాయం మారుతోంది.ప్రజలంతా బిఆర్ఎస్ వైపే ఉన్నారు''అని బిఆర్ఎస్ మీడియా ఊరూవాడా కోడయి కూస్తోంది. పైగా ''కాంగ్రెస్ అంతర్గత సర్వేలో వెల్లడైన వాస్తవం''అని కూడా అందులో పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ తమ ఏడాది పాలనపై రెఫరెండంగా జనంలోకి వెళ్తే ప్రజల నుంచి వచ్చే స్పందన, రాజకీయంగా తమకు ప్రస్తుతం ఉన్న పట్టుపైన సర్వే నివేదికలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్త సునీల్ కనుగోలు బృందాన్ని,ఇంటలిజెన్స్ వర్గాలను ఆదేశించినట్టు బిఆర్ఎస్ ప్రచారం ప్రారంభించింది.

అసత్యాలు, అర్ధ సత్యాలతో కొన్ని కథనాలను వండి వార్చినంత మాత్రాన 'ప్రజాభిప్రాయం' మారదు. పైగా కాంగ్రెస్ పార్టీ అంతర్గతంగా జరిపినట్టు చెబుతున్న 'సర్వే' నివేదిక బిఆర్ఎస్ చేతుల్లోకి వెళ్లడం ఆచరణ సాధ్యమేనా? కాంగ్రెస్ పార్టీ సర్వే జరిపింది నిజమైతే,ఆ ఫలితాలు ప్రధానప్రతిపక్షానికి చేరడం నిజమైతే... కాంగ్రెస్ పార్టీలో,ప్రభుత్వంలో ఉన్న 'అండర్ కవర్' బిఆర్ఎస్ శ్రేయోభిలాషులను ఏరి పారెయ్యవలసిన సమయం ఆసన్నమైనట్టు రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఒక పార్టీ దాదాపు పదేండ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించినపుడు,ఆ పాలనలో వివిధ రకాలుగా లబ్ధిపొందిన అధికారులు, సిబ్బంది అంత త్వరగా 'విధేయత'ను మార్చుకోలేకపోవచ్చు.ఈ కారణంగానే తెలంగాణలో ప్రభుత్వం మారిందని,మార్పు కనిపిస్తోందని చెప్పడానికి 'కేటీఆర్ విధేయుల'కు చాలా ఇబ్బందికరంగా ఉన్నట్లుంది. కేసీఆర్ తనకు 'భజన చేసే వ్యక్తులకు' మాత్రమే ప్రభుత్వంలో ప్రాధాన్యత గల పోస్టులు,బదిలీలు,కోరుకున్న చోట ఏండ్లతరబడి కదిలించకుండా ఉంచారన్న ఆరోపణలున్నవి.కొందరు ఉన్నతాధికారులు కేటీఆర్ 'నీడ'లో అందిన కాడికి దోచుకున్నారని, హైదరాబాద్ చుట్టుపక్కల భూములు, భవనాలు, ఆస్తులు, ఫార్మ్ హౌజ్‌లు పెద్ద ఎత్తున కూడబెట్టుకున్నారన్న ఆరోపణలూ ఉన్నవి.కేటీఆర్ మంత్రిగా ఉన్న సమయంలో 'రెండు బృందాలు' ఏర్పడ్డాయని, అందులో ఒకటి తన నమ్మకస్తులు, విధేయులైన బిఆర్ఎస్ ఛోటా నాయకులతో ఒక బృందం, పరిశ్రమలు, బడా రియల్ ఎస్టేట్ సంస్థలకు చట్ట విరుద్ధమైన అనుమతులివ్వడానికి అధికారులతో కూడిన మరో బృందం ఉన్నాయని తెలంగాణ రాజకీయవర్గాల్లో ఆరోపణలున్నవి.

''పదినెలల పాలనలో ఈ స్థాయిలో గ్రాఫ్ పడిపోవడం గతంలో చూడలేదు. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే ఫలితాలు ఊహించని విధంగా వస్తాయి. కేసీఆరే అత్యంత బలవంతుడని తేలిపోతుంది. తెలంగాణలో రాజకీయంగా కేసీఆర్ బలంగా ఉంటేనే బాగుంటుందని ప్రజలు అంటున్నారు. ఎన్నికల్లో ఓడిన తరువాత కెసిఆర్ అత్యంత బలంగా మారారు''అని ఆ సర్వేలో తేలినట్టు బిఆరెఎస్ చెబుతోంది.''ప్రజలు రేవంత్ రెడ్డిపై అత్యంత ఆగ్రహంతో ఉన్నారు. సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం వద్దకు వెళ్లాల్సిన బాధితులు ప్రభుత్వంపై నమ్మకం లేక ప్రతిపక్షపార్టీ బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్‌కు వెళ్లడమే దీనికి అతిపెద్ద నిదర్శనం.

''ప్రజలు తెలంగాణ భవన్‌కు వెళ్లి కెసిఆర్ కోసం ఆరా తీస్తున్నారు.ఆయనను ఆరాధిస్తున్నారు'' అని బిఆర్ఎస్ ''సుపారీ మీడియా'' ప్రచార ఉధృతి సాగుతోంది.

''రేవంత్ సర్కారు ఎక్కువ కాలం ఉండేది కాదు'' అని కెసిఆర్ దగ్గర నుంచి కెటిఆర్, హరీశ్ రావు, జగదీశ్ రెడ్డి, ప్రశాంతరెడ్డి సహా పలువురు బిఆర్ఎస్ నాయకులు దాదాపు 9 నెలల నుంచే అంటున్న మాట. ఆ మాటల వెనుక ఉన్న మర్మమేమిటో తెలియదు. గతంలో ''వైఎస్.రాజశేఖరరెడ్డి, చంద్రబాబు,కిరణ్ కుమార్ రెడ్డి లాంటి వారితోనే కొట్లాడినం.ఈ చిట్టినాయుడు ఒక లెఖ్ఖ''అని కేటీఆర్ తరచూ వ్యాఖ్యానిస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఒక ఎత్తు. రేవంత్ రెడ్డి సిఎం కావడం మరో ఎత్తు.ఆయనను ఎలాగైనా గద్దె దింపాలన్నది బిఆర్ఎస్ లక్ష్యం. కానీ అసెంబ్లీలో బలాబలాల రీత్యా ప్రస్తుత పరిస్థితిలో రేవంత్ సర్కారును దెబ్బతీయడం సాధ్యం కాదు.అందువల్ల ప్రభుత్వంపై 'కృత్రిమ వ్యతిరేకత' ను సృష్టించడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.హైడ్రా,మూసీ వంటి వ్యవహారాలు,గ్రూప్ 1 పరీక్ష వంటి అంశంలో బిఆర్ఎస్ కు ఆశించిన రాజకీయ ప్రయోజనాలు లభించలేదు.

రైతు భరోసా వంటి సంక్షేమ కార్యక్రమాల అమలులో రేవంత్ ప్రభుత్వం నిధుల కొరతను తీవ్రంగా ఎదుర్కొంటున్నది. అయితే ఈ సమస్యను ప్రజల్లోకి బలంగా కాంగ్రెస్ పార్టీ ఇప్పటిదాకా తీసుకువెళ్లలేకపోతున్నది.దీనిపై 'ప్రజల్లో తిరుగుబాటు' రావాలని బిఆర్ఎస్ కోరుకుంటున్నది. ఆ కోరిక ఇప్పట్లో నెరవేరకపోవచ్చు.అలాగే




ప్రభుత్వపరంగా రైతులకు 2 లక్షల రుణమాఫీ, స్కిల్ యూనివర్సిటీ, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ఫ్యామిలీ డిజిటల్ కార్డు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్,అడ్వాన్సుడు నాలెడ్జ్ సెంటర్లుగా ఐటిఐల ఆధునీకరణ,అభివృద్ధి వంటి అంశాలను సానుకూల ప్రచారానికి వాడుకోవడంలోనూ కాంగ్రెస్ పార్టీ,ప్రభుత్వం – రెండూ విఫలమైనట్టు ప్రభుత్వవర్గాల్లో ఒక చర్చ ఉన్నది.

కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజల్లో బిఆర్ఎస్ చేస్తున్నంత బలంగా తాము చేస్తున్న కార్యక్రమాలను హైలెట్ చేసుకోవడంలో, తగిన పబ్లిసిటీ చేసుకోవడంలో అధికారపక్షం వెనుకబడిందన్న విశ్లేషణ ఉన్నది. ఇక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని టార్గెట్ చేస్తూ బిఆర్ఎస్ 'ఆబాలగోపాలం' ప్రతినిత్యం 'అటాక్' చేస్తుండగా కాంగ్రెస్ మంత్రులు, పార్టీ నాయకులు సమిష్టిగా తిప్పికొట్టలేకపోవడం ఒక మైనస్ పాయింటు. సీఎం రేవంత్ రెడ్డిపైనే మొత్తం భారం పడుతోంది. కొన్ని సందర్భాలలో ఈ విషయమై,కొందరు మంత్రుల ముందు సిఎం తన అసంతృప్తిని వ్యక్తం చేశారని వార్తలు వచ్చాయి. అవి పూర్తిగా నిరాధారమైన వార్తలుగా కొట్టిపారవేయలేం.తనపైన, తన సోదరులపైనా బిఆర్ఎస్ నాయకులు అదే పనిగా ఇష్టమొచ్చిన రీతిలో విమర్శలు,ఆరోపణలు చేస్తున్నప్పుడు తన 'టీమ్' సభ్యులంతా తనకు బాసటగా నిలబడాలని సీఎం ఆశించడం తప్పేమీ కాదు.

సిఎం రేవంత్ పై బిఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలను తోసిపుచ్చడంలో, గట్టిగా కౌంటర్ చేయడంలో పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి ముందంజలో ఉన్నారు. సిఎంపై విమర్శలు వస్తే 'తమకేమిటి' అని, పార్టీ నాయకులు,కొందరు మంత్రులు ఉదాసీన వైఖరిని ప్రదర్శిస్తూ ఉండవచ్చు.ఈ వైఖరి దీర్ఘకాలంలో పార్టీకి, ప్రభుత్వానికి నష్టం కలిగించే అవకాశాలున్నట్టు వాళ్ళు గ్రహించవలసి ఉన్నది. ముఖ్యమంత్రిని ఎవరైనా, ఏమైనా అంటే ఆ మాటలు తమను కూడా తాకినట్టు సిఎం సహచర మంత్రులు, పిసిసి ప్రముఖులు భావిస్తేనే బిఆర్ఎస్ 'మైండ్ గేమ్' ను దెబ్బతీయడానికి వీలవుతుంది.

టక్కు టమార, గజకర్ణ గోకర్ణ విద్యలలో బిఆర్ఎస్ నేతలు నిష్ణాతులని అనేక సంఘటనల్లో రుజువైనట్టు బిఆర్ఎస్ కార్యకలాపాలను రెండు దశాబ్దాలుగా అతి దగ్గరగా పరిశీలిస్తున్నకొందరు జర్నలిస్టులు చెబుతున్నారు.అలాంటి విద్యల్లో కాంగ్రెస్ పార్టీ ఆరితేరవలసి ఉన్నది. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నా లేకపోయినా సోషల్ మీడియాపై కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నట్టు మీడియాలో ఒక ప్రచారం చాలాకాలంగా ఉన్నది. ఆ ప్రచారం బూటకమని చెప్పలేం. ఎందుకంటే బిఆర్ఎస్ కు ఉన్న 'ధన బలం' అటువంటిది. గ్రూప్ 1 క్రెడిట్ రేవంత్ రెడ్డి ఖాతాలో చేరకుండా బిఆర్ఎస్ ఎన్ని ఆపసోపాలు పడిందో చూసాం. ఆ పరీక్షను ఎలాగైనా సరే వాయిదా వేయించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించి, తమకు అనుకూల ఆదేశాలు రానందున కెటిఆర్ తీవ్ర మనోవేదనకు గురయిన సంగతి తెలిసిందే !

రేవంత్‌రెడ్డి సర్కారుపై విపరీతమైన నెగిటివిటీ పెరిగినట్టు బిఆర్ఎస్ ప్రచారం చేస్తోంది. అందువల్ల 'ఇప్పటికిప్పుడు ఎన్నికలు' రాగాన్ని బిఆర్ఎస్ అందుకున్నది. అసలు ఉపఎన్నికలు అయినా,సాధారణ ఎన్నికలు అయినా,స్థానిక సంస్థల ఎన్నికలు అయినా సమయం, సందర్భాన్ని బట్టి జరుగుతాయి. కొన్ని విషయాల్లో ప్రభుత్వం పట్ల కొన్ని వర్గాల్లో కొంత అసంతృప్తి ఏర్పడవచ్చు.అంతే తప్ప ఉన్నపళంగా రేవంత్‌ను దింపివేసి, కెసిఆర్‌ను సిఎం చేయడం రాజ్యాంగపరంగా ఏ విధంగానూ సాధ్యం కాదు. కేసీఆర్ మరలా సిఎం కావాలన్నది బిఆర్ఎస్ కార్యకర్తలకు, నాయకులకు,అధికారం 'రుచి మరిగిన' శక్తులకు కావాలి. కెసిఆర్ సీఎం అయితేనే తెలంగాణ బాగుపడుతుందని, రేవంత్ హయాంలో 'గోస'పడుతున్నామని ప్రజలు భావించడం లేదు. ప్రజల్లో ఆ స్థాయి వ్యతిరేకతను కాంగ్రెస్ ప్రభుత్వం మూటగట్టుకోలేదు. కాగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'ఎడ్డి నాయకుడు' కాదు. రెడ్డి నాయకుడు. చిన్నచిన్న కాంట్రాక్టు టెండర్లు లభిస్తేనే సంబరపడిపోయి, పాలకవర్గాలకు సాగిలబడేవాళ్లు గతంలో ఉండేవారు. తెలంగాణలో అనేకమంది 'రెడ్డి నాయకులు' తమకు చాణక్యమూ, చాకచక్యమూ లేదని రుజువు చేశారు. చేతగాని వ్యక్తిత్వం ఉండడం, పటేల్ తనంతో పాటు ఎడ్డితనం, దొరతనంతో పాటు ప్రపంచం తెలియని అజ్ఞానం వల్ల 'రెడ్డి నాయకత్వానికి' ప్రత్యేక రాష్ట్రాన్ని పరిపాలించే అవకాశం చిక్కలేదు. అయితే కెసిఆర్ ఇందుకు భిన్నంగా తన సామాజికవర్గాన్ని ఏకంచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని నడిపించారు. ఆ ఉద్యమానికి తానే కేంద్ర బిందువు అయ్యారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక 'రెడ్లు' అధికారంలోకి రాకపోవడానికి, వెలమలు అధికారంలోకి రావడానికీ కారణం కెసిఆర్ 'కిలాడీ తనమే'! అది ఆయన పరాయిపాలకుల నుంచి నేర్చుకొని పాటించినదే!! అయితే డాక్టర్ వైఎస్.రాజశేఖరరెడ్డి నుంచి నాయకత్వ లక్షణాలు, చంద్రబాబు నుంచి లౌక్యం, కెసిఆర్ నుంచి 'జిత్తుల మారితనాన్ని' రేవంత్ రెడ్డి పుణికి పుచ్చుకున్నారు. తెగింపు, మొండితనం, సాహసం ఆయన రాజకీయజీవితం ప్రారంభించిననాటినుంచీ ఉన్నవే. ఈ కారణాలతో రేవంత్ రెడ్డిని అంత సులభంగా 'దెబ్బ కొట్టడం' కుదరదు. ''మీ శత్రువు కోపిష్టి అయితే అతన్ని విసిగించండి. గర్విష్టి అయితే అతని అహంకారాన్ని ప్రోత్సహించండి. తాను కోరుకున్న పద్ధతుల్లో శత్రువుతో ఆటాడుకునే నేర్పు, ప్రతిభ ఉన్న వాళ్ళకే ఇది సాధ్యం'' అని క్రీస్తు పూర్వం 3వ శతాబ్దానికి చెందిన యుద్ధరంగ నిపుణుడు సుంజు 'ద ఆర్ట్ ఆఫ్ వార్' లో చెప్పాడు. రేవంత్ రెడ్డి పకడ్బందీగా ఈ సిద్ధాంతాన్ని ఆచరిస్తున్నట్టు కనిపిస్తోంది.

# విద్యారంగం గట్టెక్కేదెట్లా?

తెలంగాణలో ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోంది విద్యారంగం. పేరుకపోయిన ఫీజు బకాయిలు, స్కాలర్‌షిప్స్, గురుకులాల అద్దెలు, మెస్ ఛార్జీల పెంపు.. ఇలా రాష్ట్ర ప్రభుత్వానికి సవాళ్లుగా మారాయి. గత ప్రభుత్వం చెల్లించకుండా ఉన్న బకాయిలు ఇప్పుడు గుదిబండగా మారాయి. ప్రధానంగా ఫీజు రీయింబర్స్‌మెంట్స్ ఆయా యాజమాన్యాలకు పూర్తిస్థాయిలో చెల్లించాల్సిన గత్యంతరంలేని పరిస్థితులు ఏర్పడ్డాయి. వీటిపై రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పటికే పలుమార్లు విన్నవించగా, ఇక చేసేది లేక వారు ఆందోళనలు, నిరసనలకు సిద్ధమౌతున్నారు. తెలంగాణ వ్యాప్తంగా 176 ప్రయివేటు ఇంజనీరింగ్ కాలేజీలతో వీటితో పాటు డిగ్రీ, పిజి, పాలిటెక్నిక్ కాలేజీలకు ఫీజు రీయింబర్స్‌మెంట్స్ గత బకాయిలే రూ.700 కోట్లు ఉన్నట్లు స్వయాన సిఎం రేవంత్ రెడ్డినే ప్రకటించారు. ప్రతీ సంవత్సరం బడ్జెట్‌లో రూ.2,500 కోట్లు కేటాయించి ఫీజు రియింబర్స్‌మెంట్ చెల్లించాల్సిన గత బిఆర్ఎస్ ప్రభుత్వం మూడేళ్లుగా కేవలం రూ.750 కోట్లు మాత్రమే చెల్లించినట్లు యాజమాన్యాలు చెబుతున్నాయి. గత బకాయిలతో పాటు ఈ సంవత్సరం కాంగ్రెస్ ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ కలుపుకుంటే రూ.8వేలకోట్లకు పైగా ఉంటుందని అంచనా. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద తగ్గించి చెల్లిస్తామని సిఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రతిపాదనలను ఆయా యాజమాన్యాలు తిరస్కరించాయి. విద్యాసంస్థల నిర్వహణా ఖర్చులు భారీగా పెరిగినా, ప్రభుత్వం తక్కువ రీయింబర్స్‌మెంట్ మాత్రమే చెల్లిస్తుందనే వాదనలు వినిపిస్తున్నాయి యాజమాన్యాలు.

తెలంగాణ ప్రభుత్వం 2024–25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో విద్యా రంగానికి రూ. 21,292 కోట్లు కేటాయించింది. గత బడ్జెట్ కంటే 11.5శాతం ఎక్కువ. ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్సియల్ స్కూల్ నిర్మాణానికి రూ.500 కోట్లు కేటాయించింది సర్కారు. ఇప్పటికే 20 పాఠశాలలకు శంకుస్థాపనలు జరిగాయి. ఇక సిబ్బంది జీత భత్యాలు, నిర్వహణా తదితర ఖర్చులూ సర్వ సాధారణమే. ఇటీవల కాలంలో 11వేలకు పైగా ఉపాధ్యాయుల నియామకాలు జరిగాయి. వారికి చెల్లించే వేతనాల భారం సైతం ప్రభుత్వంపై పడుతుంది. రాష్ట్రవ్యాప్తంగా 1023 గురుకుల రెసిడెన్సియల్ స్కూళ్లలో 662 అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. వాటి అద్దెలను గత సర్కారు సక్రమంగా చెల్లించక పోవడంతో బకాయిలు పేరుక పోయాయి. ఇప్పటికిప్పుడు రూ.300కోట్లు అద్దెలు చెల్లించాల్సి ఉంది. ఇటీవలే కొంతమంది యజమానులు అద్దె డబ్బులకోసం గురుకులాలకు తాళాలు వేసిన సందర్భాలూ చూశాం.

5 నుండి ఇంటర్ వరకు కొనసాగుతున్న వివిధ ప్రభుత్వ గురుకులాల్లో సుమారు 9 లక్షలమంది విద్యార్థులకు నాణ్యమైన అహారం అందడం లేదు. వీటికి తోడు అసౌకర్యాల వల్ల విద్యార్థులు అనారోగ్యం పాలౌతున్నారు. ఇందుకు అనేక ఉదాహరణలున్నాయి. గురుకులాల్లోని విద్యార్థుల మెస్‌కు తక్కువ నిధులు కేటాయించడం వల్ల నాసిరకం భోజనం అందుతోంది. ఆరో తరగతి విద్యార్థికి రోజుకు రెండు పూటలా భోజనం, బ్రేక్ ఫాస్ట్‌కు రూ.31.66 ఖర్చు చేస్తుంది సర్కారు. ప్రస్తుత మార్కెట్‌లో పెరిగిన నిత్యావసర సరుకుల ధరల వల్ల నాణ్యమైన భోజనం అందని పరిస్థితులు నెలకొన్నాయి. దీనిపై డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క స్పందించి మెస్ ఛార్జీల పెంపుపై ప్రతిపాదనలు కోరారు. మెస్, కాస్మోటిక్ ఛార్జీల పెంపు అత్యవసరం. ఇందుకు తగ్గ నిధులు కేటాయించాల్సిన అవసరం ఉంది. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు పెడుతున్న మధ్యాహ్న భోజనంకు చెల్లిస్తున్న ఛార్జీలు సైతం పెంచాల్సి ఉంది. కూరల్లో నాణ్యత లోపిస్తుండగా, కోడిగుడ్లు సైతం పూర్తి స్థాయిలో విద్యార్థులకు పెట్టడం లేదు.

సిఎం రేవంత్‌రెడ్డి వద్దనే విద్యా మంత్రిత్వ శాఖ ఉంది. రాష్ట్రవ్యాప్తంగా నెలకొన్న అనేక సమస్యలు, ఇతర ఒత్తిళ్ల వల్ల విద్యాశాఖకు పూర్తిస్థాయి సమయం కేటాయించే పరిస్థితులు లేవు. దీంతో ప్రాథమిక, ఉన్నత విద్యతో పాటు ఇంటర్, ఉన్నత విద్య, సాంకేతిక విద్యలోని లోపాలను సరిదిద్దలేక పోతుంది ప్రభుత్వం. కొన్ని సంస్కరణలు తీసుకవస్తున్నా, ప్రస్తుత ఫాస్ట్ జనరేషన్‌లో ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకోలేక పోవడం వల్ల విద్యార్థులు నష్ట పోవాల్సి వస్తుంది. విద్యా కమీషన్‌ను ఏర్పాటుచేసి ఛైర్మన్‌గా ఆకునూరి మురళిని నియమించినట్లు ప్రకటన వెలువడ్డా, ఆయన బాధ్యతలు స్వీకరించలేక పోయారు. దీంతో ప్రభుత్వ విద్యా సంస్థలపై పర్యవేక్షణ కరువౌతుంది. జిల్లా స్థాయిలో కలెక్టర్లు ఆయా విద్యా సంస్థలు, హాస్టళ్లను సందర్శిస్తూ, స్థానికంగా నెలకొన్నసమస్యలను ప్రభుత్వానికి నివేదిస్తున్నా తక్షణం యంత్రాంగం స్పందించడం లేదు. ఆర్థిక ఇబ్బందులు ఉండడం వల్లే విద్యా శాఖ ఉన్నతాధికారులు స్పందించ లేకపోతున్నారు. దీంతో ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విరుచుకపడుతున్నాయి.

ప్రధానంగా బిఆర్ఎస్ కాంగ్రె స్ ప్రభుత్వంపై విమర్శల దాడి చేస్తుంది. వారి ప్రభుత్వంలో చెల్లించకుండా ఉన్న కాలేజీల ఫీజులు, గురుకులాల అద్దె బకాయిలను ప్రస్తావించకుండా ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం మాత్రమే ఉన్నట్లుగా విమర్శలు గుప్పిస్తుంది. అయితే.. కొద్దికాలంలో రాష్ట్ర మంత్రి వర్గ విస్తరణ నేపథ్యంలో విద్యాశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించే అవకాశాలున్నట్లు తెలుస్తుంది. ఈ శాఖకు కేటాయించే మం త్రి పూర్తిస్థాయిలో సమర్థతతో పనిచేయాల్సి ఉంటుంది. లేనిపక్షంలో విద్యారంగం మరింత కుదేల య్యే ప్రమాదం ఉంటుంది.

చిలగాని జనార్ధన్,
8121938106

# ప్రభుత్వానికి గుదిబండగా... రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

ఆర్థిక ఇక్కట్లల్లో తెలంగాణ ప్రభుత్వం కొట్టు మిట్టాడుతుంది. అంత అంత మాత్రమే ఆదాయం వస్తుండటంతో ఆర్థిక పరిస్థితి గుదిబండగా మారింది. ఆర్థిక క్రమ శిక్షణ పాటిస్తూ, నిర్వాహణ భారాన్ని, ఖర్చులను తగ్గించుకొని రూపాయి రూపాయి వడిసి పట్టుకొని ప్రభుత్వాన్ని నడిపిస్తున్నప్పటికీ ఆర్థిక పరిస్థితి మాత్రం మెరుగుపడే పరిస్థితి కనిపించడం లేదు. నెల నెలకు కనీసంగా 25 వేల కోట్ల రూపాయాల ఆదాయం వస్తే ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపించే అవకాశం ఉంది. ప్రస్తుతం నెల నెల సమకూరుతున్న ఆదాయానికి ఖర్చుకు వ్యత్యాసం కనిపిస్తోంది. ఆదాయం కోసం ప్రభుత్వం ఎన్ని మార్గాలను అన్వేషించినప్పటికి ఫలితాలు కనిపించని పరిస్థితి నెలకొంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రస్తుతం నెలనెలా 18 వేల కోట్ల రూపాయాలు ఆదాయం సమాకూరుతోంది. ఖర్చులు, జీత భత్యాలు, సంక్షేమ పథకాల కోసం వచ్చిన ఆదాయం ఖర్చు అవుతుంది. ఆర్థిక క్రమ శిక్షణ పాటించినప్పటికి ఎప్పటికీ ఖజానా ఖాళీకుండలా కనిపిస్తుంది. గత ప్రభుత్వం చేసిన అప్పుల వల్ల ప్రస్తుతం ఆర్థికంగా చితికిపోయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వానికి నెలకు వివిధ రకాల రూ. 18 వేల కోట్ల రూపాయలు ఆదాయం సమకూరుతుంది. ఇందులో రాష్ట్ర ప్రభుత్వం 3.50 లక్షల మంది ఉద్యోగులకు 2.50 లక్షల మంది పైగా పెన్షర్లకు నెలకు 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతుంది. గత ప్రభుత్వం చేసిన అప్పులకు నెలకు 6 వేల కోట్లు అప్పులకు వడ్డీ చెల్లిస్తుండగా, మరో 3 వేల కోట్లు సంక్షేమ పథకాల అమలు కోసం ప్రభుత్వం ఖర్చు చేస్తుంది, మరో 3 వేల కోట్లు ప్రభుత్వ నిర్వహణ, పలు నిర్మాణ పనులకు బిల్లు చెల్లించడం, కొత్తగా రోడ్లు, సాగు, తాగు నీరు పథకాలకు ఖర్చు చేయడంతో ఖజాన పెట్టే ఖాళీ అవుతుంది. ఆదాయం మిగులు మాట ఏమోకాని వచ్చిన ఆదాయం కంటే ప్రభుత్వంపై అదనంగా ఆర్థిక భారంపడుతుంది.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దాదాపు 10 నెలల కాలంలో వివిధ బ్యాంకులు, వివిధ ఆర్థిక సంస్థల నుంచి దాదాపు 49 వేల కోట్ల రూపాయాలు రుణాలు తీసుకొని ప్రభుత్వాన్ని నడుపుతున్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పుల వడ్డి క్రింద పది నెలల కాలంలో 60 వేల కోట్ల రూపాయలు చెల్లించింది. గత ప్రభుత్వం రమా రమి రూపాయలు 7 లక్షల కోట్లు అప్పు చేయగా రోజుకు రూపాయలు 200 కోట్లు వడ్డి రూపేణ చెల్లిస్తే నెలకు అక్షరాల 6 వేల కోట్ల చెల్లించాల్సి వుంటుంది. రాష్ట్ర ప్రభుత్వంకు నాలుగు శాఖల నుంచి మాత్రమే ఆదాయం సమకూరుతుంది. మిగత శాఖల నుంచి పెద్దగా ఆదాయం సమకూరే పరిస్థితి లేదని చెప్పాలి. అబ్కారి శాఖ, రవాణ శాఖ, స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ, వాణిజ్య పన్నుల శాఖ నుంచి మాత్రమే ఆదాయం వస్తుంది. అబ్కారి శాఖకు నెలకు 3 వేల నుంచి 3500 కోట్ల వరకు ఆదాయం సమకూరుంది. వాణిజ్య పన్నుల శాఖ నుంచి అధికంగా ఆదాయం వచ్చే అవకాశం ఉన్నప్పటికి రాజకీయ జోక్యంతో పూర్తి స్థాయి పన్నులు వసూలు కావడం లేదు. ప్రభుత్వం నాలుగు శాఖలపై ఆదారపడి వచ్చే ఆదాయంతో ఖర్చు చేస్తున్నప్పటికి, రుణాలు తీసుకోవడం అనివార్యమైంది. అన్ని రకాలుగా అన్వేషణ చేస్తున్నా ఆదాయ మార్గాలు కన్పించడంలేదు. కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహకారం అంత అంత మాత్రమే అని చెప్పాలి. బిజెపి పాలిత రాష్ట్రాలకు కేంద్రప్రభుత్వం పూర్తిగా ఆర్థిక సహకారం అందిస్తూ, బి.జె.పి. యేతర ప్రభుత్వాలకు ఆర్థిక సహకారం తగినంతగా అందించడం లేదని చెప్పాలి. కేంద్రానికి మద్దతు ఇస్తున్న ప్రాంతీయ, జాతీయ పార్టీల ప్రభుత్వాలకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తుంది.

ఇటీవల కేంద్ర ప్రభుత్వం వరద నష్టాలకు సహాయంగా ఆంధ్ర ప్రభుత్వానికి 7500 కోట్ల రూపాయలు ఆర్థిక సహకారం అందించగా తెలంగాణ ప్రభుత్వంకు 3,800 కోట్ల రూపాయలు అందించింది. 16 సీట్ల టి.డి.పి. కేంద్ర ప్రభుత్వంకు ప్రధాన మద్దతుగా నిలవడంతో ఎ.పి.కి అదనంగా కేంద్రం ఆర్థికంగా సహకారం అందిస్తుంది. గూడ్స్ సర్వీస్ ట్యాక్, జి.యస్.టి పన్ను క్రింద రావల్సిన వాటాను కేంద్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో తెలంగాణకు చెల్లంచక పోవడం వల్ల సంకటంగా మారింది. గత ప్రభుత్వం ప్రభుత్వ భూములు విక్రయించి ఆదాయం సమాకూర్చుకుంది. తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేసేందుకు సుముఖంగా లేనట్టె కన్పిస్తుంది.

రైతులకు రైతు భరోసా క్రింద రెండు విడతలు చెల్లించాలంటే రమారమి 15 వేల కోట్ల రూపాయలు అవసరం అవుతాయి. విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, ఉపకార వేతనాల క్రింద మరో 7 వేల 700 కోట్ల రూపాయాలు చెలించాల్సి వుంది. ఇప్పటికే రుణాలు తెచ్చి రైతు రుణమాఫి పథకం క్రింద 2 లక్షల రుణాలున్న రైతులకు 20 వేల కోట్ల రూపాయలు రుణమాఫీ చేసింది. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగులుగా చేరితున్న వారికి అదనంగా వేతనాలు ఇవాల్సి ఉంటుంది. ఖర్చులు ఎక్కువ ఆదాయం తక్కువ ఉండటంతో ప్రభుత్వానికి ముందు నుయ్యి..వెనుక గొయ్యి అన్న చందంగా తయారైంది. వచ్చే ఆదాయం జీతాలకు, పెన్షన్లకు వడ్డీ చెల్లింపులకు, సంక్షేమ పథకాలకు ఖర్చు అవుతుండటంతో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయడం, కొత్త ప్రాజెక్టుల నిర్మాణం, ఇతర సంక్షేమ పథకాలు రైతు భరోసా, ఫీజు రీయంబర్స్‌మెంట్, మహిళలకు రూ.2500 వంటి పథకం, సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే ప్రభుత్వంకు రుణాలు తీసుకోవడం అనివార్యమని చెప్పాలి.

గుర్రం రాంమోహన్ రెడ్డి,
7981018644

# ఆన్లైన్ గేమింగ్‌లో కరిగిపోతున్న పిల్లల భవిత

విస్తృత రూపంలో సమాజం, సూక్ష్మ రూపంలో బడి, తరగతి గది రేపటి పరిపూర్ణ వ్యక్తిత్వం గల పౌర సమాజాన్ని తయారుచేసే విజ్ఞాన కర్మాగారం. ఇల్లు, బడి బాల్యానికి బంగారు భవిష్యత్తును అందించే కేంద్రాలు. ఇంట్లో, బడిలో, సమాజంలో ఆధునిక పరికరాల వినియోగం విపరీతంగా పెరిగిపోయింది. ఇలా ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం అతిగా చూస్తున్న అమెరికా, స్వీడన్ బాలలు మేధో పరిజ్ఞానంలో వెనుకబడి ఉన్నారు. అలాగే పుస్తక పఠనం మీద అధికంగా ఆధారపడిన ఇటలీ, హంగరీ దేశాల బాలల ప్రజ్ఞ చాలా మెరుగ్గా ఉందంటున్నారు ప్రొఫెసర్ మోనిక రోజన్. నూతన టెక్నాలజీ రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. సద్వినియోగం చేసుకోవచ్చు, దుర్వినియోగమూ చేసుకోవచ్చు. పిల్లలు మొబైల్ ఫోన్ల మాయ(వల)లో పడి తమ విలువైన కాలాన్ని, సహజ మేధస్సుతో ఆలోచించే స్పృహను కోల్పోతున్నారు. అంతే కాదు.. యువత, ఆడ, మగ, వృద్ధులు అనే తేడా లేకుండా ఈ ఆధునిక పరికరాల వినియోగం శృతి మించడంతో సమాజం మానసిక సమస్యలతో అనారోగ్యం పాలవుతుంది.

పిల్లలు ఫోన్ ఉంటేనే అన్నం తింటారు. చెప్పిన మాట వింటారు. ఆన్లైన్‌లో ఆడుతూనే గంటలకు గంటలు గడిపేస్తుంటారు. లేదంటే ఏడుస్తుంటారు. చివరికి ఆ ఏడుపు ఆపాలన్నా ఫోనుతోనే సాధ్యం అనే స్థాయికి నేటి పిల్లల పరిస్థితి దిగజారింది. చదువుతో సంబంధం లేకుండా అందరూ దీనికి బాధ్యులే, బాధితులే. ఈ ఆధునిక మానసిక దౌర్భాగ్యంతో పిల్లలు సహజ మేధస్సుతో సృజనాత్మకంగా, వినూత్నంగా ఆలోచించే శక్తి కోల్పోతున్నారు. పిల్లలు ఫోనే లోకం, ఆన్లైన్ ఆట లేనిదే పూట గడువదనేలా తయారయ్యారు. ఆన్లైన్ గేములలో తుపాకులతో కాల్చేసే విధ్వంసకరమైనవే ఎక్కువగా ఉంటున్నాయి. కొట్టుకోవడం, చంపుకోవడమే లక్ష్యంగా ఉండే ఆటల మూలంగా ఆ చిన్నారుల మనసులు ప్రతికూల ఆలోచనలతో నిండిపోతున్నాయి. పబ్జీ, బ్లూవెల్ లాంటివైతే మరణాలకు కారణం అవుతున్నాయి. ఇలా ఫోన్లకు బానిసైన పిల్లల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నది. మితిమీరి ఫోన్లకు బానిసలైన వారంతా పెద్దయ్యాక బెట్టింగు, ఇతర చెడు వ్యసనాలకు లోనవుతారనే నిపుణుల సూచనలను తల్లిదండ్రులు, ప్రభుత్వాలు పట్టించుకొని తక్షణమే ఆన్లైన్ గేమింగ్ వ్యవహారానికి అడ్డుకట్ట వేయాలి. విపరీతమైన ఫోన్ వాడకంతో భావితరం 'మానసిక, శారీరక సమస్యల పౌర సమాజం'గా పరిణమించనుంది. ఈ ఆన్లైన్ గేమింగ్ నియంత్రణపై అధ్యయనం చేసి పొంచి ఉన్న తీవ్ర పరిణామాల నుండి బయటపడేయటానికి తమిళనాడు రాష్ట్ర ప్రభుత్వం ఒక అధికారిక కమిటీని నియమించింది. ఈ కమిటీలో సభ్యులుగా ప్రభుత్వ విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్‌లు, ప్రొఫెసర్లను నియమించింది. తమిళనాడు ఆన్లైన్ గేమింగ్ అథారిటీ (టీఎన్‌ఓజీఏ) దీని ప్రభావం ప్రమాదకర పరిస్థితుల్లో ఉందని రాష్ట్రాన్ని అప్రమత్తంచేసి,కట్టడి చేయాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పింది.

**తల్లిదండ్రుల, ప్రభుత్వాల బాధ్యత..** విద్యార్థుల్లో ఆన్లైన్ గేమింగ్ వ్యసనం విచ్చలవిడిగా పెరిగిపోతున్న నేపథ్యంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులు వచ్చేందుకు ప్రత్యేక ప్రణాళిక చేపట్టాల్సి



వుంది. విద్యార్థులకు మంచి అలవాట్లు అలవడేలా మనస్తత్వ శాస్త్ర నిపుణులు, మానసిక వైద్యుల సహాయాన్ని తీసుకొని కౌన్సిలింగ్ చేయించాల్సిన అవసరం ఎంతో ఉంది. మన రాష్ట్రంలో అనుమతిలేని ఆన్లైన్ గేమింగ్ యాప్‌లను రద్దు చేయాలి లేదా నియంత్రించాలి. ప్రభుత్వం ఆమోదించిన గేమ్ లే మార్కెట్లోకి వచ్చేలా చూడాలి. ఎక్కడైనా అతిక్రమించినట్లు కనిపిస్తే వారిపై చట్టపరంగా కఠినచర్యలు తీసుకోవాలి. ఈ పెను ముప్పు నుం చి బాల్యాన్ని కాపాడుకోవడంకోసం.. తక్షణమే స్పందిం చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టి బాధ్యతతో వెంటనే నియంత్రణా చర్యలు చేపట్టాలి. ఆధునిక టెక్నాలజీ పిల్లలకు ఉపయోగపడే విధంగా విద్యార్థుల్లో వినోదంతో పాటు విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో చారిత్రక, పౌరాణిక అంశాలలో నైపుణ్యాలు పెంచుకోవడానికి కొన్ని గేమింగ్ సంస్థలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థుల మానసిక భద్రత, భరోసా కోసం తల్లిదండ్రులు, ప్రభుత్వాలు సామాజిక, మానసిక నిపుణుల సూచనలు పాటిస్తూ రేపటి ఆరోగ్యవంతమైన సమాజంకోసం ఆన్లైన్ గేమింగ్, ఫేక్ వ్యవహారాన్ని కట్టడిచేయాల్సిన అవసరం ఉంది.

మేకిరి దామోదర్, 9573666650.



## పత్తి రైతులకు మద్దతు ధర, బోనస్ ఇప్పించాలని వినతి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** పత్తి రైతులకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇప్పించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి రైతులకు న్యాయం చేయాలని కోరుతూ మాజీ మంత్రి, సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి గురువారం సూర్యాపేటకు విచ్చేసిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ పత్తి రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, అకాల వర్షాలతో పత్తి పంట తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోయారన్నారు. ఎక్కడా కూడా రైతులకు ఒక్క రూపాయి సహాయాన్ని ప్రభుత్వం అందించిన దాఖలాలు లేవన్నారు. నష్టాన్ని అంచన వేసి చేతులు దులుపుకుందన్నారు. తెలంగాణ రాష్ట్రం పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్షచూపుతుందన్నారు. గుజరాత్ రాష్ట్రంలో పండించిన పత్తి కంటే తెలంగాణ రాష్ట్ర రైతులు పండించిన పత్తి ఎంతో నాణ్యమైందని కాటన్ కార్పోరేషన్ ఆఫ్ఇండియా ప్రశంసించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. పత్తికి క్వింటాకు రూ. 8257ఇప్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బోనస్ రూ. 275కూడా అందేలా చర్యలు తీసుకోవాలని తాను కలెక్టర్‌ను కోరినట్లు చెప్పారు. పత్తి రైతులు దళారుల బారీన పడకుండా సిసిఐ కేంద్రాలు పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయాలని కోరారు.

## హక్కులపై మహిళలు అప్రమత్తం

### జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లీశ్వరి



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** మహిళలు రాజ్యాంగం కల్పించిన తమ హక్కుల పట్ల అప్రమత్తంగా ఉండాలని జాతీయ మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి దేవరం మల్లీశ్వరి అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లో మహిళా సమాఖ్య సభ్యత్వ నమోదును గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు ఉన్న హక్కులు స్వేచ్ఛ ఆచరణలో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలపై,అకృత్యాలను నిరోధించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమైయ్యాయని విమర్శించారు. చిత్తశుద్ధితో ప్రభుత్వం అధికారులు మహిళల సమస్యలను పరిష్కరించాలని కోరారు. మహిళలను చైతన్య పరిచేందుకు జాతీయ మహిళా సమాఖ్య నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో మహిళా సమాఖ్య పట్టణ కార్యదర్శి యల్లావుల ఉమా, సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు,దొంతగాని సావిత్రమ్మ,కారింగుల రమాదేవి,దొంతగాని లక్ష్మీ,గుండు తిరుపతమ్మ,బత్తిని ధనలక్ష్మీ పాల్గొన్నారు.

## పేట మున్సిపాలిటీని సందర్శించిన నల్లగొండ మున్సిపల్ అధికారులు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** సూర్యాపేట మున్సిపాలిటీలో గత కొన్ని సంవత్సరాలుగా అమలు అవుతున్న నూతన పారిశుధ్య అమలు తీరును అధ్యాయనం చేసేందుకు కమిషనర్ అండ్ డైరెక్టర్ పురపాలక పరిపాలన శాఖ హైద్రాబాద్ వారి ఆదేశాలతో నల్లగొండ జిల్లాలోని ఆయా మున్సిపాలిటిల కమిషనర్లు, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీర్లు గురువారం సూర్యాపేట మున్సిపాలిటీని సందర్శించారు. మున్సిపాటీలోని బాలెంల, జమున నగర్‌లోని వర్మికంపోస్టు యార్డు, ప్లాస్టిక్ రీసైక్లింగ్ యూనిట్, సీవరేజ్ ట్రిట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. ఎరువుల తయారీని వారు క్షుణ్ణంగా పరిశీలించారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారు చేస్తున్న ప్లాస్టిక్ టైల్స్, ఇటుకలు, అక్యూప్రషర్ మ్యాట్లు, పివిసి పైపుల తయారీకి ఉపయోగించే పదార్థాలు, తయారీ విధానాలను అక్కడ ఉన్న సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో తడి, పొడి చెత్తల సేకరణపై కమిషనర్ బి శ్రీనివాస్ వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా కమిషనర్లు యూసఫ్, దండు శ్రీనివాస్, రామదుర్గారెడ్డి, మున్వర్ అలీ, బాలయ్య, భాస్కర్ రెడ్డి, వీరేంద్ర, డిఇ సత్యారావు, శానిటరి ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

## కుమార్తెను అమ్మారనే మనస్తాపనతో వ్యక్తి ఆత్మహత్య

**ప్రజాపక్షం /నాంపల్లి :** మండలంలోని గట్ల మల్లేపల్లి గ్రామానికి చెందిన మలిగిరెడ్డి సైదిరెడ్డి(34) తన కుమార్తెను తనకు కనిపించకుండా దూరం చేశారనే మనస్థాపంతో తన సొంత వ్యవసాయ భూమిలో క్రిమిసంహారక మందు సేవించి మంగళవారం ఉదయం సుమారు పది గంటల సమయంలో బంధువులకు సమాచారం చరవని ద్వారా ఇచ్చి ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడికి ఏకైక కుమార్తె వర్షిక (3) మూడు సంవత్సరాల పాపను తనకు దూరంగా ఉంచడంతో సదరు వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని గ్రామస్తులు ఆందోళన చేసి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వర్షికను గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసుకొని బుధవారం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం పంపారు. గురువారం పోస్టుమార్టం అనంతరం గట్ల మల్లేపల్లిలో మృతునికి దహన సంస్కారాలను చేశారు.

## తప్పడు రాతలు సరికావు



**ప్రజాపక్షం/ రామన్నపేట:** రామన్నపేటలో ఏర్పాటు చేసే సిమెంట్ పరిశ్రమకు వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో పోరాడుతున్నది కమ్యూనిస్టులేనని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జల్లెల పెంటయ్య, సీపీఐ మండల కార్యదర్శి ఉట్కూరి నరసింహాలు అన్నారు. పొల్యుషన్ కంట్రోల్ బోర్డు నోటిఫికేషన్ వేసిన నాటి నుంచి కమ్యూనిస్టులు అగ్రభాగాన ఉండి పోరాటం చేస్తుంటే ఓ పత్రిక రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా లెఫ్ట్ పార్టీ పోరాటం చేయడం లేదని, ఊసే లేదని వార్త ప్రచురించడం పట్ల స్థానిక సుభాష్ సెంటర్‌లో అట్టి పత్రిక ప్రతులను దగ్ధం చేసి మాట్లాడారు. గత 40 రోజులుగా నిత్యం కమ్యూనిస్టు పార్టీ దశలవారీగా పోరాటాలు నిర్వహిస్తున్నామని, అన్నారు. ఫ్యాక్టరీ వద్ద నిరసన తెలిపామని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, సీపీఐ మండల నాయకులు ఉట్కూరి కృష్ణ, సీపీఎం నాయకులు కందుల హనుమంతు, కల్లూరి నగేష్, బావండ్లపల్లి బాలరాజు, ఉట్కూరి భగవంతం, నాగటి ఉపేందర్, గొరిగే సోములు, మునికుంట్ల లెనిన్ పాల్గొన్నారు.

## సాగర్‌కు మళ్ళీ పోటెత్తుతున్న వరద

### 20 గేట్ల ద్వారా నీటి విడుదల



**ప్రజాపక్షం/నందికొండ :** నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు శ్రీశైలం నుంచి గురువారం భారీగా వరద వచ్చి చేరుతుంది. రిజర్వాయర్ నీటిమట్టం 590 అడుగుల గరిష్ట సాయి వద్ద కొనసాగుతూ ఉండటంతో ప్రాజెక్ట్ అధికారులు వెంటనే 20 గేట్లను 5 అడుగులు మేర పైకి లేపి 162000 క్యూసెక్కుల నీటిని దిగివకు విడుదల చేస్తున్నారు. ఈ సీజన్లో డామ్ క్రస్ట్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయటం ఇది ఆరవ సారి కావటం గమనార్హం. అయితే గురువారం ఉదయం కేవలం 48284 క్యూసెక్కులుగా ఉన్న ఇన్ ఫ్లో మధ్యాహ్నం ఒకేసారి రెండు లక్షలకు పెరగడంతో 20 గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగిస్తున్నట్లు ఈ వరద ప్రవాహం ఇంకా పెరిగే అవకాశం ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

**రిజర్వాయర్ సమాచారం....** నాగార్జునసాగర్ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులకు 590 అడుగులు గా ఉండి, నీటి నిల్వ 312.0450 టీఎంసీలకు 312.0450 గా ఉన్నది. ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం నుండి 29273 క్యూసెక్కులు,కుడి కాలువ ద్వారా 10200 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6173 క్యూసెక్కులు ఎస్ఎల్ బి సి ఏఎమ్ఆర్పి 2400 ,క్యూసెక్కులు లోలెవెల్ కెనాల్ వరద కాలువ ద్వారా 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టుకు ఇన్ ఫ్లో గా 210446 క్యూసెక్కు ల నీరు వచ్చి చేరుతూండగా అంతే మొత్తాన్ని అవుట్ ఫ్లో గా దిగువకు విడుదల చేస్తున్నారు.

## విద్యార్థులకు కావాల్సింది శాస్త్రీయ విద్యా విధానం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండ:** విద్యను కాషాయికరణ చేయడం కోసం కేంద్ర ప్రభుత్వం చాపకింది నీరులా తీసుకొస్తున్న జాతీయ నూతన విద్యా విధానాన్ని రద్దుకై సమరశీల పోరాటాలు నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు నెల్లికంటి సత్యం విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. నల్లగొండ పట్టణంలోని మగ్దూమ్ భవన్‌లో ఏఐఎస్ఎఫ్ జిల్లా కౌన్సిల్ సమావేశం గురువారం నిర్వహించారు.సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ నూతన విద్యా విధానం వల్ల యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుందన్నారు. విద్యార్థులకు కావాల్సింది శాస్త్రీయ విద్యావిధానమని దీనిపై మోదీ ప్రభుత్వం పార్లమెంటులో నూతన విద్యా విధానంలో ప్రస్తావించకుండా బలవంతంగా హిందీలో పాఠాలు చెప్పించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం విద్యావిధానంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బరిగెల వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి,ఎస్‌టి, మైనార్టీల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియంబర్స్‌మెంట్‌లను తక్షణమే విడుదల చేయాలన్నారు. గత ప్రభుత్వం ముందు చూపు ఆలోచన లేకుండా ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలల్లో సొంత భవనాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని యుద్ధప్రాతిపదికన గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వలమల్ల ఆంజనేయులు, ముదిగొండ మురళీకృష్ణ,జిల్లా ఉపాధ్యక్షులు రమావత్ శోభన్ బాబు,జిల్లా కోశాధికారి గాదపాక సూర్య తేజ, జిల్లా కమిటీ సభ్యులు ఇస్కిల్లా మహేందర్, సురికి వినయ్,చాపల విప్లవ్, రూపావత్ విష్ణు,వినయ్,రమావత్ శ్రీకాంత్, నరేష్,మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## వేగవంతంగా వానాకాలం ధాన్యం సేకరణ

**ప్రజాపక్షం/నల్లగొండ :** వానాకాలం ధాన్యం సేకరణను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన తన చాంబర్లో జిల్లా పౌరసరఫరాల అధికారులు, మార్కెటింగ్ ,డిఆర్‌డిఏ, సహకార, వ్యవసాయ శాఖ అధికారులతో ధాన్యం సేకరణ సమస్యలపై సమీక్షించారు. అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గన్ని బ్యాగులను తగినంతగా ఉంచాలని, అలాగే ఇతర సౌకర్యాలలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు. అంతేకాక శుక్రవారం మధ్యాహ్నం లోగా అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల గ్రేడింగ్ పూర్తి చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి వెంకటేశ్వర్లు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డిఆర్‌డిఏ పిడి శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్, జిల్లా సహకార శాఖ అధికారి, తదితరులు పాల్గొన్నారు.

## సిసిరోడ్లు, అండర్ డ్రైనేజీ పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండలంలోని అరూర్ గ్రామంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ గ్రామ శాఖ సమావేశం కామ్రేడ్ పగిడి వెంకటేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బోడ సుదర్శన్ హాజరై మాట్లాడుతూ గ్రామంలో అసంపూర్తిగా ఉన్న సిసి రోడ్లను వెంటనే పూర్తిచేయాలని అండర్ డ్రైనేజీలు లేక మురుగు నీరు అంత రోడ్డు పయికి రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అకాల వర్షాల కారణంగా బజార్లు నీటి గుంతల మయమయి దోమలు ఈగలతో గ్రామాలలో ప్రజలకు వైరల్ విష జ్వరాలు వెదజల్లుతున్నాయని అన్నారు. వెంటనే బ్లీచింగ్ పౌడర్, దోమల మందు, గడ్డి మందులు పిచికారి చెయ్యాలి. వీధి దీపాలను ఎప్పటికప్పుడు వేయించాలని ఆయన అన్నారు. ప్రత్యేక అధికారులు వెంటనే గ్రామాలను సందర్శించాలి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలేపాక యాదయ్య, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి మేడి దేవేందర్, సిపిఐ మండల సమితి సభ్యులు సుద్దాల సాయికుమార్, బుర్ర మల్లేశం, సిపిఐ సీనియర్ నాయకులు జక్కుల లక్ష్మయ్య, చిలకమర్రి నారాయణ, గుడ్డేటి ఐలయ్య, గుడ్డటి యాదయ్య, గోగు రమేష్, సంఘీ కృష్ణ, నూకల ఉదేష్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో ఎలాంటి నిర్బంధాలు లేవు



డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్

**ప్రజాపక్షం /నల్లగొండ టౌన్ :** మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డిని వ్యక్తిగతంగా దూషించిన బిఆర్ఎస్ నాయకులు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని లేని పక్షంలో బిఆర్ఎస్ నాయకులను ఎక్కడ తిరగనివ్వమని డిసిసి అధ్యక్షులు కేతావత్ శంకర్ నాయక్ హెచ్చరించారు. గురువారం నల్లగొండలోని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో ఆ పార్టీ ఎంఎల్‌ఏలంతా దోచుకొని దాచుకున్నారని విమర్శించారు. అధికారం కోల్పోయిన తర్వాత కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల పేరుతో కోట్లు దండుకున్నారని ఆరోపించారు. తుంగతుర్తి మాజీ ఎంఎల్ఏ గాదరి కిషోర్ మంత్రి కోమటిరెడ్డిపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. గాదరి కిషోర్ బతుకేంటో అందరికి తెలుసని అన్నారు. గత ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తన్ని తరిమికొట్టిన కెటిఆర్, కెసిఆర్ మెప్పుకోసం మంత్రులపై స్థాయి మరిచి దిగజారుడు వ్యాఖ్యలు చేస్తున్నాడని మండిపడ్డారు. ఇకనైనా సంస్కారహీనంగా మాట్లాడడం మానుకోవాలని,లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. రామన్నపేట నియోజకవర్గంలో సిమెంట్ ఫ్యాక్టరీకి సంబంధించి జరుగుతున్న సంఘటనలు వేరు ప్రెస్ మీట్‌లో బిఆర్ఎస్ పార్టీ మాజీ ఎంఎల్‌ఏలు మాట్లాడిన విషయాలు వేరని అన్నారు. ఎప్పుడో జరిగిన సంఘటనలతో పాటు వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్, నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పిటిసి వంగూరి లక్ష్మయ్య, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు గుమ్ముల మోహన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు కత్తుల కోటి, కౌన్సిలర్లు బొజ్జ శంకర్, జూలకంటి శ్రీనివాస్,కేసాని వేణుగోపాల్ రెడ్డి, బుర్రి యాదయ్య, ఏర్పుల రవి పాల్గొన్నారు.

## సిపిఐ పోరాటాలతోనే మార్కెట్ కమిటీ ఏర్పాటు




**ప్రజాపక్షం/మోటకొండూర్ :** సిపిఐ నాయకుల పోరాటాల ఫలితంగానే మోటకొండూర్‌లో మార్కెట్ కమిటీ ఏర్పాటు అయిందని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ అన్నారు. ఆయన గురువారం మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ కార్యాలయం రెడ్డి గట్టు శేషయ్య భవనంలో సిపిఐ ముఖ్యల సమావేశంలో మాట్లాడుతూ మోటకొండూరు మండల ఏర్పాటు, మోటకొండూర్ మార్కెట్ యార్డును ఏర్పాటు కావడానికి సిపిఐ పార్టీ నాయకత్వంలో మండల ప్రజలను, రైతులను చైతన్య పరుస్తూ అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించామని, మా పోరాటాల ఫలితంగానే గత ప్రభుత్వం మోటకొండూర్ మార్కెట్ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రిలిమినరీ జీవో 43ను విడుదల చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యం, సహాయ కార్యదర్శి ఆలేటి బాలరాజు, గ్రామ శాఖ కార్యదర్శిలు బొలగాని అశోకు, బీరకాయల మధు, జివిలికపల్లి గణేష్, రైతు సంఘం నాయకులు రేగు యాదయ్య, నల్ల యుద్ధావరెడ్డి, భాస్కర్ రెడ్డి, సీనియర్ నాయకులు బీరకాయల ఈశ్వరయ్య, ఎఐటియుసి నాయకులు బీరకాయల మల్లేశ్, చీరాల సత్యనారాయణ, అజీమ్, మస్తాన్, గీత సంఘం నాయకులు పల్లె వెంకన్న, పల్లె శ్రీనివాస్, వికలాంగుల సంఘం నాయకులు గట్టి కొప్పుల శ్రీధర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బీరకాయల పోశయ్య పాల్గొన్నారు.

## పాఠశాల స్థలం కబ్జా



**ప్రజాపక్షం/వేములపల్లి:** మండలంలోని రావువారిగూడెం ప్రభుత్వ పాఠశాల స్థలం కబ్జాకు గురైందని స్థానికులు వాపోయారు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎంతో కాలం క్రితం వేములపల్లి మండలంలోని రావువారి గూడెంలో అమృతా రెడ్డి కుటుంబ సభ్యులు ప్రజల సౌకర్యార్థం కోసం కొంత భూమిని దానం చేశారని ఆ స్థలంలో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేసి మిగతా భూమిని గ్రామస్తులు పండగలు పబ్బాలు జరుపుకుంటూ ఉండేవారని వారన్నారు.ఈ మధ్య కాలంలో మాలికాంతారెడ్డి అనే వ్యక్తి పాఠశాల ఉన్న స్థలాన్ని నేను కొన్నానని అమ్మిన వ్యక్తులు దస్తావేదులతో నాకు విక్రయించారని చెబుతూ పాఠశాల స్థలాన్ని ఆక్రమించుకున్నట్లు వారు తెలిపారు. ఇప్పటికే ఈ స్థలంలో నిర్మించిన పాఠశాల పూర్తిగా పాడైపోయిందని దాని వెనకాల చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన అంగన్వాడి కేంద్రం ఇప్పటికీ కొనసాగుతుందని అన్నారు. కానీ మాలికాంతారెడ్డి అనే వ్యక్తి పాఠశాల చుట్టూ ఉన్న భూమిని ఆక్రమించుకొని ప్రహరీ గోడ నిర్మించడంతో ఆయా పాఠశాలకు వెళ్లడానికి దారి కూడా లేదని ఇది ఇలాగే వదిలేస్తే పాఠశాలను నేలమట్టం చేసి ఆ స్థలాన్ని కూడా ఆయనే ఆక్రమించుకునేలా ఉన్నాడని వారు అన్నారు. ఈ స్థలం గురించి నారాయణ రవీందర్ రెడ్డి, చల్లబట్ల అంశమ్మ, కవితలు మాట్లాడుతూ ఎంతోమందికి విద్యాబుద్ధులు నేర్పించే పాఠశాలను ఆక్రమించుకోన్న వ్యక్తి పట్ల ప్రభుత్వ అధికారులు ఎందుకు అలసత్వం చూపుతున్నారో అర్థం కావట్లేదని అన్నారు. రాజకీయ నాయకులే కాదు అధికారులు కూడా మాలికాంతారెడ్డికి అమ్ముడుపోయారా అని ప్రశ్నించారు. ఏదేమైనా ఈ స్థలాన్ని కబ్జా కోరల్లో నుంచి కాపాడుకుంటామని అన్నారు.

## నల్లబెల్లం పట్టివేత..

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్ :** నల్లగొండ జిల్లా తిరుమలగిరి సాగర్ మండలంలోని జమ్మనకొండ తండాలో అక్రమంగా ఒకచోట నల్ల బెల్లం దాచి ఉంచారనే సమాచారం మేరకు గురువారం హైదరాబాద్‌కు చెందినఎస్టిఎఫ్ టీం లీడర్ ఎస్ఐ బాలరాజు సిబ్బందితో కలిసి బెల్లం దాచి ఉంచినటువంటి గోదాముపై దాడులు నిర్వహించి తనిఖీలు చేపట్టారు.ఈ తనిఖీల్లో 300 కేజీల బెల్లం 50 కేజీల ఆలం,10 లీటర్ల నాటు సారా పట్టుబడింది. ఆంధ్రాకు చెందిన గుంటూరు మాచర్లకు చెందినటువంటి కృష్ణా నాయక్ అనే ఒక వ్యక్తి నాటు సారా తయారీ కోసం వినియోగించే నల్ల బెల్లాన్ని అమ్మకాల కోసం ఈ గోదాంలో దాచిపెట్టి ఉంచాడు. పట్టుబడినటువంటి నల్ల బెల్లం ఆలం విలువ రూ.మూడు లక్షలు ఉంటుందని అంచనా వేశారు. హైదరాబాద్ ఎస్టిఎఫ్ బాలరాజు సిబ్బంది, అలియా ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సిఐ కల్పన ఎస్ఐ సంపత్ పాల్గొన్నారు. బెల్లం పట్టుకున్నటువంటి సిబ్బందిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ డైరెక్టర్ వివి కమలాసన్ రెడ్డి, ఎక్సైజ్ సూపరింటెంట్ ఎస్టిఎఫ్ టీం లీడర్ ప్రదీప్ రావులు అభినందించారు.



## సిఎం వర్గీకరణ చేయడం మందకృష్ణకు ఇష్టం లేదు



**ప్రజాపక్షం/దేవరకొండ:** తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్ ఇవ్వాలని జిల్లాల వారిగా ఎస్సి వర్గీకరణ చేయాలని గురువారం దేవరకొండ నియోజకవర్గంలో మాదిగల అసెంబ్లీ నియోజకవర్గాల సమ్మేళనం దేవరకొండ ఐబిలో జరిగింది. మాదిగ జేఏసి నియోజకవర్గ ఇంచార్జీ శెట్టిపల్లి చిరంజీవి, యూత్ అధ్యక్షులు నాగిళ్ల రవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మాదిగ జేఏసి వ్యవస్థాపకులు డా. పిడమర్తి రవి హాజరై మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి వర్గీకరణ చేయడం మంద కృష్ణకు ఇష్టంలేదని ఎందుకంటే మంద కృష్ణ మాదిగ వర్గీకరణ బిజెపి తో సాధించుకొని రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నట్లుగా ఉందని 1994లో ప్రారంభమైనటువంటి ఏబిసిడి ఉద్యమం ఇప్పటికి ఇప్పుడు ఉన్నటువంటి మాదిగ జనాభాకు చాలా తేడా ఉందని అందుకే మాదిగ చేసి తెలంగాణ రాష్ట్రంలో 12 శాతం రిజర్వేషన్ డిమాండ్ చేస్తుందని పిడమర్తి రవి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిగలకు 12శాతం రిజర్వేషన్లు జిల్లాల వర్గీకరణ చేయడం కోసం మాదిగ జేఏసి విస్తృతంగా కార్యక్రమాలు నిర్వహిస్తుందని కచ్చితంగా వర్గీకరణ సాధిస్తుందని సందర్భంగా తెలిపారు. ఈకార్యక్రమంలో మాదిగ జేఏసి జిల్లా అధ్యక్షులు కూరపాటి సుదర్శన్, జేఏసి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇరిగి గురునాథం, దేవరకొండ యూత్ అధ్యక్షులు నాగిళ్ల రవి, దేవరకొండ మాదిగ జేఏసి అధ్యక్షులు చిరంజీవి, విజయ్, అనిల్, శివ, జగదీష్, శ్రీకాంత్, శ్రీను, నరేష్, ప్రభాస్, శేఖర్, శ్రీకాంత్, వెంకటరత్నం పాల్గొన్నారు.

## సత్తయ్య మృతి సిపిఐకి తీరని లోటు

**ప్రజాపక్షం/మోత్కూర్ :** మండలంలోని ముశిపట్ల గ్రామానికి చెందిన సిపిఐ పార్టీ సీనియర్ కార్యకర్త నేర్లకంటి సత్తయ్య అకాల మృతి సిపిఐ పార్టీకి తీరని లోటు అని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, మోత్కూరు మండల కార్యదర్శి అన్నపు వెంకట్ అన్నారు. గురువారం ముశిపట్ల గ్రామంలో సత్తయ్య కుటుంబం పరామర్శించి సత్తయ్య పార్థివ దేహానికి ఎర్ర జెండా కప్పి కామ్రేడ్ సత్తయ్య అమర్హై సత్తయ్యకు జోహార్లు అంటూ నినాదాలు చేస్తూ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమ్యూనిస్టు పార్టీలో కీలకంగా పనిచేసి అనేక బుర్రకథ కళాకారులుగా పేరుపొందారని సిపిఐ పార్టీకి తీరని లోటని అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా గీత పని వారల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, నరసింహా, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## వికలాంగులకు వెంటనే రూ. 6 వేలు పింఛన్ పెంచాలి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వికలాంగులకు వెంటనే ఆరు వేల ఫించన్ పెంచాలని జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందె రాంబాబు, జాతీయ సీనియర్ నాయకులు షణ్ముఖ రావు, రాష్ట్ర అధ్యక్షులు కాల జంగయ్య, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంగమ్మలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విహెచ్‌పిఎస్ నల్లగొండ జిల్లా ముఖ్య కార్యవర్గ సమావేశం నల్లగొండ జిల్లా అధ్యక్షులు కోమ్ము హరికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడుతూ వికలాంగుల హక్కుల పోరాట సమితి పైన ఈ రాష్ట్రంలో వికలాంగులను పట్టించుకోని ప్రభుత్వం అంటే అది కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి సర్కారు గెలిచాక వికలాంగులకు మాట ఇచ్చి 6000 పింఛను పెంచుతానని మాయ మాటలు చెప్పి అధికారం చేపట్టి వికలాంగులు పె కపట ప్రేమ చూపించిన వ్యక్తి రేవంత్ రెడ్డి రానున్న రోజులలో గ్రామపంచాయతీ ఎలక్షన్ లో వికలాంగుల బలమేంటో ఈ రాష్ట్ర ప్రభుత్వానికి చూపించడం జరిగిందన్నారు. రేపు జరగబోయే నవంబర్ 26న ఛలో వికలాంగుల మహా గర్జనతో మా బలం ఏంటో నేర్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సీనియర్ నాయకులు వడ్డేది సైదులు , రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెరికే శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు కొత్త వెంకన్న, ఎస్‌కె ఖాన్, వీరబోయిన సైదులు తవుళ్ళ వెంకన్న, చైతన్య రెడ్డి, జలంధర్, మాధవరెడ్డి, రామేశ్వరి, కాశీం తదితరులు పాల్గొన్నారు.



## రైతులు ఆయిల్ పామ్ వేయాలి



**ప్రజాపక్షం/చిగురుమామిడి:** చిగురుమామిడి మండల పరిధిలోని రేకొండ గ్రామ పంచాయతీ ఆవరణలో ఉపాధి హామీ పనులపై అవగాహన సదస్సు గురువారం అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయిల్‌ఫామ్ పంటలకు రసాయనిక మందులు తక్కువ వాడొచ్చని చెప్పారు. క్రిమిసంహార మందులు తక్కువ కాలంలో పిచికారీ చేసుకోవచ్చని, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు ఆయిల్‌ఫామ్ పంటతో రైతులు పొందవచ్చని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట దిగుబడి వచ్చే వరకు అదే భూమిలో పెసర, వేరుశనగ, బబ్బెర్లు, ఇతర పంటలు వేసుకోవచ్చని వారు తెలిపారు. అలాగే నాటు కోళ్లను రైతులు వారి వ్యవసాయ భూమి వద్ద పెంచుకుంటే నాటు కోళ్ల ఫామ్‌కు షెడ్డు నిర్మాణం కోసం పూర్తి సబ్సిడీతో రుణాలు ఇస్తామని వారు తెలిపారు. బ్రాయిలర్ కోడి గుడ్డు కంటే నాటు కోడి గుడ్లు తింటే ఎక్కువ బలంతో పాటు ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తే ఒక్క గుడ్డుకు రూ.8 నుంచి 10 రూపాయల చొప్పున లాభం వస్తుందని చెప్పారు. నాటు కోళ్ల ఫామ్‌ను పెంచాలని వారు సూచించారు. కోరండ్ల సంపత్‌రెడ్డి భూమి వరకు రోడ్డు నిర్మాణ పనుల కోసం తీర్మానించారు. అరిగెల ప్రభాకర్ వ్యవసాయ భూమి వద్ద నుంచి పాండవుల రవీందర్ భూమి వరకు రోడ్డు నిర్మాణం కోసం పనిని గుర్తించడంతో పలు పనుల తీర్మానాలు చేశారు. రేకొండ ప్రత్యేక అధికారి నవ్యశ్రీ, సెక్రటరీ గోదారి అజయ్, ఏపివో రాజయ్య, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్, ఫీల్డ్ అసిస్టెంట్ గోపగోని తిరుపతి, కారోబారి రాజు, రైతులు, కలవల మొగిలి, గంద్రత్ రామయ్య, కోరండ్ల సంపత్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఉపాధి హామీ కూలీలు, రైతులు, మహిళలు, తదితరులున్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం



**ప్రజాపక్షం/చొప్పదండి:** మార్చి నెలలో జరగబోవు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు పట్టభద్రులను స్వయంగా కలిసి ప్రజా ప్రభుత్వ పథకాలను, సిద్ధాంతాలను వివరించడంతో పాటు వారిని ఓటరుగా నమోదు చేయుట ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. ఓటరు నమోదుకు నవంబర్ 6 తేదీ వరకు గడువు ఉన్నందున అందరినీ సమన్వయం చేసుకుంటూ మండలంలో అత్యధికంగా ఓటర్లను నమోదు చేయడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థికి మద్దతు తెలపడంతో పాటు గెలుపు కోసం పాటు పడాలని పిలుపునిచ్చారు. మార్కెట్ కమిటీ చైర్మన్ కొత్తూరి మహేష్, కౌన్సిలర్లు పెరమాండ్ల మానస గంగయ్య గౌడ్, కొట్టె అశోక్, పార్టీ పట్టణ అధ్యక్షుడు నిజానపురం చందు, ప ట్టణ, మండల కాంగ్రెస్ నేతలు పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిఒ 317తో ఉద్యోగులకు అన్యాయం

ఎంఎల్‌ఎ సంజయ్‌కు నర్సింగ్ సిబ్బంది వినతి



**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** జీవో 317 ద్వారా ప్రభుత్వ ఉద్యోగులకు ముఖ్యంగా తమకు అన్యాయం జరిగిందని దీన్ని పరిష్కరించాలని జగిత్యాల ఎంఎల్‌ఎ సంజయ్‌కుమార్‌ను నర్సింగ్ సిబ్బంది కోరారు. జగిత్యాల రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి సొసైటీ కమిటీ సమావేశంలో పాల్గొనడానికి వచ్చిన ఎంఎల్‌ఎ సంజయ్‌కుమార్‌కు వైద్య సిబ్బంది వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎంఎల్‌ఎ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు

## నవంబర్ 1న కరీంనగర్‌కు బిసి కమిషన్ బృందం

జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడి

**ప్రజాపక్షం / సిరిసిల్ల :** తెలంగాణ రాష్ట్రంలో స్థానిక సం స్థల వారీగా కల్పించాల్సిన అవసరమైన రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంలో ఆసక్తి కలిగిన ఆయా రాజకీయ పార్టీలు, సంఘాలు ప్రజల అభిప్రాయాలను తెలుసుకునేందుకు వీలుగా తెలంగాణ బిసి కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 1న కరీంనగర్‌కు విచ్చేస్తున్నట్లు జిల్ల క లెక్టర్ సందీప్ కుమార్ ఝా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్న సిరిసిల్ల, కరీంనగర్ ఉమ్మడి జిల్లాకు సంబంధించి నవంబర్ 1న కరీంనగర్ కలెక్టరేట్‌లో ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4గంటల వరకు కమిషనర్ చైర్మన్ నిరంజన్ నేతృత్వంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమల గిరి సురేందర్, బాల లక్ష్మి, బిసి వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ జరపనుందని వెల్లడించారు. అభిప్రాయాలు, సలహాలు, సూచనలు తెలియజేయాలనుకునే వారు రాతపూర్వక సమర్పణలు, అభ్యర్థలను నేరుగా ఎవరైనను సమర్పించవచ్చని అన్నారు.

## పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు



**ప్రజాపక్షం/పెద్దపల్లి టౌన్ :** కాంగ్రెస్ పార్టీ కోసం అంకిత భావంతో పని చేసే వారికి ఎప్పటికైనా తగిన గుర్తింపు లభిస్తుందని జిల్లా గ్రంథాలయ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ అన్నారు. పెద్దపెల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా నియమించబడ్డ అన్నయ్యగౌడ్ పెద్దపల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అన్నయ్య నియమాకానికి సహకరించిన రాష్ట్ర మంత్రి దుద్దిల్ల శ్రీధర్, ఎమ్మెల్యేలు చింతకుంట విజయ రమణారావు, ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాబోవు రోజుల్లో కూడా ఇలా కష్టపడ్డ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు సముచిత న్యాయం చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలోపెద్దపల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు భూషణవేణి సురేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి దొడ్డుపల్లి జగదీష్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు బండారి సునీల్ గౌడ్, యువజన కాంగ్రెస్ నాయకులు గంగుల సంతోష్, గౌడ సంఘం నాయకులు పడాల సతీష్ గౌడ్ పాల్గొన్నారు.

## డిఎస్‌సి 2024 ఉపాధ్యాయులకు 'ఎంప్లాయ్ ఐడి' కేటాయించండి

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి:** పిఆర్‌టియు ఎస్ జగిత్యాల జిల్లా శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బోయినపల్లి ఆనందరావు, యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లా ట్రెజరీ అధికారి సోఫియాని కలిసి 2024 డిఎస్‌సి ద్వారా నూతనంగా నియమాకమైన ఉపాధ్యాయులకు అందరికి జిల్లా విద్యాధికారి ఉత్తర్వుల మేరకు నెల 10 వతేదిని మొదటి నియమాకపు తేదిగా పరిగణిస్తు ఎంప్లాయ్ ఐడిలను కేటాయించాలని ప్రాతినిథ్యం చేయడం జరిగింది.

హాస్టళ్ల నిర్వహణలో నిర్లక్ష్యంవహిస్తే..

# కఠిన చర్యలు తప్పవు

కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతి



**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** హాస్టళ్ల నిర్వహణలో అధికారులు, సూపరిండెంట్లు, వార్డెన్లు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హెచ్చరించారు. గురువారం కరీంనగర్‌లోని బాలసదనం, సఖిసదన్, శిశుగృహ కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ వసతి గృహాల్లోని పలు రికార్డులను పరిశీలించారు. పిల్లలు, శిశువులు, వర్కింగ్ ఉమెన్స్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ హాస్టల్స్‌లో పిల్లల కోసం ఏర్పాటు చేసిన సౌకర్యాలను, వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహంలో ఉండేవారి అన్ని వివరాలను రికార్డు చేయాలన్నారు. ప్రతి రికార్డును పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వసతిగృహాల సూపరిండెంట్లు, వార్డెన్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శిశుగృహాలోని శిశువుల కోసం అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. బాలసదనం పాతభవనం స్థానంలో నూతన భవన నిర్మాణానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. హాస్టళ్లలో విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బయట ఆహారం హాస్టల్‌లోకి రానివ్వొద్దన్నారు. విద్యార్థులను బయటకు వెళ్లకుండా చూడాలన్నారు. హాస్టళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. సురక్షితమైన నీటినే తాగునీటిగా అందించాలన్నారు. జిల్లా సంక్షేమ అధికారి ఎం.సరస్వతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఐకెపి కేంద్రాలలో వివరాలు పక్కాగా నమోదు చేయాలి

జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్



**ప్రజాపక్షం /జగిత్యాలరూరల్ :** జగిత్యాల రూరల్ మండలంలోని పో రండ్ల, గుళ్లపేట గ్రామంలో ఐకెపి ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం రోజున జగిత్యాల జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ పరిశీలించారు. ప్యాడి క్లినర్ మిషన్ పని తీరును కలెక్టర్ పరిశీలించి పని చేసే విధానం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐకెపి కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్రాగునీటి వసతి, ఎండ నుంచి రైతులు సేదతీరాడానికి తగిన వసతులు కల్పించాలని సూచించారు. ఆధార్ పట్టా పాస్ బుక్ వంటి వివరాలను కేంద్రంలో పెట్టాలని, వివరాలు పక్కాగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో సరిపడా ప్యాడి క్లీనింగ్ మెషిన్స్ అందుబాటులో ఉంచాలని, గన్ని బ్యాగులు, టార్పలిన్లను అందుబాటులో ఉంచుకోవాలని, వర్షాకాలం అయినందున వర్షం పడే అవకాశం ఉన్నందున ఐకెపి సెంటర్లలో ధాన్యం తడవకుండా ముందస్తుగా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఆర్‌డిఒ శ్రీనివాస్, అడిషనల్ డిఆర్‌డిఎ మధన్ మోహన్, డిఎస్‌ఒ డిఎం, జగిత్యాల రూరల్ ఎంఆర్‌ఒ శ్రీనివాస్, రూరల్ ఎంపిడిఒ రమాదేవి, సంబంధిత అధికారులు, పాల్గొన్నారు.

## శిక్షణను సద్వినియోగం చేసుకోండి

**ప్రజాపక్షం /రామగిరి :** చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు అన్నారు. సింగరేణిలో విధులు నిర్వహిస్తూ వివిధ అనారోగ్య కారణాల వల్ల మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన, మృతి చెందిన ఉద్యోగుల డిపెండెంట్ లకు కారుణ్య నియామక ఉద్యోగ ఉత్తర్వులను ఇటీవల జారీ చేయడం జరిగినది. అందులో 31 మంది అభ్యర్థులకు, సింగరేణి సంస్థలో విధులు నిర్వహిస్తూ వివిధ కారణాలతో డిస్మిస్ అయి, తిరిగి బదిలీ వర్కర్లుగా నియమితులైన11మందికి స్థానిక ఎంవిటిసిలో శిక్షణ ఇవ్వడం జరుగుతుంది, అట్టి అభ్యర్థులతో అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొప్పుల వెంకటేశ్వర్లు గురువారం సమీక్ష నిర్వహించడం జరిగింది. వారిని ఉద్దేశించి మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం రావడం అదృష్టమని, సంస్థ ఇచ్చేటటువంటి శిక్షణ ను సద్వినియోగం చేసుకొని, ఉద్యోగంలో చేరిన తరువాత క్రమం తప్పకుం డా విధులకు హాజరు కావాలని అన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి ప్రమాదాలకు తావివ్వకుండా అనుక్షణం అప్రమత్తంగా ఉంటూ భద్రతతో విధు లు నిర్వహించాలని, ఎంవిటిసి శిక్షణ పూర్తయిన వెంటనే ఇచ్చిన గడువులోపు విధులలో చేరాలని అన్నారు. ఎస్వోటు జిఎం బి.సత్యనారాయణ, ఎంవిటిసి మేనేజర్ మల్లన్న, డి.ఎస్.ఇ. శ్రీనివాస్, బోధకుడు వీరన్న పాల్గొన్నారు.

## కబ్జాదారులు ఎంతటి వారైనా శిక్షించాల్సిందే

సిపిఐ కరీంనగర్ నగర సమితి డిమాండ్




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని రేకుర్తి శివారులో గల 55 సర్వే నెంబర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు గురైందని, దీనిపై వెంటనే కలెక్టర్ చొరవ తీసుకుని ప్రభుత్వ భూమిని కాపాడాలని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, సహాయ కార్యదర్శి పైడిపల్లి రాజులు ఒక సంయుక్త ప్రకటనలో డిమాండ్ చేశారు. కరీంనగర్ మేయర్ సునీల్‌రావు తన అధికారాన్ని అడ్డుపెట్టుకుని 55వ సర్వే నెంబర్‌లోని ప్రభుత్వ భూమిని, అదే విధంగా శ్మశాన వాటికకు సంబంధించిన భూమిని కబ్జా చేశాడని ఆరోపణలు వస్తున్నాయని, ఇది దుర్మార్గమన్నారు. కబ్జాదారులు ఎంతటి వారైనా శిక్షించాలని వారు కోరారు. మేయర్ ఈ సర్వే నెంబర్‌లోని భూమిని కబ్జాకు పాల్పడినట్లయితే పత్రికాముఖంగా వచ్చి ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. ఈ సర్వే నెంబర్లు శ్మశాన వాటిక స్నానపు గదులు, బోరు ఇతర పనుల కోసం గత గ్రామపంచాయతీ రూ.15 లక్షలు మంజూరు చేసిందన్నారు. దీనిని లెక్క చేయకుండా కబ్జాలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ప్రభుత్వ భూములను ప్రజాప్రతినిధులు రియల్ ఎస్టేట్ వ్యాపారులు గత ప్రభుత్వ హయాంలో దిగమింగారని, చెరువులను, కుంటలను, పరంపోగు, ఎస్సారెస్పీ భూములను సైతం వదలకుండా ఆక్రమణలకు గురిచేశారని, కరీంనగర్ ఆనుకుని ఉన్న బొమ్మకల్, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, నగునూరు, చింతకుంట, కమాన్‌పూర్, కొత్తపెల్లి, పద్మనగర్ గ్రామాలను పూర్తిగా కబ్జాలమయం చేసి దిగమించారని ఆరోపించారు. కరీంనగర్ నియోజకవర్గవ్యాప్తంగా ఆక్రమణకు గురైన భూములను వెంటనే రెవెన్యూ అధికారులు పర్యవేక్షించి ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి లాక్కొని పేద ప్రజలకు పంచాలని, కబ్జాదారులు ఎంతటివారైనా వదిలిపెట్టకుండా ప్రభుత్వపరంగా చర్యలుతీసుకోవాలనివారుపేర్కొన్నారు. లేని పక్షంలో ప్రజలను ఐక్యం చేసి ప్రభుత్వ భూములను సిపిఐ ఆధ్వర్యంలో ఆక్రమించి ఇండ్లు లేని పేద ప్రజలకు పంచుతామని కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, పైడిపల్లి రాజులు హెచ్చరించారు.

## ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందేలా కృషి

పెద్దపల్లి కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ :** ప్రభుత్వ పాఠశాలలో చదివే ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పాలకుర్తి మండలంలోని పలు గ్రామాలలో ప్రభుత్వ పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాలకుర్తి మండలం పుట్నూర్ గ్రామంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కుక్కల గూడూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ సెంటర్, జయ్యారం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పాఠశాలల పారిశుద్ధ్య నిర్వహణ పట్ల అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను శుభ్రం చేయాలని, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాఠశాలల పారిశుద్ధ్యంపై పటిష్ట చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలల్లో పిల్లలకు అందించే మధ్యాహ్నం భోజనం, అంగన్‌వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారం నాణ్యత అంశంలో అప్రమత్తంగా ఉండాలని, అంగన్‌వాడీ కేంద్రాలలో గుడ్లు, తదితర వాటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రతీ విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని, బేస్ లైన్ టెస్ట్ సమర్థవంతంగా నిర్వహిస్తూ క్రమ పద్ధతిన విద్యార్థుల ప్రమాణాలు పెరిగేలా చూడాలని అన్నారు. పాఠ్యాంశాల బోధనకు ఉపాధ్యాయులు సమర్థవంతమైన టిఎల్‌ఎంలను వినియోగించాలని కలెక్టర్ తెలిపారు.పుట్నూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు అందుతున్న సేవలు వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలులో కోతలు విధిస్తే సహించేది లేదు

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణా రావు




**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** ధాన్యం కొనుగోలులో కోతలు విధించి రెతులను మోసం చేస్తే సహించేది లేదని పెద్దపెల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు అన్నారు. గురువారం రోజు నపెద్దపల్లి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని స్థానిక మార్కెట్ చైర్మన్ ఈర్ల స్వరూప, మార్కెట్ అధికారులు ప్రవీణ్ రెడ్డి, పృధ్వీరాజ్ మరియు స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత సీజన్ వడ్లను కొనుగోలు సందర్భంగా ఎక్కడైనా కటింగ్ చేస్తే తాను అక్కడికి వచ్చి వాలతానని, సన్న రకాల ధాన్యానికి క్వింటాలకు రూ.500 బోనస్ చెల్లించడం జరుగుతుందన్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వడ్ల కటింగ్ పేరున కట్ చేస్తే ఎంతటివారినైనా ఉపేక్షించేది లేదని గౌరవ ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సన్న రకం వడ్ల విషయంలో ఎలాంటి సందేహాలకు తావివ్వకూడదని, పరిమితం లేకుండా ఎన్ని క్వింటాళ్ల సన్న వడ్లు అమ్మినప్పటికీ అమ్మిన మొత్తానికి వారికి బోనస్ చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో రుణమాఫీ చేయని బీఆర్ఎస్ పార్టీ నేతలు రైతుల్లో కావాలని అపోహలు సృష్టిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, అధికారులు మరియు పట్టణ కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలు, రైతులు, హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడితేనే కలలు సాకారం

సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట జిల్లా మిట్టపల్లి గురుకుల తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ మనుచౌదరి క్షేత్ర స్థాయిలో సందర్శించారు. ఈ పాఠశాలలోని ఇన్ఫ్రస్ట్రక్చర్‌లోని కొన్ని రిపేర్లు, వాష్‌రూం డామెజ్, నీటి కొరత పైపులైన్ లీకేజీ వల్ల దుర్వాసన వెదజల్లటం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి అంజలి కలెక్టర్‌కు వివరించారు. దీనికి కావాల్సిన ఫైలు అప్రువల్ అంద చేస్తామని ఈడబ్లుడిసి ఇంజనీరింగ్ ఏజెన్సికి పనులు మొదలుపెట్టేందుకు ఏర్పాటు చేసుకోవాలని ఫోన్‌లో ఆదేశించారు. అనంతరం జూనియర్ కళాశాలలోని బైపిసి సెకండీయర్ తరగతి గదిలో బాలికలతో ముచ్చటించా రు. పాఠశాలల్లో సౌకర్యాలపై ఆరా తీశారు. భోజనంలోనాణ్యత , మెనుప్రకారం పెడుతున్న విషయాలను బాలికలను అడిగారు.

**షెడ్యూల్ కులాల బాలుర వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్:** జిల్లా కేంద్రంలోని షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కళాశాల బాలుర వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో సందర్శించారు. ఈ వసతి గృహంలో డ్రింకింగ్ వాటర్ మిషన్ పాడైందని అలాగే డార్మిటరీ గదుల్లో ఫ్యాన్లు లైట్లు సరిపడు లేవన్నారు. అదనపు గదులతో పాటు వాష్ రూంలు సైతం కావాల ని డిఒ కవిత కలెక్టర్‌కు తెలిపారు. అన్నిటిపై సానుకూలంగా స్పందించిన వాటికి సంబంధించిన ఫైల్ తయారు చేయాలని సూచించారు.తప్పనిసరిగా కావాల్సిన వాటిని ముందు చేయించుకోవాలన్నారు. వంట గదిలోవంట సిబ్బందితో కలెక్టర్‌మాట్లాడారు.పిల్లలకురుచికరమైనభోజనంఅందించాలనిసూచించారు.

**గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

శిక్షణ అనేది ప్రతి ఒక్కరికి అవసరమని ..నిబద్ధతో శ్రద్ధతో నేర్చుకుంటే ఆయా రంగాల్లో ఉపాధి పొందవచ్చునని జిల్లా కలెక్టర్ మనుచౌదరి చెప్పారు. ప్రతి కోర్సును చాలమంది నేర్చుకుంటారని, కాని నైపుణ్యం లేని వాళ్లకు ఈ కోర్సు ప్రత్యేకత తెలిపి వారికి ఉపాది కల్పించేలా ట్రైనర్లు చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఉదయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## కన్న కూతురిని అమ్మిన కసాయి తల్లిదండ్రులు



**ప్రజాపక్షం /వేములవాడ టౌన్:** వేములవాడ పట్టణంలో ఓ చిన్నా రి విక్రయం కలకలం సృష్టించిం ది. భిక్షాటన చేసే ఓ మహిళ తాగి న మైకంలో పది నెలల పాప మేఘనను మరో మహిళకు విక్రయించి, తిరిగి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసిన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎల్లారెడ్డిపేటకు చెందిన శ్యామల, రవీందర్ దంపతులు గత కొంత కాలంగా వేములవాడలో నివాసం ఉంటున్నారు. రాజన్న ఆలయ పరిసరాల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఐదుగురు సంతానం కావడంతో చిన్నపాపను విక్రయించాలని భార్యాభర్తలు నిర్ణయించుకున్నారు. ఈ విషయాన్ని గతంలో తమకు పరిచయం ఉన్న జగిత్యాల జిల్లా గోవింద్ పల్లెకు చెందిన లక్ష్మి కి ఫోన్ చేసి చెప్పారు. వేములవాడ వచ్చిన లక్ష్మి తో పాటు శ్యామల కుటుంబ సభ్యులు మంగళవారం తిప్పాపూర్లో మద్యం తాగారు. తాగిన మైకంలో రూ.90వేలకు లక్ష్మి కి చిన్నారిని విక్రయించారు. స్టాంప్ పేపరుపై రాయించి ఇచ్చారు. బుధవారం తన పాపను లక్ష్మి అపహరించిందని శ్యామల పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు విచారణ చేపట్టారు. రూ.90 వేలకు విక్రయించారని లక్ష్మి తెలిపింది. ఆమె వద్ద ఉన్న బాలికను తిరిగి శ్యామలకు అప్పగించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సిఐ వీర ప్రసాద్ తెలిపారు.

## ర్యాగింగ్ చేస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు

సిద్దిపేట ఎసిపి మధు



**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** తోటి విద్యార్థినీ, విద్యార్థులను, జూనియర్లను ర్యాగింగ్ చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని సిద్దిపేట ఎసిపి మధు హెచ్చరించారు. ర్యాగింగ్ అనేవి విషసంస్కృతి దాని జోలికి ఎవ్వరు వెళ్లవద్దని అది అత్యంత అమనుష చర్య అన్నారు. తోటి విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తించటం వారిని ఇబ్బందులకు గురిచేయటం మంచి విద్యార్థి లక్ష్యం కాదన్నారు. ర్యాగింగ్ చేయటం నేరమని విద్యార్థులు సీనియర్లు, జూనియర్లు అనేది తేడ లేకుండా స్నేహపూర్వకంగా కలిసిమెలసి విద్యనభ్యసించాలన్నారు. గురువారం సిద్దిపేట మెడికల్ కళాశాలల్లో విద్యార్థినీ, విద్యార్థులకు ర్యాగింగ్‌చట్టం గురించి దాని పర్యావసానాలు గురించి ఎసిపి మధు అవగాహన కల్పించారు. ఎసిపి మధు మాట్లాడుతూ ప్రోహిబిషన్ ఆఫ్ ర్యాగింగ్ చట్టం యాక్టు 1977లో అమలులో వచ్చిందన్నారు. ర్యాగింగ్ కేసులో ఇరుక్కుంటే వారి బంగారు భవిష్యత్తు కోల్పోతారన్నారు. వ్యసనాలకు బానిసై విద్యార్థులు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ముచేయవద్దన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. ర్యాగింగ్, ఈవ్ టిజింగ్ చేస్తే డయల్ 100కు సమాచారం ఇచ్చి సహాయం పొందవచ్చునన్నారు. కళాశాల యజమాన్యాలు సైతం విద్యార్థుల అలవాట్లు, నడవడికను గమనించాలన్నారు. ర్యాగింగ్ చట్ట ప్రకారం ఒక్కసారి కేసు నమోదైతే 6 నెలల నుండి 3 సంవత్సరాల వరకు జైలుశిక్ష ఉంటుందన్నారు. మెడికల్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ విమలధామస్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, త్రీటౌన్‌సిఐ విద్యాసాగర్, మెడికల్ కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు.

## 25న సింగరేణిలో దీపావళి బోనస్ చెల్లింపు..

**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** సింగరేణి లో దీపావళి పండుగ బోనస్ రూ. 93,750/ లు అక్టోబర్ 25 న కార్మికులకు, ఉద్యోగులకు చెల్లించుటకు యాజమాన్యం నిర్ణయించిందని గుర్తింపు సంఘం ఎఐటియుసి అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్‌లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 31న దీపావళి పండుగ ఉన్నందున సింగరేణిలో కార్మికుల కు దీపావళి బోనస్ చెల్లించాలని గుర్తింపు సంఘం ఏఐటీయుసి యాజమాన్యాన్ని కోరిన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారని వారు తెలిపారు.

## ఫ్యాక్స్‌లో అసలేం జరుగుతోంది?



**ప్రజాపక్షం / చందుర్తి :** చందుర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ రైతు సహకార పరపతి సంఘంలో అసలేంజరుగుతోందో తెలియక రైతులు అయోమయం చెందుతున్నారు. రైతులు దళారుల చేతిలో మోసపోకుండ అండగా ఉండడం కోసం ఏర్పడిన సంఘం అందుకు విరుద్ధంగా రైతులపాలిటి శాపంగా మారిందని ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వానికి, రైతులకు మధ్య వారదిలా ఉంటూ సంఘం అభివృద్ధి కోసం ఏర్పడిన పాలకవర్గం సంఘ పతనానికి కారణమైందటు ఆగ్రహిస్తున్నారు. కొంతమంది స్వార్థపరుల అత్యాశతో చందుర్తి ఫ్యాక్స్ అంతులేని అవినీతికి అడ్డాగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులకు తెలియకుండానే వారి పేరు మీద అక్రమంగా దాదాపు రూ.30 లక్షల వరకు పంట రుణాలు తీసుకున్న ఆరోపణలతో సంఘ సిఇఒ సస్పెండ్ అయ్యి విచారణ సాగుతూనే ఉంది. ఈ క్రమంలో వరి ధాన్యం కోనుగోలు కేంద్రాల ప్రారం భం కోసం బుధవారం పాలకవర్గం సమావేశం అవ్వగా మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. ప్రైవేటు వ్యక్తుల కంటే రూ.50 ల అధిక ధరకు ఎరువులు అమ్మడం అందులో వచ్చిన లాభాలు రూ.75 వేలు సంఘానికి జమ చేయకుండ పక్క దారి పట్టించడం, సుతీలు దారాల కొనుగోలులో రూ.1.93 లక్షలు పక్క దారి పట్టడం, ఎరువు బస్తాల డబ్బులు డైరెక్టర్ చెల్లించకపోవడంతో చైర్మన్ ఆదేశాలతో రూ.1.08 లక్షలు మార్క్‌ఫెడ్ కి చెల్లించడం, విహార యాత్ర కోసం అంటూ వైస్ చైర్మన్ వద్ద లక్ష రూపాయాలు ఉంచి చివరికి అతనికి ఇచ్చినట్లు రాయడం,కొంత డబ్బు సిఇఒ తన సొంతానికి వాడుకోవడం, గన్ని సంచులు ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పడం, ఇటీవల మండలంలోని మూడపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్ ప్రారంభం లో నమోదు చెసిన లెక్కల్లో అవకతవకలు ఇవన్నీ చూస్తూ ఉంటే సంఘం రైతుల అభివృద్ధి కోసం కాకుండా సంఘం సిఇఒ, సిబ్బంది, కొంత మంది పాలకవర్గ సభ్యుల అభివృద్ధి కోసమే అన్నట్లు ఉంది. గత నాలుగున్నర సంవత్సరాలుగా ఇంత జరుగుతున్న పాలకవర్గం చూసిచూడనట్లు వ్యవహరించి తీర పాలకవర్గ సమయం ముగింపు దశలో అక్రమాలు తెరపైకి రావడం పలు అనుమాలకు తావిస్తోంది. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ దీనిపై దృష్టి సారించి త్వరితగతిన విచారణ చేసి దీనిలో ఎవరి పాత్ర ఏంటో తేల్చి అక్రమార్కులు స్వాహ చేసిన సొమ్మును కక్కించి,భవిష్యత్తులో మరెవరు ఇలా చేయకుండా భాద్యులను కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

# సమర్థవంతంగా అధికారుల విధుల నిర్వహణ

## ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్ :** అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో కార్పొరేషన్ కార్యకలాపాలపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా.పి.శ్రీజ, నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నగరంలో పారిశుద్ధ్య సిబ్బంది లెక్కలు తప్పుగా నమోదవుతున్నాయని క్షేత్రస్థాయిలో పద్ధతి మార్చుకోని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి డివిజన్‌కు కేటాయించిన పారిశుద్ధ్య సిబ్బంది హాజరు 95శాతంపైగా ఉండాలన్నారు. ఇంటికి చెత్తబండి ఎప్పుడు వస్తుంది అనే షెడ్యూల్ తయారు చేయాలని పారిశుద్ధ్య సమస్యల కోసం సంప్రదించేందుకు కార్పొరేషన్ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఫోన్ నెంబరుతో ఏర్పాటు చేయాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు సానుకూలంగా, మర్యాదతో స్పందించాలని సూచించా . డివిజన్‌లో ఎటువంటి చెత్త వస్తుంది గమనించి నెల రోజుల్లో పారిశుద్ధ్య ప్రొఫైల్ ప్రతి డివిజన్‌కు తయారు చేయాలన్నారు. కార్పొరేషన్‌లో ప్రణాళిక ప్రకారం పనిచేస్తే పారిశుద్ధ్య నిర్వహణ మెరుగవుతుందన్నారు. అక్రమ నిర్మాణాల సర్వే చేపట్టాలని, పునాదుల దశ, స్లాబ్ దశ, నిర్మాణం పూర్తయిన అక్రమ నిర్మాణ వివరాలను సేకరించాలని కలెక్టర్ తెలిపారు. అక్రమ నిర్మాణాలు చేస్తున్న బిల్డర్లు, కాంట్రాక్టర్లను గుర్తించి వారిని బ్లాక్ లిస్టు చేయాలన్నారు. రోడ్డు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపునకు ప్రణాళిక రూపొందించుకోవాలని తెలిపారు. ఖమ్మం నగర వ్యాప్తంగా కార్పోరేషన్ అనుమతి లేకుండా ఎక్కడ బహిరంగ ప్రదేశాల్లో ఫెక్సీలు ప్రదర్శించడానికి వీలు లేదని ఆదేశాలు అందజేయాలని కలెక్టర్ తెలిపారు. టౌన్ ప్లానింగ్ విభాగం నోటీసులు ఇవ్వకుండా ఎటువంటి కూల్చివేతలకు పాల్పడవద్దన్నారు. ఆస్తి పన్ను విలువ అసెస్‌మెంట్ పునః పరిశీలన చేయాలని, తాగునీటి సరఫరా బిల్లులు ఎప్పటికప్పుడు వసూ లు చేయాలని, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ షఫీవుల్లా, మున్సిపల్ ఈఈ కృష్ణ లాల్, ఏసిపి వసుంధర, పర్యవేక్షకులు విజయానంద్, శానిటరి సూపర్‌వైజర్ సాంబయ్య, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, సెక్షన్ పర్యవేక్షకులు కె.శ్రీనివాసరావు, బిల్డింగ్, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, ఇంజనీరింగ్, అకౌంట్స్, మెప్మా అధికారులు పాల్గొన్నారు.

### ఇందిరా డెయిరీని సందర్శించిన కలెక్టర్

ఇందిరా మహిళా డెయిరీని లాభసాటిగా నడిపేందుకు కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. గురువారం ఎర్రుపాలెం మండల కేంద్రంలోని ఇందిరా మహిళా డెయిరీని కలెక్టర్ సందర్శించి మహిళా పాడి రైతులతో మాట్లాడారు. డెయిరీకి ఎన్ని గ్రామాల నుంచి ఎంత మంది పాడి రైతులు పాలు అందిస్తున్నారు, లీటరు పాలకు ఎంత చెల్లిస్తున్నారు, పాల రవాణా ఎలా జరుగుతుంది, లీటరు పాల ఉత్పత్తి అవుతున్న ఖర్చు, పాలను ప్రాసెసింగ్ చేసి డెయిరీ ఎంతకు అమ్ముతున్నది మొదలగు వివరాలను కలెక్టర అడిగి తెలుసుకున్నారు. మహిళలు వ్యాపార ఆలోచనా విధానం పెంచుకొని ఆర్థికంగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఒ సన్యాసయ్య, తహసీల్దార్ శారద, ఇందిరా మహిళా డెయిరీ మేనేజర్ సిద్దేశ్వర్, ఎపిఎం కె.వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, సభ్యులు మహిళా పాడి రైతులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కానిస్టేబుళ్ల ఆత్మీయ కలయిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 1984 బ్యాచ్ కానిస్టేబుళ్ల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని ఓ ప్రైవేటు హోటల్‌లో గురువారం నిర్వహించారు. ఖమ్మం జిల్లాలో కానిస్టేబుళ్లుగా ఉద్యోగం ప్రారంభించి హెడ్ కానిస్టేబుల్, ఎఎస్ఐ, ఎస్ఐ హోదాలో పలు పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వేర్వేరు ప్రాంతాలలో విధులు నిర్వహిస్తున్న వీరందరు నాలుగు దశాబ్దాల తర్వాత ఆత్మీయ కలయిక ద్వారా కలుసుకుని ఆనందంగా గడిపారు. 105 మంది సివిల్ కానిస్టేబుల్స్ బ్యాచ్‌లో ప్రస్తుతం 41 మంది సర్వీసులో ఉండగా 39 మంది ఉద్యోగ విరమణ పొందారు. 25 మంది మృతి చెందారు. ఈ సమ్మేళనంలో కుటుంబ సమేతంగా పాల్గొని సరదాగా గడిపారు. ఒకరినొకరు అప్యాయంగా పలకరించుకుంటూ గత స్మృతులను నెమరువేసుకుంటూ ఆనందంగా గడిపారు. తీపిగుర్తుగా ఒకరికొకరు మెమొంటోలను బహూకరించుకున్నారు. సమ్మేళనం విజయవంతానికి మోహన్‌రావు, రాంచందర్‌రావు, రాయప్ప, శ్రీశైలం, రహీం, శ్రీనివాసులు, మాదాల శ్రీనివాసరావు, సత్యనారాయణలు కృషి చేశారు.

## చిన్నారులకు జాగ్రత్తలు తెలియజేయాలి



**ప్రజాపక్షం/సత్తుపల్లి :** అదనపు జిల్లా కలెక్టర్ ఆదేశాలతో మహిళ శిశు సంక్షేమ శాఖ, బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ సోనీ ప్రేమ లీన ఆధ్వర్యంలో సత్తుపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, నారాయణ టెక్నో పాఠశాలలో చిన్నారులతో ముచ్చట్లు అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. చిన్నారులకు అన్నిరకాల అవగాహన కల్పిస్తూ జాగ్రత్తలు తెలియజేయాలని ఈ సందర్భంగా సోనీ ప్రేమ లీన తెలిపారు. కార్యక్రమంలో భాగంగా చిన్న పిల్లలపై జరుగుతున్న లైంగిక అత్యాచారాలపై అవగాహన కల్పిస్తూ ఆడపిల్లల్లో శరీర మార్పులతో పాటు మానసిక ఎదుగుదల పెంపొందించేలా మంచి స్పర్శ, చెడు స్పర్శ అంశంపై తాము ఎలా వ్యవహరించాలి ఎదుటివారి దుర్బుద్ధిని గ్రహించే విషయంపై తర్ఫీదు ఇచ్చారు. మాదక ద్రవ్యాల వాడకం, ఇంటర్‌నెట్‌లో అశ్లీల దృశ్యాలపై పిల్లలు ఆకర్షితులు కాకుండా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని సూచించారు. కార్యక్రమంలో మాధవి , అనిత, స్కూల్ సిబ్బంది పాల్గొన్నారు.

## గిరిజన బిడ్డలు ఎంబిబిఎస్‌లో సీట్లు సాధించడం గర్వకారణం

### ఐటిడిఎ పిఒ రాహుల్



**ప్రజాపక్షం/భద్రాచలం :** గిరిజన బిడ్డలు నీట్ పరీక్షలు ఉత్తమ ర్యాంకులు సాధించి ఎంబిబిఎస్‌లో సీట్లు సాధించడం గర్వకారణం అని ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ అన్నారు. ఎంబిబిఎస్‌లో సీట్లు సాధించిన బాలికలను ఆయన గురువారం తన ఛాంబర్లో అభినందించారు. విద్యార్థినులు వజ్ర కుమారి, కుడుముల సాత్విక, పూనెం గీతాంజలికి ఒక్కొక్కరికి రూ.50వేలు చొప్పున నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పట్టుదలతో డాక్టర్ కోర్సు పూర్తి చేసి, పిజీలో కూడా సీట్లు సాధించి నలుగురికి ఆదర్శంగా నిలవాలని, తల్లిదండ్రులతో పాటు గ్రామానికి, ఉపాధ్యాయులకు, అధ్యాపకులకు మంచిపేరు తేవాలన్నారు. కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి డేవిడ్ రాజ్, సున్నం రాంబాబు, ఖమ్మం డిడి విజయలక్ష్మి, ఆర్‌సి నాగార్జున రావు, ఎసిఎంఒ రమణయ్య, బాలికల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## ఐఎఎస్ బృందం పర్యటన



**ప్రజాపక్షం/తిరుమలాయపాలెం :** గిరిజనుల జీవన విధానం, స్థితిగతుల పై అధ్యయనం చేసేందుకు తిరుమలాయపాలెం మండలంలోని ఇస్లావత్ తండాకి వచ్చిన ఐఎఎస్ అధికారుల బృందం గురువారం సుబ్లేడు గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పోస్ట్ ఆఫీస్ ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులను సందర్శించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జనన, మరణ మరియు వివాహ రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోని రక్త పరీక్షలు, మందులు పంపిణీ, ఓపి రిజిస్టర్ పరిశీలించారు. గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఎలాంటి ఆరోగ్య సేవలు అందిస్తున్నారని డాక్టర్ వసుంధర ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పోస్టల్ శాఖ కార్యాలయం నందు ఖాతాదారులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న భీమా వివరాలను అడిగి తెలుసుకున్నారు. తదుపరి ఏపిజివిబి బ్యాంక్ నందు ఖాతాదారుల వివరాలు డ్వాక్రా సంఘాలకు రుణాలు రైతులకు పంట రుణాలు చిరు వ్యాపారులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీలపై బ్యాంకు మేనేజర్ ఎస్కే మున్నా ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో యంపిఓ పి.సూర్యనారాయణ, డిప్యూటీ తహసీల్దార్ కె.నరసింహారావు, పి.హెచ్.సి.వైద్యురాలు వసుంధర, ఉపాధి హామీ ఏపిఓ కె.నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు కిరణ్, బి.సురేష్, ఐకెపి సిసి బి.నాగేశ్వరరావు అంగన్వాడి టీచర్లు ఆశా వర్కర్లు గ్రామ దీపికలు మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుండెపోటుతో గీత కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** గుండెపోటుతో గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చేసుకుంది. పట్టణంలోని గౌడ బజారుకు చెందిన ఆరేపల్లి బాబురావు వృత్తి రీత్యా గీత కార్మికుడిగా ఉంటూ ఆ సంఘానికి అధ్యక్షుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో ముస్లిం బజార్‌లో తాటి చెట్టు ఎక్కేందుకు సిద్ధమవుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావటంతో చెట్టు వద్దనే కుప్పకులాడు. గమనించిన స్థానికులు వెంటనే గీత కార్మికులకు సమాచారం అందించారు. బాబురావును స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

## కెసిఆర్‌పై కోపంతో కాంగ్రెస్‌ను గెలిపించారు

### సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** తెలంగాణలో కెసిఆర్‌పై ఉన్న కోపంతోనే కాంగ్రెస్‌ను గెలిపించారని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. మండలంలోని మోటాపురంలో గురువారం జరిగిన సిపిఎం మండల సభలో తమ్మినేని మాట్లాడారు. కుటుంబ పాలనతో విసుగుచెంది ప్రజలు కెసిఆర్‌పై కోపంతో కాంగ్రెస్ బలహీనంగా ఉన్నప్పటికీ గెలిపించారన్నారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చితే సహించేది లేదని హెచ్చరించారు. దేశంలో కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి మతోన్మాద విధానాలను బిజెపి అవలంభిస్తుందన్నారు. హిందు రాజ్యం అంటూ ఆదాని, అంభానీ లకు దేశ సంపద ను కట్టబెడుతుందన్నారు. రైతు రుణమాఫీ సంపూర్ణంగా చేయలేదన్నారు.



## విద్యా సామర్థ్యాలు పెంచాల్సింది ఉపాధ్యాయులే





### భద్రాచలం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్

**ప్రజాపక్షం/భద్రాచలం :** విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనని, ఇందుకు నూటికి నూరు శాతం కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ కోరారు. గురువారం జిల్లా కేంద్రంలోని విద్యా శిక్షణా కేంద్రంలో మండల విద్యాధికారులు, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాటిల్ మాట్లాడుతూ పాఠశాలల మౌలిక వసతులపై పూర్తిస్థాయి దృష్టి పెట్టామని, ఇందుకు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలతో పనులను వేగవంతం చేస్తున్నామన్నారు. పరిశుభ్రతా కార్యక్రమాలు చేపట్టేందుకు నిధులు విడుదల చేస్తామన్నారు. ఆ నిధులు పాఠశాల అభివృద్ధికి, అవసరమైన సామాగ్రి కొనుగోళ్లకు వినియోగించాలన్నారు. పదో తరగతి పరీక్షలకు మొదటి నుండే ప్రణాళికాబద్ధంగా పిల్లలను చదివించి పరీక్షలకు సమాయత్తం చేయడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని కలెక్టర్ ఆకాక్షించారు. పాఠశాలల ఆవరణలో ఔషధ మొక్కలు, అవసరమైన ఇతర మొక్కలు నాటేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. త్వరలో పాఠశాల వ్యవసాయం అనే కార్యక్రమాన్ని మొదలుపెడతామని, దానికి ఉపాధ్యాయులంతా సహకరించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఇంటివద్ద రాతపనిని ప్రోత్సహించాలని, అందుకు వారికి నోటు పుస్తకాలు పంపిణీ చేస్తామని తెలిపారు. విద్యార్థులు అన్నిరంగాల్లో ప్రతిభ కనబరించేందుకు ఉపాధ్యాయులు పాటుపడాలన్నారు. విద్యారంగ అభివృద్ధికి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి, మాధవరావు, నాగరాజశేఖర్, చలపతిరాజు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## మత్స్య కార్మికుల అభివృద్ధికి ప్రాధాన్యం

### ఎమ్మెల్యే కనకయ్య



**ప్రజాపక్షం/కామేపల్లి:** రాష్ట్ర ప్రభుత్వం మత్స్య కార్మికుల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్య శాఖ ఆధ్వర్యంలో 100శాతం సబ్సిడీపై మత్స్య సొసైటీలకు అందజేస్తున్న చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ఆయన ఖమ్మం మత్స్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శివ ప్రసాద్, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి వెంకటేశ్వర్లుతో కలిసి కామేపల్లి మండలం పాత లింగాల పెద్ద చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాలో 876 చెరువులలో కోటి 75లక్షల చేప పిల్లల పెంపకాన్ని చేపడుతున్నట్లు వివరించారు. ఐదు రకాల చేపల పిల్లలను పెంచుతున్నట్లు తెలిపారు. కామేపల్లి మండలంలో రూ 4.53 లక్షల చేప పిల్లలు 55 చెరువులలో పెంచడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న రాయితీలకు, ప్రోత్సాహకాలను మత్స్య సొసైటీలు, కార్మికులు వినియోగించుకొని అభివృద్ధి పథంలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మత్స్య శాఖ ఫీల్డ్ అసిస్టెంట్ సరిత, సిబ్బంది భానుప్రసాద్, లక్ష్మ ణ్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు గింజల నర్సింహారెడ్డి, దమ్మాలపాటి సత్యనారాయణ, రామ్‌రెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, నల్లమోతు లక్ష్మ య్య, కామేపల్లి సొసైటీ ఉపాధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, పాత లింగాల సొసైటీ బాధ్యులు దొప్ప రమేష్, మధ్యాహ్న రమేష్, అంజయ్య, కిన్నెర రాఘవులు, జగన్నాథం, దుర్గారావు, తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

### ఎమ్మెల్యే ఆదినారాయణ



**ప్రజాపక్షం/అశ్వారావుపేట :** మహిళలు ఆర్థికంగా ఎదగటంతో పాటు సమాజంలో నాయకత్వ లక్షణాలను అలవర్చుకుని అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గురువారం మండలంలో ఆయన పర్యటించారు. ఈసందర్భంగా పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో సెర్ప్‌గ్రామ సంఘాల మహిళా సభ్యులకు తెలంగాణ ఆడపడుచు చీరెలను పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం 26 సంఘాల సభ్యులకు చెక్కులు అందించారు. పట్టణంలో సిఎం రిలీఫ్ ఫండ్, కల్యాణ లక్ష్మీ చెక్కులను నేరుగా ఇంటికి వెళ్లి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని, మహిళలకు ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ కృష్ణప్రసాద్, ఎంపిడిఒ ప్రవీణ్‌కుమార్, ఎంపిఒ ప్రసాదరావు, ప్రత్యేకాధికారి సందీప్‌ఖుమార్, ఎపిఎం ఆవుల వెంకటేశ్వర్‌రెడ్డి, మేనేజర్ రాజేష్, శ్రీరామ్మూర్తి, సొసైటీ అధ్యక్షులు చిన్నంశెట్టి సత్యనారాయణ, నాయకులు జూపల్లి రమేష్, తుమ్మ రాంబాబు, సుంకపల్లి వీరభద్రరావు, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

## చదువుల్లో రాణిస్తేనే విద్యార్థులకు భవిష్యత్తు

### ఎటిడిఒ అశోక్



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** విద్యార్థులు చదువుల్లో రాణిస్తేనే మంచి భవిష్యత్తు ఉంటుందని ఎటిడిఒ అశోక్ తెలిపారు. ఉప్పుసాక గ్రామంలోని తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈసందర్భంగా పాఠశాలలోని వంట గదులను పరిశీలించి, సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. విద్యార్థులు పాఠశాలకు వచ్చే విధంగా చూడాలని ఆదేశించారు. విద్యార్థులపై ప్రతిఉపాధ్యాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి అర్థమయ్యే రీతిలో బోధన అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు భూక్య భీమా, పిడి ఈశ్వర్, వార్డెన్ శశి కళ, ఉపాధ్యాయులు బివెంకటేశ్వర్లు, బి.ప్రసాద్ పాల్గొన్నారు.

## ఐటిసి అతిథిగృహంలో గవర్నర్ బస



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ తొలిసారి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా గురువారం సారపాకలోని ఐటిసి గెస్ట్ హౌస్‌కు చేరుకున్నారు. ఆయన కు జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్‌పి రోహిత్‌రాజ్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి బి.రాహుల్, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం దేవస్థానం ఇఒ రమాదేవి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం గవర్నర్ విష్ణుదేవ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాల్, భద్రాచలం ఆర్‌డిఒ దామోదర్‌రావు, ఇతర శాఖ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నేతల వర్గపోరు





**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** ఖమ్మంరూరల్ మండలంలోని వరంగల్ క్రాస్‌రోడ్డుకు చెందిన కాంగ్రెస్ నేతల యవ్వారం ఎలా ఉందంటే గుమ్మడికాయ దొంగ ఎవరంటే భుజాలు తడుముకున్న చందంగా ఉంది. ప్రభుత్వం, అధికారులు తమ పరిపాలనలో భాగంగా చేస్తున్న విధులను తామే చేపిస్తున్నామంటూ సోషల్‌మీడియా వేదికగా హంగు ఆర్భాటాలకు పోతున్నారు. ఈ వ్యవహారాలను రెండుగ్రూపులుగా విడిపోయి సోషల్ మీడియా వేదికగా రచ్చ కీడ్చుకుంటున్నారు. దీంట్లో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి ఎటువంటి సంబంధం లేకున్నప్పటికీ ప్రజల్లో బదనాం చేసేలా వ్యవహరిస్తున్నారంటూ సొంత పార్టీ నేతలే గుసగులాడుతున్నారు. భద్రాచలంలో గవర్నర్ ప్రోగ్రాం ఉండటంతో రోడ్డు మార్గంగా వరంగల్ క్రాస్‌రోడ్డు నుంచి గురువారం వెలుతున్నారు. ఈ నేపథ్యంలో రహదారి ఇరువైపుల ఎంపిఒ రాజారావు పంచాయతీ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపిస్తున్నారు. ముందుగా ఓ నాయకుడు అక్కడ జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నట్లు ఫోటో తీసుకోవడంతో పాటు తానే ఈ పనులు చేపిస్తున్నానని వాట్సప్ వేదికగా సోషల్ మీడియాలో పెట్టాడు. అనంతరం మరోవర్గం వారు తమ నాయకుడు సంబంధిత సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లి చేపించినట్టుగా సోషల్ మీడియాలో కౌంటర్‌గా పెట్టారు. ఇలా పెట్టి ప్రతి వాట్సప్ మెసేజ్‌కు ట్యాగ్‌లైన్ ఏదులాపురం మున్సిపాలిటీ అని పెడుతుంటారు. వాస్తవానికి ఏదులాపురం పంచాయతీ కేంద్రంగా మున్సిపాలిటీ చేస్తే ఎలాఉంటుందో డ్రాఫ్ట్ కావాలని కలెక్టర్ నివేదికను ప్రభుత్వానికి పంపించారు. అంతేగాని కార్పొరేషన్ అయినట్టుగా గెజిట్ విడుదల కాలేదు. కానీ ఇది కూడా తామే చేపించినట్టుగా వెంపర్లాడుతున్నట్టు ప్రజలు పేర్కొంటున్నారు.

**అధికారులకు తలనొప్పిగా...** వర్గపోరు కాంగ్రెస్ నేతల పోకడలు అధికారులకు తలనొప్పిగా మారాయి. విధులు నిర్వహించాలంటేనే ఆందోళన చెందుతున్నారు. ఓ వర్గం వారు తమకే అనుకూలంగా చేయాలని, మరో వర్గం వారు వారికి కాదు మాకే అనుకూలంగా చేయలంటూ ఆర్డర్లు వేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అధికారులు ఏమి చేయాలో తెలీక తలలు పట్టుకుంటున్నారు. ఖమ్మంరూరల్ మండలంలోని ఇతర గ్రామాలలోనూ వెలుపెడుతూ అక్కడి నేతలతో మందలింపులు చేపించుకున్నట్టు తెలిసింది. వీరి వ్యవహారంతో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఇమేజ్‌ను సైతం తగ్గిస్తున్నారని సొంత పార్టీ నేతలే గుసగుసలాడుతున్నారు.

## పరిహారం తప్పిదాలపై మౌనమేల?

### నష్టపోయిన రైతులకు శూన్యహస్తం
### మౌనం వీడని వ్యవసాయ అధికారులు
### నేడు భట్టి వద్దకు రైతులు



**ప్రజాపక్షం/ఖమ్మం :** పంట నష్ట పరిహార తప్పిదాలపై వ్యవసాయ అధికారులు నోరు మెదపడం లేదు. కలెక్టర్‌కు పలు ఫిర్యాదులు వచ్చినా, క్షేత్రస్థాయిలో ఆందోళనలు జరుగుతున్నా ఉన్నతాధికారులు స్పందించకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు వ్యవసాయ అధికారులు కావాలనే తప్పుడు జాబితాలు రూపొందించి పెద్ద మొత్తంలో అవినీతికి పాల్పడ్డారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. సెప్టెంబరులో సంభవించిన వరదల కారణంగా వాగులు, నదులు పరివాహక ప్రాంతాలలో పంటలు దెబ్బతినగా దెబ్బతిన్న భూములకు ఎకరాకు రూ.10 వేల పరిహారాన్నిప్రకటించి సంబంధిత రైతుల ఖాతాల్లో జమ చేస్తుంది. క్షేత్రస్థాయిలో పరిశీలనకు వెళ్లిన మండల వ్యవసాయ అధికారులు దెబ్బతిన్న భూముల్లోని పంటలను పరిశీలించకుండా పైరవీకారులతో జాబితాను సిద్ధంచేశారు. పంట నష్టం జరిగిన రైతుల వద్ద లంచాలు పుచ్చుకుని పరిహార జాబితాలో చేర్చారు. బోనకల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇటువంటి పరిస్థితి నెలకొంది. ఊర్లు కొట్టుకుపోయినా చుక్క నీరు ఎక్కని మెరక భూముల వరద తాకిడికి గురైనట్లు ఆ రైతులు పరిహారానికి అర్హులుగా జాబితాలో చేర్చారు. ఇదోక భాగమైతే అసలు భూమి లేని పంట వేసి నష్టపోయారని వ్యవసాయ అధికారులు పేర్కొని వారి బ్యాంకు ఖాతాల వివరాలు తెలుసుకుని ఖాతాల్లో డబ్బులు జమ చేస్తున్నారు. రాపల్లి గ్రామంలో భూమి లేని కొందరు రైతులకు పరిహారం మంజూరుకావడంపై కలెక్టర్‌కు, జిల్లాకు చెందిన మంత్రులకు ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వంలో పైరవీ రాజకీయాలు నడిపిన కొందరు కాంగ్రెస్ ప్రభుత్వంలోను అదే ఒరవడిని కొనసాగించి నీకింత నాకింత అనే ధోరణిలో వ్యవహరించారు. ఒక రైతు 1.10 ఎకరాల భూమి ఉంటే 1.30 ఎకరాలకు పరిహారం అందించారు. ఇది ఒక ఉదాహరణ మాత్రమే. అసలు భూమి లేని కుటుంబాలకు పరిహారం రావడం విశేషం. పంట వేయకుండానే నష్టపోయినట్లు పరిహారానికి అర్హులుగా పేర్కొనగా ఒక రైతు వడ్లు చల్లక ముందే వరదలు వచ్చిన వరి పంట దెబ్బతిన్నదని పరిహార ఖాతాల్లో జమ చేశారు. బోనకల్ మండలంలో అవినీతికి పాల్పడిన వ్యవసాయ విస్తరణ అధికారులపై ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో అవగతం కావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక ఎఒఒ వ్యవసాయ అధికారి ముందు రైతుల సమక్షంలో ఏమి పుచ్చుకుని తప్పిదాలకు పాల్పడింది సవివరంగా తెలిపిన చర్యలు లేకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. ఇదిలా ఉండగా బోనకల్ మండల రైతులు ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లారు. శుక్రవారం ఉప ముఖ్యమంత్రిని కలిసి మండల వ్యవసాయ అధికారులు, వారికి దన్నుగా నిలుస్తున్న వారిపై ఫిర్యాదు చేయనున్నట్లు సమాచారం.

## నేడు కార్మికుల ఖాతాల్లో బోనస్

### ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి రాజ్ కుమార్

**ప్రజాపక్షం / జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** సింగరేణిలో దీపావళి బోనస్ నేడు కార్మికుల ఖాతాల్లో జమచేయనున్నట్లు సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటియుసి ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్ గురువారం తెలిపారు.కార్మికులకు దీపావళి బోనస్ చెల్లించాలని గుర్తింపు సంఘంగా సింగరేణి యాజమా న్యాన్ని కోరడం జరిగిందని ఈ మేరకు 25న నేడు దీపావళి బోనస్ చెల్లించడం కోసం యాజమాన్యం నిర్ణయించిందని ఆయన పేర్కొన్నారు.ప్రతి కార్మికునికి 93,750 రూపాయలు బోనస్ చెల్లించనున్నదని తెలిపారు. సిపిఐ ఖమ్మం ఎంపి నాయకులు టి.బి విఠల్ రావు కృషితో 1962లో 3వందలతో మొదలైన బోనస్ నేడు 93వేల750రూపాయలకుచేరుకుందన్నారు.రాష్ట్రంలో42వేల మంది సింగరేణి కార్మికులకు లబ్ధిచేకూరనుందని తెలిపారు.సింగరేణిలో బోనస్ కావాలని మొదటగా పోరాటం చేసింది ఏఐటియుసి మాత్రమేనని ఆ పోరాట ఫలితమేనని కార్మికులు గమనించాలని రాజ్‌కుమార్ అన్నారు.

## క్విజ్ పోటీలకు గురుకుల విద్యార్థినులు



**ప్రజాపక్షం/రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల కు చెందిన విద్యార్థులు జి రోహిత 8 తరగతి, టి స్వాతి 9 వ తరగతి రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైనట్లు గురువారం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సరిత తెలిపారు. ఈనెల 26న హైదరాబాదులో జరిగే వరల్డ్ వైడ్ లైఫ్ ఫడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్విజ్ పోటీలో పాల్గొననున్నట్లు తెలిపారు. విద్యార్థినులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ లీల, రమ్యసుధా, తదితరులు పాల్గొన్నారు.

## ఇసుక మాఫియాపై చర్యలేవి?



**ప్రజాపక్షం/తొర్రూరు రూరల్ :** రెవెన్యు అధికారులపై దాడికి ప్రయత్నం చేసిన ఇసుక మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని తొర్రూరు తహశీల్దారు జి. శ్రీనివాస్ అన్నారు. మహబాదు జిల్లా నెల్లికుదురు మండల రెవెన్యు అధికారులపై దాడికి ప్రయత్నించిన ఇసుక మాఫియాపై చర్యలు తీసుకోవాలనిగురువారం తొర్రూరు తహశీల్దారు కార్యాలయంలో అధికారులు, సిబ్బంది నల్ల బాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. తహశీల్దారు శ్రీనివాస్ మాట్లాడుతూ సమాచారం మేరకు నెల్లికుదురు తహశీల్దారు తన సిబ్బందితో తనిఖీలకు వెళ్ళగా అకేరు వాగు నుండి అక్రమంగా ఇసుక రవాణ చేస్తున్న ట్రాక్టర్‌ను అడ్డుకోగా వారిపై ఇష్టం వచ్చినట్లు బూతులు తిడుతూ దాడికి ప్రయత్నించిన ఘటనను ఖండిస్తున్నామన్నారు. డిటి నర్సయ్య, ఆర్ఐ ఎండి బషీర్, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌రెడ్డి, ఎఎస్ఒ చంద్రశేఖర్,సిబ్బంది శ్రీనివాసరావు,నర్మద,జ్యోతి,వనిత,ప్రసన్న, సందీప్, జశ్వంత్, రమేష్, సుధాకర్, జానీ, రవి, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్‌తో గ్రంథాలయ సంస్థ చైర్మన్



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** ములుగు జిల్లా గ్రంథాలయం సంస్థ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బానోత్ రవిచందర్ గురువారం ములుగు జిల్లా కలెక్టర్ టిఎస్ దివాకరను కలెక్టరేట్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందించారు.కలెక్టర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.ప్రజా ప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ పాసుబుక్‌ల ముఠా పట్టివేత



**ప్రజాపక్షం/ములుగుప్రతినిధి:** ములుగు జిల్లాలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం పోడు రైతులకు బుక్కులు ఇచ్చింది. అదే బుక్కులను కొంత మంది దొంగల ముఠా తయారై నకిలీ పాస్ బుక్కులను లక్షల్లో డబ్బులు సొమ్ము చేసుకొని ఆ బుక్‌లను విడుదల చేసిన విషయం విదితమే. గురువారం డిఎఫ్ఒ రాహుల్ కిషన్ జాదవ్ దొంగలముఠాని పట్టుకొని విలేకరుల సమావేశంలో ప్రవేశపెట్టారు. ఆయన మాట్లాడుతూ నర్సంపేట అడ్డాగా ఏర్పాటు చేసుకొని ములుగు జిల్లా కేంద్రానికి చెందినవారు కొంత మంది అలాగే నర్సంపేటలో ఒక షాపులో వీరందరూ ముఠాగా తయారై నకిలీ పాసు బుక్కులను తయారుచేసి కలెక్టర్ పిఓ సంతకాలను ఫోర్జరీ చేసి ఆ బుక్‌లను రైతులకు ఇచ్చినట్లు తెలుస్తోంది. చాందావాద్ భద్రు, తాటిపాముల రాజు, భూక్య వెంకన్న, బానోతు హరికృష్ణలను అరెస్టు చేసినట్లు, మిగతా వారు పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఎఫ్ఆర్ఓ డోలి శంకర్, బీట్ ఆఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు



**ప్రజాపక్షం/హనుమకొండటౌన్ :** అర్హులైన ప్రతీ ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందచేస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం బాలసముద్రంలోని పశ్చిమ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వరంగల్ మండలం 29వ డివిజన్ ఐదుగురు కల్యాణలక్ష్మి, షాదీ ముబాకర్ లబ్ధిదారులకు చెక్కులను అందచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన అర్హులకు సంక్షేమ పథకాలు అందిస్తుందన్నారు. చెక్కులు తీసుకున్న లబ్ధిదారులకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పూర్ణచందర్, సారం బాలు, సయ్యద్ రఫిక్, గొర్రె మహేష్, బొమ్మ సురేష్, రెవెన్యూ అధికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# పోటీ పడుతూ ప్రతిభ చాటాలి

### విద్యార్థి దశ చాలా కీలకమైంది

### పంచాయతీరాజ్ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థిని, విద్యార్థులను ఉపాధ్యాయులు తమ స్వంత పిల్లలుగా చూసుకోవాలని, విద్యార్థులు పోటీపడుతూ చదువులో తమ ప్రతిభను చాటాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, స్త్రీ, శిశు సంక్షేమశాఖలమంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. గురువారం ఏటూరునాగారం మండల కేంద్రంలోని జడ్పిహెచ్ఎస్ కంప్యూటర్ ల్యాబ్‌లో (సిఎస్ఆర్ నిధులు మౌరిటెక్ ఐటి సంస్థ సౌజన్యంతో జిల్లాకు 100 కంప్యూటర్లను సరఫరా చేయగా) అందులో 10 కంప్యూటర్లను జిల్లా కలెక్టర్ దివాకర్ టిఎస్, ఐటిడిఏ పిఓ చిత్ర మిశ్రాతో కలిసి మంత్రి సీతక్క విద్యార్థులకు అందజేశారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యార్థులకు భవిష్యత్తులో విద్య ఎంతగానో ఉపయోగపడుతుందని, విద్యతో పాటు విజ్ఞానం, క్రీడాస్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకొని ఇతర విద్యార్థులతో పోటీ పడుతూ విద్యలో రాణించాలని సూచించారు. రానున్న రోజులలో ప్రభు త్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థుల సంఖ్య పెంచాలని, అన్ని పాఠశాలల్లో డిజిటల్ తరహాలో విద్యార్థులకు విద్యను అందించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పాణిని, హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు, విద్యార్థిని, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి పనులు పెండింగ్‌లో పెట్టొద్దు



### హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

**ప్రజాపక్షం/ హనుమకొండప్రతినిధి :** అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులు పెండింగ్‌లో ఉండకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య అన్నారు. గురువారం కలెక్టరేట్లోఅమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పలు ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనుల గురించి సంబంధిత శాఖల అధికారులను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన పనులలో ఏవైనా పెండింగ్ ఉన్నట్లయితే వాటిని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు, ఎఇలు రెగ్యులర్ గా పాఠశాలలను సందర్శించి విద్యుత్తు, తాగునీటి సరఫరా, టాయిలెట్స్ నిర్మాణ పనులు పూర్తయ్యాయా లేదా అనేది తనిఖీ చేయాలన్నారు. డిఇఒ వాసంతి, జిల్లా పరిషత్ సిఇఒ విద్యాలత, డిఆర్డివో నాగ పద్మజ, సిపిఓ సత్యనారాయణ రెడ్డి, ఆర్ అండ్ బి ఇఇ సురేష్‌బాబు, ఎంపిడిఒలు, పంచాయతీరాజ్ ఎఇలు, అధికారులు పాల్గొన్నారు.

# రైతుల అభ్యున్నతికి కృషి చేద్దాం

### పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి



**ప్రజాపక్షం/గీసుకొండ:** రైతుల అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి అన్నారు. సహకార సంఘాలు కమర్షియల్ బ్యాంకుల మాదిరిగా కాకుండా రైతుల అభ్యున్నతికి సహకారంగా ఉండే విధంగా పాలకవర్గాలు ప్రణాళికలు తయారుచేయాలన్నారు. ఆంధ్రా బ్యాంకు కర్షక సేవా సహకార సంఘం సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఊకల్ సహకార సంఘంలో రూ. రెండు లక్షల లోపు రుణమాఫీ కాని రైతుల వివరాలు వాటికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కమర్షియల్ బ్యాంకులో 7 శాతం వడ్డీ రేటు ఉండగా సొసైటీలో 10.5 శాతం వడ్డీ పడుతుందని, సొసైటీపై రైతులకు నమ్మకం పోతుందని పాలకవర్గం సభ్యులు తెలుపగా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పంట సాగుపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. సొసైటీ ఛైర్మన్ బొమ్మల రమేశ్, డీసీఓ నీరజ, తహసీల్దారు రియాజుద్దీన్, మేనేజింగ్ డైరెక్టర్ రామకృష్ణారావు, వైస్ ఛైర్మన్ మున్నంగి జనార్ధన్‌రెడ్డి, డైరెక్టర్లు మండల వీరస్వామి, కృష్ణారెడ్డి, మేకల రాజ్‌కుమార్, ఇంజం వెంకట్రావు, నిమ్మ రజిత, లక్ష్మి, పాపయ్య, రవి, ఉద్యోగులు రమేశ్, రాంబాబు, బాలాజీ, సాంబశివరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఆదాయ, వనరులు పెరగాలి

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



**ప్రజాపక్షం/జయశంకర్‌భూపాలపల్లి ప్రతినిధి :** మత్స్యకారుల సంక్షేమానికి ప్రజాప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తున్ననట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. గురువారం భూపాలపల్లి మండలం పంబాపూర్ భీమ్ ఘనపూర్ పెద్దచెరువులో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత చేప పిల్లలను వదిలారు.ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, రాష్ట్ర డిప్యూటీ డైరెక్టర్ ఖదీర్ అహ్మద్, జిల్లా ఫిషరీస్ డెవలప్ మెంట్ ఆఫీసర్ అవినాష్, కాంగ్రెస్ ముఖ్య నేతలున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మత్యకారుల ఆర్థికాభివృద్ధికి నూరు శాతం రాయితీపై ఉచిత చేప పిల్లలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. అందులో భాగంగానే పంబా పూర్ భీమ్ ఘనపూర్ పెద్ద చెరువులో సుమారు 50 వేల చేప పిల్లలను వొదిలామని, వారంలోపు మరో 6 లక్షల చేప పిల్లలను వొదులుతామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మత్యకారుల కుటుంబాలకు లబ్ధి చేకూరుతుందని అన్నారు. ఉచిత చేప పిల్లలు పంపిణీ ద్వారా మత్యకారులకు ఆదాయ వనరులను మెరుగుపరుచుకోవడంతోపాటు జలాశయాలల్లో చేపల ఉత్పత్తిని పెంచేందుకు దోహదపడుతుందన్నారు. మత్యకారులు అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేకంగా కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. నాణ్యత కలిగిన చేప పిల్లలు వేస్తున్నామని అన్నారు. అవినీతికి పాల్పడితే సహించమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి అవినాష్, కాంగ్రెస్ నాయకులు చాడ రఘునాథ్ రెడ్డి, అంబాల శ్రీనివాస్, రామినేని రవీందర్, రామ్ చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

# సాధారణ ప్రసవాలకు ప్రోత్సాహం

### జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో చాలా ఎక్కువశాతం సి సెక్షన్ ప్రసవాలు అవుతున్నాయని, హాస్పిటల్ యాజమాన్యాలు సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సాధారణ ప్రసవాలు, రిజిస్ట్రేషన్, స్కానింగ్, తదితర అంశాల మీద జిల్లాలోని ప్రైవేట్ హాస్పిటల్ యాజమాన్యం వారితో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ మాట్లాడుతూ ఏ హాస్పిటల్ వారైతే తీరు మార్చుకోకుండా సాధారణ ప్రసవాలు కాకుండా సీ సెక్షన్‌లు చేస్తున్నారో వారిపై క్లినికల్ ఎష్టబ్లిష్మెంట్ యాక్ట్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోని హాస్పిటల్ యాజమాన్యాలు వచ్చే నవంబర్ 15 వరకు తప్పకుండా చేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ హాస్పిటల్స్‌లలో వైద్యం తీసుకునే రోగుల వివరాలు హెచ్ఎంఐఎస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో పెట్టాలన్నారు.అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్, డీఎంహెచ్‌వో డాక్టర్ రవీందర్ గౌడ్, ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, వ్యాక్సినైజేషన్ ప్రోగ్రాం ఆఫీసర్ స్వర్ణకుమారి పాల్గొన్నారు.

# హత్యకు సహకరించిన వారిని తప్పించారు

### పోలీసులను అడ్డుకున్న గ్రామస్తులు..

### సీతంపేటలో తీవ్ర ఉద్రిక్తత

### నిందితులకు శిక్ష పడేలా చర్యలు

### ఎస్‌పి సుధీర్ రామ్‌నాథ్ హమీ



**ప్రజాపక్షం/ గార్ల :** మహబుబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో భారీగా మొహరించిన పోలీసులను గ్రామస్తులు అడ్డుకున్నారు. గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. గుమ్మడి మహేష్‌ను హత్య చేసిన వారికి సహకరించిన ముగ్గురునిందితులను స్థానిక పోలీసులు, ఎస్ఐ, సిఐలు కేసు నుండి తప్పించి వారిని కాపాడే ప్రయత్నం చేస్తున్నారని మృతుని తల్లి గుమ్మడి రాజకుమారి,సోదరుడు గుమ్మడి రాజు ఆరోపించారు. ఐదు రోజుల క్రితం గుమ్మడి మహేష్ హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా, గురువారం హత్య సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేపట్టేందుకు ఘటనా స్థలానికి పోలీసులు నిందితులను తీసుకుని వచ్చారు. నిందితులను చూసిన మహేష్ కుటుంబీకులు,గ్రామస్తులు ఆగ్రహంతో వారిపై దాడికి యత్నించారు. పోలీసులు అడ్డుకున్నారు. హత్యకు సహకరివంచిన నిందితులను కూడా అరెస్టు చేసి శిక్ష విధించాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్‌పి ఎదుటనే గ్రామస్తులు ఆందోళన నిర్వహించారు. సంఘటనా స్థలంలో ఉన్న మహబూబాబాద్ ఎస్‌పి పి.సుధీర్‌రాంనాథ్ కేకెన్ గ్రామస్తులను, మృతుని కుటుంబీకులను శాంతింపచేసేందుకు ప్రయత్నించారు. హత్యకు సహకరించిన వారి వివరాలు తెలిపితే శిక్ష పడేలా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు.

## ఛాతి ఆసుపత్రిలో వసతుల పరిశీలన



**ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి :** గ్రేటర్ వరంగల్ పరిధి 54వ డివిజన్ లోని ప్రభుత్వ ఛాతి, క్షయ వ్యాధుల(టీబీ) ఆసుపత్రిని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, హన్మకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు ఆసుపత్రిలోని ఓబీ విభాగంతో పాటు మేల్, ఫిమేల్ వార్డులు, ఆర్ఐసీయూ, బ్రాంకోస్కోపీ రూమ్, సెమినార్ హాలును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించి అందిస్తున్న వైద్య సేవలు, కావాల్సిన సదుపాయాల గురించి ఎమ్మెల్యే, కలెక్టర్ ఆసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ సునీత, వైద్యులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి భవనానికి పునరుద్ధరణ చర్యలు, ఇతర మరమ్మతు పనులు చేయించాలని, పలు సదుపాయాలు కల్పించాలని వైద్యులు, సిబ్బంది కోరగా ఆసుపత్రి అభివృద్ధికి కావాల్సిన ప్రతిపాదనలు పంపించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి లలితాదేవి, ఆర్డీవో వెంకటేశ్, మెడికల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హమాలీలకు ఆరోగ్య పరీక్షలు



**ప్రజాపక్షం/వరంగల్ :** ఏనుమాముల మార్కెట్‌లో హమాలీ కార్మికులకు ఆరోగ్య పరీక్షలు చేసి ఫిజికల్ ఫిట్‌నెసస్ సర్టిఫికెట్ ఇవ్వాలని వరంగల్ ఛాంబర్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ అభ్యర్థన మేరకు ఎంజీఎం ఆసుపత్రి సూపరిండెంటెంట్ 8 మంది డాక్టర్ల బృందం పంపారు. ఆరోగ్య పరీక్షా కేంద్రాన్ని గురువారం కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాటం రామ్‌కుమార్‌రెడ్డి ప్రారంభించారు.ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్ రెడ్డి, డాక్టర్ కాటం రాంకుమార్‌రెడ్డి,ఇతర డాక్టర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ ఉన్న శ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల, ఛాంబర్ ఉపాధ్యక్షుడు మొగిలి చంద్రమౌళి, గౌరవ ప్రధాన కార్యదర్శి మాడూరి వేదప్రకాష్, సంయుక్త కార్యదర్శి సాగర్ల శ్రీనివాస్, కోశాధికారి అల్లె సంపత్, ఛాంబర్ అనుబంధ సెక్షన్ల అధ్యక్ష, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ధనాన్ని కెసిఆర్, కెటిఆర్ లూటీ

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** తెలంగాణ రాష్ట్రంలో దశాబ్ద కాలంలో బిఆర్ఎస్ పార్టీ కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు ,కవిత తెలంగాణ రాష్ట్ర ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారని, టిఆర్ఎస్ రాష్ట్ర ప్రభుత్వంచేసిన లక్షల కోట్ల రూపాయలకు నేడు వడ్డీలు కట్టలేని స్థితిలో ప్రభుత్వం ఉందని కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి శనిగరపు వెంకటేష్, జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి స్వరూప అన్నారు. హసన్ పర్తి మండలకేంద్రంలో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ కెసిఆర్,హరీష్ రావు, కేటీఆర్ గతంలో మూసి ప్రక్షాళన చేస్తామని నిధులు దు ర్వినియోగం చేసి స్వాహా చేసిన ఘనులు అని, అలాగే మూసి ప్రక్షాళన పేరుతో ఇచ్చట చెప్పుకోదగ్గ టవర్ నిర్మాణం చేసి సింగపూర్‌ను మరిపిస్తామనిచెపిప్రజలను మోసం చేసి నిధులు స్వాహా చేసిన కేటీఆర్, హరీష్‌రావు, కెసిఆర్ మీ దుశ్చర్యలను ప్రజలు మర్చిపోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్, హనుమకొండజిల్లా ఇన్చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సలహాదారు వేం నరేందర్‌రెడ్డి ప్రభుత్వ అధికారులు, మేధావుల సూచనలు సలహాలతో పనులు వేగవంతం చేస్తుంటే ప్రజలను రెచ్చగొడుతూ పనులకు అడ్డుతగులుతున్న కేంద్ర మంత్రులు జి కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ ఈటల రాజేందర్ అభివృద్ధి నిరోధక చర్యలు ఇప్పటికైనా మానుకోవాలని సూచించారు.



# కాళేశ్వరాలయ అభివృద్ధికి ప్రణాళిక

### జయశంకర్ కలెక్టర్ రాహుల్‌శర్మ



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి /కాళేశ్వరం:** కాళేశ్వర ఆలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులను ఆదేశించారు. గురువారం మహదేవ్‌పూర్ మండలం కాళేశ్వరం దేవాలయ కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో కాళేశ్వర ముక్తేశ్వరస్వామి దేవస్థానం అభివృద్ధిపై దేవదాయ, రెవెన్యూ, పంచాయతి రాజ్ ఇంజినీరింగ్ అధికారులతోసమీక్ష సమావేశం నిర్వహించారు.కలెక్టర్‌మాట్లాడుతూ, గత నెలలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ, పౌర సంబంధాల శాఖ కమిషనర్ హనుమంతరావు దేవాలయ అభివృద్ధికి ప్రణాళికలు రూపకల్పనపై సమావేశం నిర్వహించి చేపట్టాల్సిన పనులపై దిశా నిర్దేశం చేశారని, అట్టి సూచనల మేరకు దేవాలయ అభివృద్ధికి రూపొందించిన ప్రణాళికలపై సమీక్షా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్ని సౌకర్యాలు ఏర్పాట్లు చేయాలని, గోదావరిలోభక్తులు పుణ్య స్నానాలు చేసి వదిలిన దుస్తులు గోదావరిలో వేయకుండా ప్రత్యేకంగా ప్లాస్టిక్ డ్రమ్ములు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం జరుగనున్న సరస్వతి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ప్రయివేటు స్థలాలను గుర్తించి వాహనాలు పార్కింగ్‌కు చర్యలు చేపట్టాలని తెలిపారు. 100గదుల సత్రం నిర్మాణ పనులు వేగవం తం చేయాలని ఆదేశించారు. అంతకుముం దు ఆలయ అభివృద్ధికి ఇంజనీరింగ్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాటారం సబ్ కలెక్టర్ మాయాక్ సింగ్, డిపిఓ నారాయణరావు, పంచాయతీరాజ్ ఇఇ దిలీప్,ఆలయ కార్యనిర్వహణ అధికారి మారుతి, ఎంపిడిఓవెంకటేశ్వర్లు,డిటికృష్ణ పాల్గొన్నారు.

## గీత కార్మికుడిని ప్రభుత్వం ఆదుకోవాలి



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చంద్రయ్య పల్లి గ్రామానికి చెందిన గడ్డమీది చేరాలు అనే గీత కార్మికుడు గురువారం మల్లంపల్లి తాటి వనంలో తాటి చెట్టు ఎక్కి దిగుతుండగా ప్రమాదవ శాత్తు కిందపడ్డారు. సమీపంలోని గీత కార్మికులు, కుటుంబ సభ్యులు 108లో వరంగల్ ఎంజిఎంకు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చేరాలు గౌడ్‌ను గౌడ జన హక్కుల పోరాట సమితి మోకుదెబ్బ స్టేట్‌వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతులరమేష్‌గౌడ్ పరామర్శించారు. రమేష్ గౌడ్ మాట్లాడుతూ చేరాలు గౌడ్‌కు సంబందించిన వివరాలు బీసీ కార్పొరేషన్, ఆబకారిశాఖకు పంపించడం జరుగుతుందన్నారు. గాయపడిన చేరాలు గౌడ్‌కు ప్రభుత్వం హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం 15 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.మల్లం పల్లి గీత పారిశ్రామిక సంఘం అధ్యక్షులు గుండెబోయిన రమేష్ గౌడ్, గడ్డమీది ఐలయ్య గౌడ్, గడ్డమీది అశ్విన్ గౌడ్, అన్వేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉన్నత పాఠశాలలో కలెక్టర్ తనిఖీ



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధి:** దౌల్తాబాద్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి గురువారం నాడు ఆకస్మికంగా తనఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు . ఈ ఏడాది పదవ తరగతి ఉత్తమ ఫలితాలు సాధన కోసం ఇప్పటి నుండి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ,విద్యార్థులను ప్రతిభా ఆధారంగా గ్రూపులుగా విభజించి వారి సామర్థ్యాల పెంపొందించడం కోసం ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఉన్న సమస్యలను ఉపాధ్యాయులు ,విద్యార్థులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

# నిధులు మంజూరు చేయాలని మంత్రులకు వినతి



**ప్రజాపక్షం/కొల్చారం:** మండలం లోని పలు గ్రామాలకు అభివృద్ధి పనుల నిమిత్తం నిధులు మంజూరు చేయాలని రాష్ట్ర మంత్రివర్యులు దామోదర్ రాజనర్సింహ, కొండ సురేఖ లకు కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ ఆధ్వర్యంలో గురువారం మండలం మీదుగా మెదక్ వెళ్తున్న తరుణంలో వారికి ఘన స్వాగతం పలికి అభివృద్ధి పనులకు సంబంధించిన వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, మండల గౌడ సంఘం అధ్యక్షులు నాయిని వెంకట్ గౌడ్, దేవన గారి శేఖర్, మహేశ్వర్ రెడ్డి, చింతల బాలరాజ్, శ్రీశైలం, మరెల్లి అనిల్, ఆగం గౌడ్, బద్యానాయక్, నెల్లి రాజు, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీష్‌రావును కలిసిన మలిదశ ఉద్యమకారులు



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ నియోజకవర్గ మలిదశ ఉద్యమకారుల ఫోరం ఆధ్వర్యంలో గురువారం మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్‌రావును కోకాపేటలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఉడుత గంగాధర్ గుప్తా, సాయి బాబా, గంజివర్ చందు, మహేశ్, భాస్కర్ గౌడ్, దండు విజయ్, గంగారాం, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



**ప్రజాపక్షం/గజ్వేల్:** రోడ్డు ప్రమాదాల నివారణపై రోడ్డు సేఫ్టీ మరియు పోలీసు అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రమాదకర ప్రాంతాలను పరిశీలించారు. గురువారం రాజీవ్ రహదారి రిమ్మనగూడ, సురభి కాలేజ్ చౌరస్తా, పాతూర్ జంక్షన్, క్యాసారం రింగ్ రోడ్డు వరకు ఉన్న బ్లాక్ స్పాట్స్ సిఐ సైదా, సిద్దిపేట ఆర్అండ్ బి డిఈ వెంకటేశ్వరరావు, హెచ్ కే ఆర్ హైవే అథారిటీ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పరిశీలించి రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమీక్షించారు. అయితే మానవ తప్పిదం, వాహనాల అధిక వేగం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నట్లు స్పష్టం చేశారు. రోడ్డు, ట్రాఫిక్ నిబంధనలు పాటించి క్షేమంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ముఖ్యంగా పోటీపడి వాహనాలు నడపవద్దని, అవగాహన రాయిత్యంతో అధిక ప్రమాదాలు జరుగుతున్నట్లు సిఐ సైదా స్పష్టం చేశారు. హెచ్ కె ఆర్, ఆర్ అండ్ బి, పంచాయతీ రాజ్ అధికారుల సమన్వయంతో థర్మో ప్లాస్టిక్ పెయింట్స్, హజ్డాడ్ మార్కర్, రేడియం స్టెడ్స్, బ్రింగ్ లెటర్స్, సైనింగ్ బోర్డ్స్, వేగ నియంత్రణ బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వర్షాలతో పడిన గుంతలు పూడ్చడం జరుగుతుందని, మెయిన్ రోడ్‌కు వచ్చే అప్రోచ్ రోడ్లపై స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తామని, వివిధ రోడ్ల వెంట చెట్ల కొమ్మలు అడ్డంగా పెరగడంతో ఇబ్బంది ఎదురవుతోందని, వేగ నియంత్రణ కోసం స్పీడ్ లేజర్‌గన్ అందుబాటులోకి తెస్తామని, అతి వేగంగా వాహనాలు నడిపిన వారికి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని, రాజీవ్ రహదారి, ఇతర స్టేట్ హైవేలపై రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని వివరించారు.

# ఆహారభద్రత అధికారి ఆకస్మిక తనిఖీ..



**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ పట్టణంలో ఆకస్మిక తనిఖీ చేసిన ఆహార భద్రత అధికారిని ప్రత్యూష కొన్ని దుకాణదారులు నాణ్యత లేని కారణంగా బేకిరిలు కిరాణ షాపులు, బిర్యానీ పాయింట్లు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు బంద్ చేసుకున్న యజమానులు. పట్టణం లోని పలు దుకాణంలో హోటల్స్‌లో తనిఖీ చేశారు. బిర్యానీ హోటల్స్ తనిఖీ చేసి టెస్టింగ్ కొరకు శ్యాంపుల్స్ తీసుకెళ్లిన అధికారి.రాందేవ్ దుకాణంలో 9000 వేలు అంబర్, గుట్కా సీజ్ చేసి కేసు నమోదు చేశారు. గుట్కాను స్వాధీనం చేసుకొని లైసెన్స్ లేని దుకాణా దారులను వెంటనే ఏడు రోజులలో తప్పనిసరి లైసెన్సు తీసుకోవాలని చెప్పిన ఆహార భద్రత అధికారి ప్రత్యూష.

# తోపులాటలో వ్యక్తి మృతి..



**ప్రజాపక్షం/నేరడిగొండ:** నేరడిగొండ మండల కేంద్రంలో గురువారం ఉదయం ఇద్దరు వ్యక్తుల తోపులాటలో ఒక వ్యక్తి మృతి చెందాడని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గుండేటి శేఖర్(34)ని బత్తుల వెంకటేష్ అనే వ్యక్తి కూలి డబ్బుల విషయమై ఒకరికి ఒకరు తోపులాడుకుని శేఖర్ గొంతునులుమి శ్వాస ఆడక పోగా వెంటనే 108కి ఫోన్ చేసి ఆసుపత్రికి తరలించగ డాక్టర్ చనిపోయాడని నిర్ధారించారని తెలిపారు.అనంతరం పంచనామ నిర్వహించి కుటుంబ సభ్యులకి శవాన్ని అప్పగించడం జరిగిందని, నిందితుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

# భారీగా గంజాయి పట్టివేత

**ప్రజాపక్షం/పటాన్‌చెరు :** పటాన్ చెరు మండలం బిడిఎల్ భానూరు పోలీస్ స్టేషన్ పరిదిలో భారీగా గంజాయి పోలీసులు పట్టుకున్నారు. బ్రిజా కారులో తరలిస్తున్న 12లక్షల 50వేల విలువగల 50 కిలోల ఎండు గంజాయి ని పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. కర్టాటక రాష్ట్రానికి బాల్కీ కి చెందిన మల్లేష్ జాదవ్ ( 26) అనే వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుండి రెండు కార్లు, ఒకబైక్ రెండుమొబైల్ ఫోన్స్ స్వాదీనం చేసుకున్నారు. ఓరిస్సా మల్కాన్‌గిరి నుండి మహారాష్ట్ర వైపు తరలిస్తున్నట్లు విచారణలో తెలిసిందని, ఇతనితో మరో ముగ్గురు దాదా పాటిల్ ప్రవీణ్, బీదన్ పరారీలో ఉన్నారని పటాన్‌చెరు డిఎస్‌పి రవీందర్ రెడ్డి మీడియా సమావేశంలో వెల్లడించారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

## మంత్రి దామోదర్ రాజనర్సింహ్మా



**ప్రజాపక్షం/మెదక్‌ప్రతినిధి:** రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా, నిర్వహించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజ నర్సింహ్మా అధికారులను ఆదేశించారు. గురువారం మెదక్ జిల్లా పిల్లి కొట్యల్ లో వైద్య కళాశాల ఎంబిబిఎస్ ప్రారంభోత్సవం అనంతరం వైద్యం, వ్యవసాయం, జిల్లా గ్రామీణ అభివృద్ధి, మార్కెటింగ్ సంబంధిత అధికారులతో మంత్రి దామోదర రాజ నర్సింహ్మా, జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సమర్థవంతమైన పాలన లక్ష్యంగా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందాలని వ్యవసాయపరంగా రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని ధాన్యం కొనుగోలు కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించి రైతులకు సకాలంలో డబ్బులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎన్ని నిర్వహిస్తున్నారు కొనుగోలు సక్రమంగా నడుస్తుందా రవాణా విషయంలో తీసుకుంటున్న చర్యలు క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు వస్తున్నాయా అనే విషయాలను జిల్లా పౌరసరఫరాల శాఖ ద్వారా సమగ్ర నివేదికలు అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయిలో లోటుపాట్లను సరిదిద్దుకొని పని చేయాలని ఆదేశించారు. రుణ మాఫీకి సంబంధించి ఎంతమంది రైతులు లబ్ధి పొందారు. ఇంకా ఎవరెవరికి రుణమాఫీ చేయాల్సి ఉంది. బ్యాంకులతో ఏమైనా సమస్య ఉన్నదా, అనే విషయాలపై సమగ్ర నివేదిక తయారు చేయాలని, జిల్లా వ్యవసాయ అధికారి గోవిందుని ఆదేశించారు. మార్కెటింగ్ శాఖ ద్వారా పత్తి కొనుగోలు సక్రమంగా నడుస్తుందా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైద్య ఆరోగ్య శాఖ ద్వారా జిల్లా జనసాంద్రత ఆధారంగా కొత్త ఆరోగ్య ఉప కేంద్రాలు ప్రతిపాదనలు పెట్టాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారికి సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, ఎమ్మెల్సీ సుభాష్ రెడ్డి, నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డి, కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# జర్మన్ పార్లమెంట్ వ్యాపార ప్రతినిధి బృందంతో ఎమ్మెల్యే భేటీ



**ప్రజాపక్షం/నిజాంసాగర్:** స్టేట్ పార్లమెంట్ అధ్యక్షుడు హెండ్రిక్ హెరింగ్ నేతృత్వంలో జర్మన్ పార్లమెంట్ వ్యాపార ప్రతినిధి బృందంతో జరిగిన సమావేశంలో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు గురువారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విధానాలు, పథకాలు, ఉపాధి, పెట్టుబడులు తదితర అంశాలను గురించి చర్చించారు. ఈ సమావేశంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేంధర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో పేరు నమోదు చేసుకోవాలి

## కలెక్టర్ అభిలాష అభినవ్





**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్:** అర్హులైన ప్రతీ ఒక్కరూ ఉపాధ్యాయ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పేరును నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ఉపాధ్యాయులు,విద్యాశాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా విధిగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు కోసం తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. గత ఎన్నికల్లో ఓటరుగా తమ పేరు నమోదు చేసుకున్నప్పటికిని, ఈ ఎన్నికల్లో కూడా కొత్తగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. వీలైనన్ని ఎక్కువ దరఖాస్తులు వచ్చే విధంగా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. ఆన్ లైన్,ఆఫ్ లైన్ విధానంలో ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవచ్చని, ఆఫ్ లైన్ విధానంలో అయితే తహసిల్దార్ లేదా ఆర్డీవో కార్యాలయాల్లో సంబంధిత దరఖాస్తు ఫారమ్ లు నింపి అర్హత పత్రాలు జత చేసి కార్యాలయాల్లో అందజేయాలన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పేరును నమోదు చేసుకోవడానికి నవంబర్ 6న గడువు ముగుస్తుందని, ఈలోగా అర్హులైనవారందరు ఓటరుగా తమ పేరును నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సహకారంతోనే బాలశక్తి కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు సామాజిక అభివృద్ధి సాధించడం కోసమే బాలశక్తి కార్యక్రమాన్ని రూపొందించినట్లు వివరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్(రెవెన్యూ) డీఆర్ఓ భుజంగరావు, డీఈవో రవీందర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి పరుశురాం, ఎన్నికల విభాగంపర్యవేక్షకులు శ్రీనివాస్,ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సర్వం కోల్పోయాం...

## నిర్వాసిత గ్రామాల ప్రజలపై రాజకీయం చేయొద్దు



**ప్రజాపక్షం/గజ్వేల్:** సర్వం కోల్పోయి బిక్కు బిక్కుమంటూ ఉంటున్న నిర్వాసిత గ్రామాల ప్రజలపై మాజీ మంత్రి హరీష్ రావు రాజకీయం చేయొద్దని, అంతేకాకుండా ముంపు గ్రామాల ప్రజలపై ఖర్చు చేసిన నిధుల వివరాలను ఆయన ప్రకటించాలని సిపిఐ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగు కృష్ణ డిమాండ్ చేశారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. తమపై పోలీసుల తుపాకులు ఎక్కుపెట్టించి డీసీఎంలలో తమను దొంగల్లా తరలించిన విషయాన్ని హరీష్ రావు మర్చిపోవద్దని, అలాగే నిర్వాసిత గ్రామాల ఉసురు తగలక మానదని అన్నారు. తమ త్యాగాన్ని అపహాస్యం చేసిన అప్పటి కలెక్టర్ వెంకట్రామిరెడ్డి మభ్యపెట్టే మాటలతో హామీలు గుప్పించి రోడ్డున పడేయగా, కెసిఆర్, హరీష్ రావు తమపై అక్రమ కేసులు నమోదు చేయించి పోలీసులచే తరిమి కొట్టించినట్లు గుర్తు చేశారు. అయితే పట్టా, ప్రభుత్వ, గ్రామకంఠం స్థలాలకు పరిహారం ఇస్తామని, 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరికి ప్యాకేజీలు వర్తింప చేస్తామని నిర్వాసిత గ్రామాల ప్రజలకు హామీ ఇచ్చిన వారు నమ్మించి గొంతు కోసినట్లు తెలిపారు. దమ్ముంటే నిర్వాసిత కాలనీ సందర్శించి తమకు వర్తింపజేసిన నిధుల వివరాలు చెప్పాలని డిమాండ్ చేశారు. కనీసం తమ గ్రామాల ప్రజలు చనిపోతే పూడ్చి పెట్టడానికి స్థలం కూడా ఇవ్వలేదని, చిన్నపాటి వర్షానికే ఇండ్లు నీటితో నిండి పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యను పరిష్కరించని పక్షంలో నిర్వాసిత గ్రామాల ప్రజలు ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫాంహౌజ్ ముట్టడిస్తారని హెచ్చరించారు. గజ్వేల్ ఎమ్మెల్యేగా తమకు అండగా నిలవాల్సిన కేసిఆర్ ముఖం చాటేయడం తగదని, ఇప్పటికైనా తమకు చేసిన అన్యాయాన్ని గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం నుండి బాధితులకు రావాల్సిన నిధులు రాబట్టాలని వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు పోచయ్య, రాజు, బిక్షపతి పాల్గొన్నారు.

# రక్తదాన శిబిరం

**ప్రజాపక్షం/బోథ్ :** పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం బోథ్ మండల కేంద్రంలో రక్తదాన శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా బోథ్ సిఐ రమేష్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితులలో రోగులకు రక్తదానం చేసి ప్రాణదాతలుగా మారాలని ఆయన అన్నారు. జిల్లా ఎస్‌పి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బోథ్ ఎస్ఐ ఎల్.ప్రవీణ్ కుమార్, ట్రైనీ ఎస్ఐ మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# 7వ బెటాలియన్ పోలీసు కుటుంబ సభ్యుల నిరసన

## కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** కాంగ్రెస్‌ప్రభుత్వం వెంటనే సమస్యను పరిష్కరించాలని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం జిల్లాలోని రూరల్ నియోజకవర్గంలోని డిచ్‌పల్లి 7వ బెటాలియన్‌లో పని చేస్తున్న పోలీసు సిబ్బంది కుటుంబ సభ్యులు నిరసన తెలిపి రోడ్డుపై బైఠాయించారు. ఆదిలాబాద్ రైతు ధర్నాకు వెళుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు నిరసన చేస్తున్న వారి వద్దకు వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమ కుటుంబ సభ్యులను 8 గంటలకు మించి పని చేయిస్తున్నారని ఐదేళ్ల తిరగక ముందే ఇష్టమచ్చినప్పుడు బదిలీ చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పిల్లల చదువుకు కూడా ఇబ్బందిగా మారుతుందని బెటాలియన్‌లో పని చేస్తున్న పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేసి నినాదాలు చేశారు. వారినుద్దేశించి కల్వకుంట్ల తారక రామారావు మాట్లాడుతూ పోలీసు కుటుంబాలకు పూర్తి మద్దతు మా పార్టీ తరపున ఉంటుందని, ఈ సమస్యను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే బీఆర్ఎస తరపున నిరసనకు పిలుపునిస్తామన్నారు. ఈ సందర్భంగా అక్కడికి చేరుకున్న బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పోలీసు కుటుంబ సభ్యులకు సర్ది చెప్పారు. మంత్రి కేటీఆర్ వెంట పాడి కౌశిక్‌రెడ్డి, బాల్క సుమన్, జాజల సురేందర్ తదితరులున్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/కౌడిపల్లి:** మండల పరిధిలోని వెంకట్రావుపేట్, నాగ్సన్ పల్లి, సలాబత్ పూర్ గ్రామాలలో గురువారం నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా వరి ధాన్యానికి మక్కా జనులకు బోనస్ ఎలాంటి షరతులు విధించకుండా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలోనే దళారుల వారి నుండి రైతులను కాపాడేందుకు స్వయంగా ప్రభుత్వమే మద్దతు ధరను ప్రకటించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిందని గుర్తు చేశారు. తడిసిన ధాన్యం తో పాటు చివరి గింజ వరకు దాన్యం కొనుగోలు చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ నహీముద్దీన్ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సార రామా గౌడ్, మాజీ సిడిసి చైర్మన్ దుర్గారెడ్డి, మాజీ ఎంపీపీ రాజు నాయక్, వైస్ ఎంపీపీ నవీన్ గుప్తా, నాయకులు కుదు బోద్దీన్, శివన్న, మాజీ సర్పంచులు ఆల్మాయిపేట ఎల్లం, సల్లావుద్దీన్, కొండల్ రెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, తహసిల్దార్ ఆంజనేయులు, ఐకెపి, ఏపీఎం సంగమేశ్వర్, ఏవో స్వప్న జాదవ్, ఆర్ఐ శ్రీహరి, నాయకులు, కాంతరావు, మండల యువ నాయకులు పోలా నవీన్, కాంతారావు, బి.మనోహర్ రెడ్డి, ప్రవీణ్, పిఏసిఎస్ డైరెక్టర్ మల్లేశం, కాంగ్రెస్ నాయకులు సయ్యద్ పాషా, భుజంపేట మాజీ సర్పంచ్, లక్ష్మణ్ సర్దార్, ఐకెపి సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వానికి రైతులపై పట్టింపు లేదు



ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** ప్రభుత్వానికి రైతులపై పట్టింపు లేదని, రైతులు దళారులకు ధాన్యం విక్రయిస్తుంటే ఏం చేస్తున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ ఆవరణలో మీడియాతో మాట్లాడారు. ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం ఇప్పుడు అదే బోనస్‌ను ఎగ్గొట్టేందుకు కుట్రలు చేస్తుందని విమర్శించారు. ఓ పక్క ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంబిస్తూ కొబ్బరికాయలు కొడుతున్నారని, మరోపక్క రైస్‌మిల్లుల అలాట్‌మెంట్ లేదన్నారు. ప్రభుత్వం చేతగాని తనం కారణంగా రైతులు దళారులకు ధాన్యం విక్రయించే పరిస్థితి వచ్చిందన్నారు. క్వింటాలుకు రూ.2300 మద్దతు ధరతో పాటు బోనస్ రూ.500 కలుపుకుని క్వింటాలు ధాన్యానికి రూ.2800 రైతులకు దక్కాల్సి ఉండగా దళారులకు రైతులకు రూ.2100 కే విక్రయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వద్ద ఏ రోజు ఎంత విస్తీర్ణంలో వరిసాగు చేశాడనే లెక్కలున్నాయని, ఆ లెక్కల ప్రకారం రూ.500 చొప్పున బోనస్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో రైతుల దళారులకు ధాన్యం విక్రయించిన దాఖలాలు లేవన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్న దళారులు వారిని మోసం చేస్తే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వమే బాధ్యత వహించి రైతులకు డబ్బులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. బీఆర్ఎస్ హాయంలో రైతులకు ఏనాడు ఇబ్బందులు కలుగకుండా చూశామన్నారు. మాజీ రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులు ఉన్నారు.

# రైతు సంక్షేమమా... నీ అడ్రస్ ఎక్కడా?

## ప్రభుత్వ పనితీరుపై రైతుల నిరసన



**ప్రజాపక్షం/నందిపేట్:** దేశంలో అన్ని పార్టీలు తాము రైతుల సంక్షేమం కోసం పాటుపడుతామని చెబుతున్నా అన్ని వాగ్దానాలకే పరిమితం అవుతున్నాయని తెలంగాణ ప్రభుత్వ పనితీరు చెబుతుంది. ఎన్నిక సమయంలో ఇచ్చిన హామీలు మాటలకే పరిమితం అవుతున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల అభ్యున్నతికి కృషి చేస్తామని ఎన్నికల సమయంలో విస్తృత ప్రచారం చేసింది. రైతు భరోసా పెంచి ఇస్తామని, రెండు లక్షల పంట రుణాలు మాఫీ చేస్తామని, సన్నాలకు బోనస్ ఇస్తామని, సకాలంలో వరి కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని, వారంరోజుల్లో వడ్ల డబ్బులు బ్యాంకు ఖాతాల్లో వేస్తామని, పంట నష్ట పరిహారం చెల్లిస్తామని ఇలా రైతుల కోసం ఎన్నో హామీలు ఇచ్చింది. నమ్ముకున్న రైతన్న కాంగ్రెస్‌కు ఓటు వేసి గెలిపించారు. తీరా ఏ ఒక్కసమస్య పూర్తిగా అమలు చేయడ లేదు. ఇదేనా రైతు సంక్షేమం అంటు రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతు భరోసా ఒక్క పంటకు గత ప్రభుత్వం ఎకరానికి రూ. 5 వేలు సకాలంలో చెల్లించింది. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు రూ. 7500 పెంచి ఇస్తామని హామీ ఇచ్చింది. ఖరీఫ్ పంట వేసేటప్పుడు పెట్టుబడి సహాయం కింద రైతు భరోసా డబ్బులు ఇవ్వాలి. కానీ గత ప్రభుత్వ హయాంలో పెద్ద రైతులకు, రాళ్లు రప్పలు ఉన్న భూములకు డబ్బులు ఇచ్చారని, అవకతవకలు జరిగాయని విచారణ జరిపి ఇస్తామని చెప్పారు. తీరా పంట రైతులు చేతికి వచ్చినా రైతు భరోసా జాడలేదు. మంత్రి వర్గ కమిటి నిర్ణయం వచ్చిన తరువాత వచ్చే యాసంగికి ఇస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రకటన చేశారు. దీంతో రైతుల ఆశలు అడియాశలు అయినాయి. ఏది రైతు సంక్షేమం. రెండు లక్షలు రుణ మాఫీ చేస్తామని చెప్పారు. కానీ ఇంతవరకు అందరికి మాఫీ కాలేదు.

రెండు లక్షల పైన ఉన్న రుణాలు కూడా మాఫీ చేస్తామని చెప్పిన రాష్ట్రంలో సగం రైతులకు కూడా వర్తించలేదు. రుణమాఫీ గురించి కాంగ్రెస్ పార్టీ తప్ప మిగతా పార్టీలు, రైతులు ఆందోళన చేసినా ఫలితం లేదు. ఇదేనా రైతు సంక్షేమం అని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఇకపోతే ఖరీఫ్‌లో పండించిన వరి పంట కొనడానికి దసరా పండుగ తరువాత కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి వడ్లు కొంటామని స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పారు. కానీ దసరా పండుగ అయిపోయి 15రోజులు గడుస్తున్నా ఒక్క దాన్యం గింజ కొనుగోలు చేయలేదు. రైతులు పంటను కోసి నెలరోజులు గడుస్తున్నా కొనుగోలు కేంద్రాల జాడలేదు. అకాల వర్షాలు పడుతున్నా అధికారులు, ప్రభుత్వం చూస్తూ రైతుల ఆవేదన అర్థం చేసుకోవడం లేదు. సన్నాలకు క్వింటాలుకు రూ. 500 బోనస్ ఇస్తామని చెప్పడంతో రైతులు దళారులకు అమ్మకుండా ధాన్యాన్ని చూస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. రైస్ మిల్లర్లతో చర్చలు చేస్తున్నామని ప్రభుత్వం కాలం వెల్లదీస్తుంది. ప్రభుత్వం ఇచ్చే బోనస్ వద్దు, కొనుగోలు కేంద్రాలు వద్దు అంటు చాలా మంది రైతులు పచ్చి, ఎండిన ధాన్యంను తక్కువ రేటు అయిన అమ్ముకుంటున్నారు. ఇలా ప్రబుత్వం నిలువునా మోసం చేస్తుందని అనుకోలేదని రైతులు తిట్టుకుంటున్నారు. గత ప్రభుత్వం మేలని ముందుగానే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది కలుగకుండా చేసిందని గుర్తుచేస్తున్నారు. రైతులకు పంట నష్టపరిహారం అందరికి రాలేదు. ఇలా ప్రభుత్వం రైతులను వేదిస్తే పుట్ట గతులు ఉండవని తిట్టిపోస్తున్నారు. ప్రభుత్వ పనితీరు ఇదేనా... వేలాది రూపాయలు ఖర్చులు చేసి పంట పండించామని, వెంటనే ధాన్యం కొనాలని, లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయం ఎలా ఉంటుందో చూడాలి...

క్రీడ

# న్యూజిలాండ్ 259 'ఆలౌట్'

## భారత్ 16/1



**న్యూజిలాండ్‌తో** రెండో టెస్ట్‌లో టీమిండియా ఆధిపత్యం చెలాయిస్తోంది. గురువారం పుణె వేదికగా ప్రారంభమైన ఈ మ్యాచ్‌లో ముందుగా బౌలింగ్‌లో సత్తా చాటిన టీమిండియా.. అనంతరం ఆచితూచి బ్యాటింగ్ చేసింది. తొలి రోజు ఆట ముగిసే సమయానికి భారత్ 11 ఓవర్లలో వికెట్ నష్టానికి 16 పరుగులు చేసింది.రోహిత్ శర్మ(0) డకౌటవ్వగా.. యశస్వి జైస్వాల్(6 బ్యాటింగ్), శుభ్‌మన్ గిల్(10 బ్యాటింగ్) మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడారు. న్యూజిలాండ్ బౌలర్లలో టీమ్ సౌథీ ఓ వికెట్ తీసాడు. అంతకుముందు న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 79.1 ఓవర్లలో 259 పరుగులకు ఆలౌటైంది.

**అశ్విన్–సుందరం..**

డెవాన్ కాన్వే(141 బంతుల్లో 11 ఫోర్లతో 76), రచిన్ రవీంద్ర(105 బంతుల్లో 5 ఫోర్లు, సిక్స్‌తో 65) హాఫ్ సెంచరీలతో రాణించగా.. మిచెల్ సాంట్నర్(51 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 33) పర్వాలేదనిపించాడు. భారత బౌలర్లలో వాషింగ్టన్ సుందర్(7/59), రవిచంద్రన్ అశ్విన్(3/64) కివీస్ పతనాన్ని శాసించారు. 147 ఏళ్ల టెస్ట్ క్రికెట్ చరిత్రలో ఒకే ఇన్నింగ్స్ ఆఫ్ స్పిన్నర్లే 10 వికెట్లు తీ యడం ఇదే తొలిసారి.

**దెబ్బతీసిన అశ్విన్..**

టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ ఇన్నింగ్స్‌ను ఓపెనర్లు టామ్ లాథమ్(15), డెవాన్ కాన్వే నిదానంగా నడిపించారు. భారత బౌలర్ల సహనానికి పరీక్షగా నిలిచిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. తన తొలి ఓవర్‌లోనే టామ్ లాథమ్(15) వికెట్ల ముందు బోల్తా కొట్టించాడు. క్రీజులోకి వచ్చిన విల్ యంగ్ కూడా జిడ్డు బ్యాటింగ్‌తో కాన్వేకు అండగా నిలిచాడు. అతన్ని అశ్విన్ కీపర్ క్యాచ్‌గా బోల్తా కొట్టించాడు. ఈ వికెట్ విషయంలో ముందుగా అంపైర్ నాటౌట్ ఇచ్చాడు. కానీ షార్ట్ లెగ్‌లో ఫీల్డింగ్ చేసిన సర్ఫరాజ్ ఖాన్.. రోహిత్ శర్మతో పట్టుబట్టి రివ్యూ తీసుకున్నాడు. రిప్లేలో బంతి బ్యాట్‌కు తాకినట్లు తేలడంతో విల్ యంగ్ క్యాచ్ ఔట్‌గా పెవిలియన్ చేరాడు. క్రీజులోకి రచిన్ రవీంద్ర రాగా.. న్యూజిలాండ్ 92/2 లంచ్‌బ్రేక్‌కు వెళ్లింది.

**మలుపు తిప్పిన సుందరం..**

సెకండ సెషన్‌లో డెవాన్ కాన్వే 109 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. రచిన్‌తో కలిసి ఆచితూచి ఆడిన అతను సెంచరీ దిశగా మారాడు. క్రీజులోప్రమాదకరంగా మారిన ఈ జోడీని అశ్విన్ విడదీసాడు. కాన్వేను కీపర్ క్యాచ్‌గా పెవిలియన్ చేర్చాడు. దాంతో మూడో వికెట్‌కు నమోదైన 62 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. కాన్వే ఔటైనా.. టామ్ బ్లండెల్‌తో కలిసి డారిల్ మిచెల్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. 83 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. 59 పరుగుల భాగస్వామ్యంతో ప్రమాదకరంగా మారిన ఈ జోడీని వాషింగ్టన్ సుందర్ విడదీసాడు. స్టన్నింగ్ డెలివరీతో రచిన్ రవీంద్రను క్లీన్ బౌల్డ్ చేశాడు. ఈ వికెట్ న్యూజిలాండ పతనాన్ని శాసించింది. టామ్ బ్లండెల్‌ను కూడా ఇదే తరహాలో సుందర్ క్లీన్ బౌల్డ్ చేశాడు. దాంతో న్యూజిలాండ 201/5 స్కోర్‌తో టీ బ్రేక్‌కు వెళ్లింది. చివరి సెషన్‌లోనూ వాషింగ్టన్ సుందర్ చెలరేగాడు. డారిల్ మిచెల్(18), టామ్ బ్లండెల్(3), గ్లేన్ ఫిలిప్స్(9), మిచెల్ సాంట్నర్(33), టీమ్ సౌథీ, ఆజామ్ పటేల్‌లను పెవిలియన్ చేర్చి న్యూజిలాండ్‌ను తక్కువ స్కోర్‌కే పరిమితం చేశాడు.

# నాకు గుర్తుండిపోయే ఇన్నింగ్స్ అతడిదే: పాట్ కమిన్స్



**భారత్**, ఆస్ట్రేలియా మధ్య మ్యాచ్ ఏ ఫార్మాట్‌లో అయినా రసవత్తరంగా ఉంటుంది. ఎలాంటి పరిస్థితుల్లోనైనా గెలుపు కోసం ఇరుజట్లు చివరి దాకా పోరాడతాయి. ఈ క్రమంలోనే రెండు జట్లకు చెందిన చాలామంది ఆటగాళ్లు తమ కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోయే ఇన్నింగ్స్‌లు ఆడారు. నవంబర్‌లో బోర్డర్‌గావస్కర్ ట్రోఫీ ప్రారంభంకానుంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ భారత ఆటగా ళ్లలో ఎవరి ఇన్నింగ్స్ ఇష్టమో చెప్పాడు. సచిన్ ఆట అంటే ఎంతో ఇష్టమన్న కమిన్స్.. ఇటీవల స్టార్‌స్పోర్ట్స్‌తో మా ట్లాడిన కమిన్స్ 'సిడ్నీలో సచిన్ తెండూల్కర్ ఆడిన ఇన్నింగ్స్ మాత్ర మే నాకు గుర్తుంది' అని పేర్కొన్నాడు. 2004లో భారత్.. ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లింది. సిడ్నీ వేదికగా జరిగిన నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్‌లో సచిన్ (241; 436 బంతుల్లో 33 ఫో ర్లు) డబుల్ సెంచరీ బాదాడు. తెండూల్కర్ ఆడిన మరపురాని ఇ న్నింగ్స్‌ల్లో ఇది ఒకటి. కవర్ డ్రైవ్ షాట్లలో నిష్ణాతుడైన సచిన్ ఈ మ్యా చ్‌కు ముందు వరుసగా తక్కువస్కోర్లకే ఔటయ్యాడు. దీంతో సిడ్నీ టె స్టులో ఆ షాట్ ఆడొద్దని నిర్ణయించుకున్న తెండూల్కర్ తొలి ఇన్నింగ్స్ మొత్తంలో ఒక్క కవర్ డ్రైవ్ షాట్ కూడా కొట్టకుండా డబుల్ సెంచరీ చేశాడు. వీవీఎస్ లక్ష్మ ణ్ (178) కూడా భారీ ఇన్నింగ్స్ ఆడటంతో ఫస్ట్ ఇన్నింగ్స్‌ను భారత్ 705/7 వద్ద డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో రాహుల్ ద్రవిడ్ (91), సెహ్వాగ్ (47), సచిన్ (60) రాణించారు.

# దశాబ్దం తర్వాత ఆసియాలో సౌతాఫ్రికా విజయం..

## తలకిందులైన డబ్ల్యూటిసి టేబుల్!

ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో దక్షిణాఫ్రికా ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రెండు టెస్టుల సిరీస్‌లో 1–0తో ఆధిక్యంలో నిలిచింది. దాదాపుగా దశాబ్దం తర్వాత ఆసియాలో సౌతాఫ్రికా టెస్టు గెలుపు రుచి చూసింది. అంతకుముందు 2014లో గాలె వేదికగా శ్రీలంకపై సఫారీ సేన గెలిచింది. పదేళ్ల తర్వాత ఇప్పుడు విజయాన్ని అందుకుంది. ఇక బంగ్లాదేశ్‌లో 2008 తర్వాత టెస్టు మ్యాచ్ నెగ్గడం దక్షిణాఫ్రికాకు ఇదే తొలిసారి. 283/7 స్కోరుతో నాలుగో రోజు ఆట ఆరంభించిన బంగ్లాదేశ్ 307 పరుగులకు ఆలౌటైంది. మెహదీ హసన్ మీర్జా (97) ఆఖరి వికెట్‌గా వెనుదిరిగాడు. దక్షిణాఫ్రికా బౌలర్లలో రబాడ ఆరు వికెట్లతో చెలరేగాడు. మ హరాజ్ మూడు వికెట్లు, ముల్డర్ ఒక్క వికెట్ పడగొట్టాడు. అనంతరం 106 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన దక్షిణాఫ్రికా మూడు వికెట్లు కోల్పోయి విజయాన్ని సాధిం చింది. టోనీ డిజోర్జి (41), ట్రిస్టన్ స్టబ్స్ (30 నాటౌట్), ఎయిడెన్ మార్క్‌రమ్ (20) సత్తా చాటారు. తైజుల్ ఇస్లామ్ మూడు వికెట్లు తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో బంగ్లాదేశ్ 106 పరుగులకు ఆలౌటైంది. మహ్మదుల్ హసన్ (30) టాప్ స్కోరర్. రబాడ, ముల్డ ర్, మహరాజ్ తలో మూడు వికెట్లు తీశారు. దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్‌లో 308 పరు గులు చేసింది. కైల్ వెరియన్ (114) సెంచరీ, ముల్డర్ (54) అర్ధశతకం సాధించారు. బంగ్లా బౌలర్లలో తైజుల్ ఇస్లామ్ అయిదు వికెట్లు, హసన్ మహ్మద్ మూడు వికెట్లు తీ శారు. దక్షిణాఫ్రికా విజయంతో వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ టేబుల్‌లో జట్ల స్థా నాలు మారిపోయాయి. సౌతాఫ్రికా 47.62 విజయశాతంతో నాలుగో స్థానానికి ఎగ బా కింది. ఫైనల్ రేసులో పోటీగా నిలిచింది. భారత్ (68.06), ఆస్ట్రేలియా (62.50), శ్రీ లంక (55.56) టాప్3లో ఉన్నాయి. అయితే దక్షిణాఫ్రికా 4వ స్థానానికి చేరడంతో న్యూజిలాండ్ (44.44), ఇంగ్లండ్ (43.06) అయిదు, ఆరు స్థానాలకు పడిపోయా యి. బంగ్లాదేశ్ (30.56), పాకిస్థాన్ (25.93), వెస్టిండీస్ (18.52) అట్టడుగున ఉన్నాయి.

రీల్



# ఓరోజు ముందే పుష్ప 2 రిలీజ్

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ హీరోగా రష్మికా మందన్నా హీరోయిన్ గా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కిస్తున్న అవైటెడ్ పాన్ ఇండియా సీక్వెల్ చిత్రం పుష్ప 2 కోసం అందరికీ తెలిసిందే. మరి ఎన్నో అంచనాలు ఉన్న ఈ సినిమాని ఆల్రెడీ పలు పలు వాయిదాలు తర్వాత డిసెంబర్ 6కి ఫిక్స్ చేసిన సంగతి తెలిసిందే. మరి ఈ డేట్ లో కూడా కాదు కొంచెం ముందే సినిమా వస్తుంది అని ఆ మధ్య మేము తెలిపాము. అయితే ఇప్పుడు ఫైనల్ గా మేకర్స్ ఆ బిగ్ అనౌన్సమెంట్ ని అఫీషియల్ గా ఇచ్చేసారు. నేషనల్ ప్రెస్ మీట్ లో పుష్ప 2 సినిమాని ఈ డిసెంబర్ 6న కాకుండా డిసెంబర్ 5న రిలీజ్ చేస్తున్నట్టుగా ఒక అదిరే పోస్టర్ తో తెలిపారు. మరి ఇందులో బన్నీ సాలిడ్ మాస్ లుక్ లో కనిపిస్తున్నాడు. మొత్తానికి అయితే ఈ సినిమా వరల్డ్ వైడ్ టేకోవర్ డిసెంబర్ 5 నుంచి ఉంటుంది అని చెప్పాలి.



# కళ్యాణ్ రామ్ భారీ సినిమా!

ప్రస్తుతం నందమూరి కళ్యాణ్ రామ్ హీరో గానే కాకుండా నిర్మాతగా కూడా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి రీసెంట్ గానే తన సోదరుడు జూనియర్ ఎన్టీఆర్ తో దేవర అనే భారీ హిట్ అందుకొని ఫుల్ ఫామ్ లో ఉన్నారు. ఇక ఈ సినిమా కాకుండా కళ్యాణ్ రామ్ హీరోగా నటిస్తున్న భారీ సినిమా ఇంకొకటి ఉంది. తన కెరీర్ 21వ సినిమాగా దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కిస్తున్న ఈ సినిమా సాలిడ్ యాక్షన్ ప్రాజెక్ట్ గా మంచి అంచనాలు సెట్ చేసుకుంది.అయితే ఈ సినిమా షూటింగ్ పై లేటెస్ట్ అప్డేట్ తెలుస్తోంది. మేకర్స్ ఓ కీలక షెడ్యూల్ కోసం వైజాగ్ కి షిఫ్ట్ అయ్యినట్టుగా ఇప్పుడు కన్ఫర్మ్ అయ్యింది. అక్కడ కొన్ని ముఖ్యమైన సీక్వెన్స్ లను వారు తెరకెక్కించనున్నారట. మొత్తం 15 రోజులు పాటు సాగే ఈ షెడ్యూల్ లో సినిమా ప్రధాన తారాగణం నటించనున్నారట. ఇక ఈ సినిమాలో హీరోయిన్ గా సాయి మంజ్రేకర్ నటించగా అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నాడు.



# 'అన్‌స్టాపబుల్' లో 'కంగువా' ప్రమోషన్స్!

**త**మిళ హీరో సూర్య నటిస్తున్న 'కంగువా' చిత్రం నవంబర్ 14న గ్రాండ్ రిలీజ్‌కు రెడీ అయ్యింది. ఈ సినిమాను దర్శకుడు శివ డైరెక్ట్ చేస్తుండగా, ఇప్పటికే ఈ చిత్రం పోస్టర్స్, టీజ ర్, ట్రైలర్లు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఇక ఈ చిత్రాన్ని పాన్ ఇండియా స్థాయిలో ప్రమోట్ చేస్తూ చిత్ర యూనిట్ బిజీగా ఉంది. ఈ చిత్రాన్ని తెలుగులో ప్రమోట్ చేసేందుకు 'కంగువా' టీమ్ హైదరాబాద్ వచ్చారు. ఇందులో భాగంగా అక్టోబర్ 24న ఓ ప్రెస్ మీట్ కూడా ఏర్పాటు చేశారు మేకర్స్. అయితే, దీంతో పాటు స్టార్ హీరో నందమూరి బాలకృష్ణ హోస్ట్ చేస్తున్న 'అన్‌స్టాపబుల్ 4'లోనూ 'కంగువా' టీమ్ సందడి చేసారు. దీనికి సంబంధించిన షూట్ అక్టోబర్ 24న జరగింది. ఇలా తెలుగులోనూ భారీ ప్రమోషన్స్ ప్లాన్ చేసిన 'కంగువా' చిత్రంలో బాబీ డియోల్, దిశా పటాని తదిత రులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని యూ వీ క్రియేషన్స్, స్టూడియో గ్రీన్ బ్యానర్లు ప్రొడ్యూస్ చేస్తున్నాయి.

# త్వరలో రెడ్‌బుక్

**(మొదటి పేజీ తరువాయి)**

ఉన్నతాధికారులపై త్వరలో రెడ్ బుక్ ఓపెన్ చేస్తామని మహేష్‌కుమార్ చెప్పారు. రాష్ట్రంలో ఐఎఎస్, ఐపిఎస్ అధికారులు తక్కువగా ఉన్నారని, అందులో మంచి అధికారులు చాలా తక్కువగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు. మాజీ సిఎం కెసిఆర్‌ను ఆదర్శంగా తీసుకోవాల్సిన ఖర్మ కాంగ్రెస్‌కు పట్టలేదన్నారు. గాంధీభవన్‌లో గురువారం మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవనంపై ఒక వైపు బిఆర్ఎస్, మరో వైపు బిజెపి అడ్డగోలుగా అబద్ధాలు ఆడుతున్నాయని టిపిసిసి అధ్యక్షుడు బి.మహేష్ కుమార్ గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సోషల్ మీడియా విష ప్రచారం దుబాయ్, సింగపూర్ నుండి కొనసాగుతున్నాయని, పోలీసులు కూడా దాన్ని కనుక్కోలేక పోతున్నారని అన్నారు. హైదరాబాద్ బాగోగులు కోరుకునే వారు మూసీ నది పునరుజ్జీవనానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటివరకు మూసీ పునరుజ్జీవనం కోసం డిపిఆర్‌ను రూపొందించేందుకు రూ.140 కోట్లు తప్పా ఒక్క రూపాయి కూడా అదనంగా మూసీకి కేటాయించలేదని ఆయన స్పష్టం చేశారు. మూసీ విషయంలో నల్లగొండ జిల్లా ఎంఎల్‌ఎలు త్వరలో సమావేశం నిర్వహించనున్నారని, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి కూడా మద్దతు తెలిపారని మహేష్‌కుమార్ చెప్పారు. బిఆర్ఎస్ నాయకుల ప్రోద్బలంతో హత్య జరిగిందని కాంగ్రెస్ ఎంఎల్‌సి టి.జీవన్‌రెడ్డి అనుకుంటున్నారని, అది వ్యక్తి గత కక్షలతో హత్య జరిగిందని తాము అ నుకుంటున్నామన్నారు. బిఆర్ఎస్ ఎంఎల్‌ఎ సంజయ్‌ని పార్టీలో చేర్చుకున్నప్పుడు జీవన్‌రెడ్డి ఒప్పుకోలేదని, సంజయ్ కాంగ్రెస్‌కు మద్దతు ఇస్తున్న ఎంఎల్‌ఎ అన్నారు. జీవన్‌రెడ్డి వ్యవహారం మంత్రి శ్రీధర్‌బాబు చూసుకుంటారని, ఆయన ఇచ్చే నివేదిక ప్రకారం పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బిఆర్ఎస్, బిజెపి వారు సోషల్ మీడియాను అనైతికంగా వాడుకుని ప్రభుత్వంపై, కాంగ్రెస్ పా ర్టీపై అసత్య ప్రచారం చేస్తున్నారని, కాంగ్రెస్ మాత్రం సోషల్ మీడియాను నైతికంగా వాడుతున్నదని ఆయన అ న్నారు. పదేళ్లలో కెసిఆర్ ఎనిమిది లక్షల కోట్ల అప్పు చేశారని, రాష్ట్రం ఆర్థిక నిర్బంధంలో ఉన్నప్పటికీ పరిపాలన సాగిస్తున్నదనే విషయాన్ని రాష్ట్ర ప్రజలు గమనించాలన్నా రు. బిఆర్ఎస్ పది ఏండ్లలో 70 వేల ఉద్యోగాలు ఇవ్వగా, కాంగ్రెస్ పది నెలల్లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చిందని చెప్పారు.

# రాష్ట్ర హోదాకు యత్నాలు

**(మొదటి పేజీ తరువాయి)**

తెలుస్తోంది. ప్రధానిని కలుసుకోవడానికి ముందు కేంద్ర హోంమంత్రి అమిత్ షాతో ఒమర్ భేటీ అయిన సంగతి తెలిసిందే. జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా పునరుద్ధరణ అంశంపై వీరిద్దరూ చర్చించినట్లు సమాచారం. ఈ పునరుద్ధరణ ప్రక్రియను ప్రారంభించే యోచనలో కేంద్రం ఉందని, ఈ మేరకు హామీ లభించిందని కథనాలు వెలువడ్డాయి. జమ్మూకశ్మీర్ కేంద్రపాలిత ప్రాంతంగా మారిన తర్వాత తొలిసారి ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఎన్‌సి, కాంగ్రెస్ కూటమి విజయం సాధించింది. 90 స్థానాల శాసనసభలో ఎన్‌సి 42 సీట్లలో, కాంగ్రెస్ 6 స్థానాల్లో నెగ్గింది.

# ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చడం గర్హనీయం : బండి సంజయ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ''మూసీ పునరుజ్జీవం'' పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్ల కూల్చడం గర్హనీయమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. దీనిని బిజెపి పార్టీ తరుపున తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. గత పాలకులు లక్ష కోట్ల రూపాయలకుపైగా అప్పు చేసి కాళేశ్వరం ప్రాజెక్టును ఏటీఎంలా వాడుకుంటే, ఇప్పుడు కాంగ్రెస్ పాలకులు 'మూసీ పునరుజ్జీవం' పేరుతో మరో లక్షన్నర కోట్లు అప్పు చేసి ఏటీఎం మాదిరిగా వాడుకోవాలని చూస్తుండటం బాధాకరమన్నారు. గత పాలకులు చేసిన దాదాపు రూ.6 లక్షల కోట్ల పైచిలుకు అప్పులకు 10 నెలల్లోనే రూ.60 వేల కోట్లు వడ్డీల రూపంలో చెల్లిస్తున్న ప్రజాధనాన్నివృధా అవుతోందన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించడానికే నానా తంటాలు పడుతూ సంక్షేమ పథకాలను అమలు చేయలేని పరిస్థితి నెలకొనడమేకాకుండా ఉద్యోగులకు జీతాలు కూడ ఇచ్చేందుకు డబ్బులు లేక రాష్ట్ర ప్రభుత్వం తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతోందన్నారు. ఈ పరిస్థితుల్లో మరో లక్షన్నర కోట్ల రూపాయల మేరకు అప్పు చేసి మూసీ పునరుజ్జీవం పేరుతో పేదల ఇళ్లను కూల్చడం న్యాయమా అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరును నిరసిస్తూ మూసి బాధితుల తరుపున నేడు ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన మహాధర్నాను విజయవంతం చేయాలని బండి సంజయ్ కోరారు.













# ముఖ్యమంత్రి సహాయ నిధికి బ్యాంక్ ఆఫ్‌బరోడా రూ.1 కోటి విరాళం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి బ్యాంక్ ఆఫ్ బరోడా 1కోటి రూపాయల విరాళం అందించింది. గురువారం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలిసి బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్ రితేశ్ కుమార్ , డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎంవిఎస్ సుధాకర్ విరాళం చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వరద బాధితుల సహాయం కోసం ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలకు అండగా కోటి రూపాయాలను విరాళంగా అందించిన బ్యాంక్ ఆఫ్‌బరోడా అధికారులను ముఖ్యమంత్రి అభినందించారు.











Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State,
Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR - 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com